తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

22-3-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 50 పేజీలు: 10+4 వెల: 8.00




# వార్ ఆపండి

## చర్చలు జరపండి

### యుద్ధ ఉద్రిక్తతలపై ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్

**దాడుల వల్ల ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు**

**ఇంధన కొరత పెరుగుతోందని ఆందోళన**

**భారత్ పౌరుల భద్రతకు సహకరిస్తున్నందుకు మోడీ కృతజ్ఞతలు**

**న్యూఢిల్లీ, మార్చి 21:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం ఉగ్రరూపం దాల్చుతున్న తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మరోసారి ఫోన్‌లో సంభాషించారు. శనివారం జరిగిన ఈ ఫోన్ కాల్‌లో మోడీ ఇరాన్ ప్రజలకు ఈద్, నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ప్రాంతీయ

>>2



## 'నో స్టాక్'!

**గ్యాస్‌కు తోడు పెట్రోలుకు కటకట**

**పలు బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు**

**రోడ్లపై తగ్గిన గ్యాస్ వాహనాలు**

**నిండుకున్న గ్యాస్, చమురు నిల్వలు**

**హైదరాబాద్, మార్చి 21,ప్రభాతవార్త:** అమెరికా, ఇజ్రాయల్‌దేశాలు కలిసికట్టుగా ఇరాన్‌పై యుద్ధం చేస్తుండటంతో తెలంగాణలో

>>2

**అమెరికా, ఇజ్రాయెల్ దళాల దాడులు ముమ్మరం** 7

6 గ్యారంటీల కోసం త్వరలో

## ప్రైవేటు బిల్లు

**మహిళలు, విద్యార్థులు.. అందరి తరపున బిల్లును ప్రవేశపెడతాం: కెటిఆర్**

2



వరంగల్‌లో రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న మంత్రి సురేఖ

## బుజ్జగింపులు విఫలం!

**జీవన్‌తో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి జగిత్యాలలో చర్చలు**

2









రంజాన్ సందర్భంగా శనివారం న్యూఢిల్లీలోని జామా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

# వార్ ఆపండి..

>> భద్రత, స్థిరత్వంపై కీలక అంశాలను చర్చించుకున్నారు. ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ ఘర్షణ పూరిత వాతావరణంలో ఉన్న నేపథ్యంలో ఈ సంభాషణకు దౌత్యపరంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు ను తీసుకురావాలని ఆకాంక్షించామని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోడీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హార్మ్యూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత, సంక్షేమానికి ఇరాన్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధాని మోడీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తమ పౌరుల భద్రతకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశాన్ని ఇది పరోక్షంగా తెలియజేసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో ఇదొక ముఖ్యమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసినట్లయింది. ఇదిలా ఉండగా, మార్చి 12న జరిగిన తొలి ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని మోడీ పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల మరణాలు, మౌలిక సదుపాయాల విధ్వంసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ స్థిరమైన వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. సరుకు రవాణా, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రాంతీయ స్థిరత్వంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

# 'నో స్టాక్'!

>> కూడా యుద్ధం యొక్క చేదు ఫలితాలు సృశిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధం కారణంగా ఇప్పటికే ఎల్‌పిజి గ్యాస్ కొరత ఏర్పడింది. దేశంలో ప్రతి ఇంటిని గ్యాస్ కొరత ఏదో ఒక రూపంలో ఇప్పటికే రూపంలో అనిశ్చితికి గురిచేస్తోంది. ఇప్పుడుదానికి తోడుగా డీజిల్ పెట్రోల్ సంక్షోభం కూడా తలెత్తింది. తెలంగాణలో శనివారం పలుబంకులు పెట్రోల్‌డీజిల్ నిల్వలు నిండుకోవడంతో నోస్టాక్ బోర్డు ను పెట్టాయి. దీనితో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ద్విచక్రవాహనదారులు సమీప పెట్రోల్ బంకుకు వారి వాహనాలను నెట్టుకొంటు తీసుకొన వెళ్ళినట్లు బంకు సమీపంలో పెట్రోల్ డీజిల్ వినియోగదారులు తెలిపారు. హిందుస్తాన్ పెట్రోల్,భారత్‌పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ బంకుల్లో చాలా వరకు నోస్టాక్ బోర్డులు ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పెట్రో కంపెనీలు తమ డీలర్లకు క్యాష్ అండ్ క్యారీ పద్ధతిలో పెట్రోల్ డీజిల్ సరఫరా చేస్తామని క్రెడిట్‌కు సరఫరా చేయలేమని చేతులు ఎత్తివేయడంతో చాలా మంది డీలర్లు నగదు చెల్లించకపోవడంతో వారికి స్టాకురానట్లు తెలిసింది.తెలంగాణలో 1,81,37,435 ద్విచక్ర వా హనాలు, ఆటోలు,బస్సులు,లారీలు,కార్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన మరో పదిలక్షల వాహనాలు రాష్ట్రంలోనే సంచరిస్తాయి. అవి కాకుండా రోజు నేషనల్ హైవేద్వారా ప్రయాణించే వేలాది వాహనాలకు కూడ ఇంధనం రాష్ట్రంలోని బంకులు సమకూర్చాల్సి ఉంటుంది. రోజుకు ఒక కోటి యాభైలక్షల డీజిల్, 97వేల లీటర్ల పెట్రోల్ విక్రయాలు జరుగుతాయి. బల్క్‌గా డీజిల్, పెట్రోల్ అమ్మకాలను కూడా పెట్రోల్ కంపెనీలు కట్టడి చేస్తోంది. ఏ ప్రైవేటు సంస్థలకు పెట్రోల్ బంకు నించి బల్క్‌గా పెట్రోల్ డీజిల్ పోయకూడదని ఇప్పటికే తాకీదులు ఇచ్చారు. ఒక వేళ బల్క్‌గా పోస్తే ఆయా బంకులకు పెట్రోల్ కానీ డీజిల్‌కానీ ఇవ్వలేమని తెలిపింది. ఇప్పటికే ప్రీమియం పెట్రోల్‌ధరను రెండు రూపాయలు శనివారం పెంచారు. దీనికి తోడు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ లేకపోవడంతో భవిష్యత్‌లో రవాణా రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వారాంతపు సెలవుల్లో కుటుంబంతో కలిసి బయటకు వచ్చిన వాహనదారులు పెట్రోల్ కోసం బంకుల వద్దకు వెళ్లగాఅక్కడ గేట్లు మూసి ఉండటం చూసి నీరుగారిపోయారు. 1300 వందల పెట్రోల్ బంకులు కలిగిన నగరంలో అత్యంత ప్రాధాన్యత ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. సరఫరాలో ఏర్పడిన అంతరాయం వల్ల నిల్వలు అయిపోయాయని బంకు యజమానులు చెబుతున్నారు. నగరంలోని ప్రముఖ ప్రాంతమైన సోమాజిగూడలోని రాజ్ భవన్ రోడ్డు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. అక్కడ ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంపు వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజ్ భవన్ రోడ్డు మీదుగా వెళ్లే వందలాది వాహనాలు పెట్రోల్ కోసం వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నాయి. ఇదివరకు చూస్తే కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని దానితో డబ్బులు సరిగ్గా లేకపోయినా పెట్రోల్ బంకులు నడిపించే వారు.. కానీ ప్రస్తుతం ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇవ్వడం ఆపేశాయి. దానికి తోడు పాత క్రెడిట్ కూడా చెల్లించాల్సి వస్తోంది. ఇంకా కొత్తగా పెట్రోల్, డీజిల్ స్టాక్ కావాలంటే అడ్వాన్స్ కట్టాలి. దీంతో డీలర్లపై ప్రభావం పడుతోంది. దీని వల్ల దాదాపు 40 శాతం వరకు పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి. సామాన్యులపై ఈ ప్రభావం అత్యధికంగా పడుతోంది. డెలివరీ బాయ్స్, ఆటో డ్రైవర్లు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ఇంధన దిగుమతులకు ఆటంకం ఏర్పడింది. దీనివల్ల దేశీయంగా ఉన్న నిల్వలు వేగంగా హరించుకుపోతున్నాయి. చమురు కంపెనీలు డిపోల నుండి బంకులకు పంపే ట్యాంకర్ల సంఖ్యను తగ్గించడమే ఈ సంక్షోభానికి మూల కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొత్త స్టాక్ రావడం లేదని పెట్రోల్ బంకుల యాజమానులు పేర్కొంటున్నారు. అంటే పెట్రోల్ బంకులో ఉన్న స్టాక్ ఉన్నంత వరకు వాళ్లు ఇంధనం విక్రయాలు జరుపుతారు. తర్వాత నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తాయి.

## ఇరాన్‌పై యుద్ధానికి భారత్ సాయం కోరిన అమెరికా!

### అవన్నీ వదంతులేనని కొట్టిపారేసిన విదేశాంగశాఖ

**న్యూఢిల్లీ, మార్చి 21:** ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా భారత్ సహాయం కోరిందని సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన వార్తలంటూ కొట్టిపారేసింది. పశ్చిమాసియాలో 22 రోజుల క్రితం ప్రారంభమైన యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. పశ్చిమ భారత్ నుంచి ఇరాన్‌పై దాడులు చేయడానికి వీలుగా మిలటరీ స్థావరాలను వినియోగించుకుంటామని అమెరికా కోరినట్లు ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి ఇంగ్లీష్ మీడియాలో కథనాలు రావడంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని కోరింది. నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఈ మేరకు సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారత్‌పై కొన్ని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో శ్రీలంకకు సమీపంలో ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచివేసింది. ఆ సమయంలో భారత పోర్టులను అమెరికా ఉపయోగించుకుంటోందనే ప్రచారం జరగగా, ప్రభుత్వం ఖండించింది. ఇటీవల శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిసనాయక ఆ దేశ పార్లమెంటులో మాట్లాడుతూ, రెండు యుద్ధ విమానాల కోసం అమెరికా తమ పోర్టులను ఉపయోగించుకుంటామని చెబితే తిరస్కరించామని వెల్లడించారు. తాము యుద్ధంలో తటస్థంగా ఉంటున్నామని, అందుకే తమ పోర్టులను ఉపయోగించుకోవడానికి అంగీకరించలేదని తెలిపారు. శ్రీలంక అధ్యక్షుడి ప్రకటన అనంతరం భారత్ సహాయం కూడా అమెరికా కోరినట్లు ప్రచారం జరగడం గమనార్హం.

### వారం - వర్జ్యం

22-02-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
చవితి రా.9.17
భరణి రా.10.42
వర్జ్యం : ఉ.9.27-ఉ.10.55
దు.సా.4.38-సా.5.27
రాహుకాలం - సా.4.30-6.00

### వారఫలం

**మేషం:** అస్తవ్యస్తంగానున్న వ్యవహారాలను మీ వ్యక్తిగత ప్రతిభతో చక్కదిద్దుతారు. వివాదాలకు దూరంగావుండండి.

**వృషభం:** నష్టాలను ఆదిలోనే వారించగలుగుతారు. అత్యాశకు పోరు, కలిగిన దానితోనే తృప్తిపడతారు. ధనలాభం.

**మిథునం:** సాంకేతిక కారణాలవలన వీసా, పాస్పోర్ట్ వంటి వ్యవహారాలలో జాప్యం చోటుచేసుకుంటుంది. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఋణాలు తీరతాయి. బాధ్యతలు సమర్ధవంతంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం. వాహన సౌఖ్యం.

**సింహం:** సంఘంలో విశేషగౌరవం లభిస్తుంది. విద్య, ఉద్యోగావ కాశాలు లాభిస్తాయి. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**కన్య:** ముఖ్యమైన విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అరుదైన ఆహ్వానాలు అందుతాయి.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**తుల :** వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది, కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** మాటల నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి.

**ధనుస్సు:** పారిశ్రామిక, కళా రంగాలలోని వారికి సన్మానాలు. కాస్త నిదానంగానైనా పనులు పూర్తిచేస్తారు. వస్త్రలాభం కలదు.

**మకరం:** భూములకు సంబంధించిన విషయాలు వివాదాస్పదం కాకుండా జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది.

**కుంభం:** అంతరంగిక చర్చలు జరిగేచోట కొత్తవారికి చోటు ఇవ్వకండి. ముఖ్యమైన వ్యక్తుల అండదండలు లభిస్తాయి.

**మీనం:** ఉద్యోగంలో మీరు ఆశించిన ప్రమోషన్ అతిత్వరలోనే లభించబోతోందన్న శుభసమాచారం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జీవన్ బుజ్జగింపులు విఫలం!

## మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి జగిత్యాలలో చర్చలు

## బిఆర్ఎస్ నేతలతో కలిసి జీవన్ రంజాన్ ప్రార్థనలు

**హైదరాబాద్,మార్చి 21,ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు శనివారం నిర్వహించిన చర్చలు విఫలమైనట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి వీరవిధేయులుగా ఉన్న జీవన్‌రెడ్డి పార్టీ మార్పుపై కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అసందిగ్ధత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికి పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడంపై జీవన్‌రెడ్డి గత కొన్ని రోజులుగా అసంతృప్తితో ఉన్నారు. దీనికితోడు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసవచ్చిన డాక్టర్ సంజయ్ కారణంగా జగిత్యాలలో ఆయన అస్థిత్వంకు ప్రమాదం ఏర్పడటమే కాకుండా ఆయన ముఖ్య అనుచరుడు హత్యకు గురైనాడు. దీనితో కాంగ్రెస్ పార్టీలో ఇక ఇమడలేనని పరిస్థితులు తనకు ఎదరుకావడంతో అనుచరులు పార్టీకి రాజీనామా చేయాలని జీవన్‌రెడ్డిపై ఒత్తిడి పెంచుతున్నారు. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలలో కూడా తన కార్యకర్తలకు సముచితమైన రీతిలో టికెట్లు ఇవ్వకుండా అవమానపరిచారని ఆగ్రహంతో చెందారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తన కార్యకర్తలను జగిత్యాల మున్సిపల్ ఎన్నికలబరిలో స్వతంత్రులుగా నిలిపి డజనుకు పైగా కౌన్సిలర్లను గెలిపించుకొని తన సత్తాను కూడా కాంగ్రెస్ అదిష్టానంకు చూపారు. తన అనుచరుడికే మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని కోరినా ఎమ్మెల్యే వర్గానికి ఛైర్మన్ పదవి ఇవ్వడంతో తీవ్ర అసహనంకు గురైనారు. దీనితో కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం వూపందుకొంది. బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రసిడెంట్ కల్వకుంట తారకరామారావు కూడా జీవన్‌రెడ్డి ఈ మధ్య కాలంలో కలిసి పార్టీలోకి రావాలని ఆహ్వానించడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికి ఆయన వచ్చినట్లు తెలసింది. మార్చి 25న రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరుతున్నారని ప్రచారం జరుగుతుండటంతో శనివారం మంత్రులు శ్రీధర్‌బాబు, ఆడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.జీవన్‌రెడ్డి మాత్రం పార్టీలో కొనసాగడానికి ససేమిరా అన్నట్లు ఆయన అనుచరవర్గం ప్రచారం చేస్తోంది. పార్టీ మారే అంశం నా చేయి దాటిపోయిందని ఇక వెనక్కి రాలేనని ఖరాఖండిగా తనకు అత్యంత సన్నిహితుడైన శ్రీధర్‌బాబు ముఖంపైనే చెప్పారని జీవన్‌రెడ్డి అనుచరులు అంటున్నారు. మంత్రుల బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు.జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి పెద్దదిక్కుంటూ కొనియాడారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణరాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలోఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఇంచార్జీ మీనాక్షినటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు. జీవన్‌రెడ్డి మాత్రం తెలంగాణలో పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం రాయబారంకు వచ్చిన మంత్రులపై వ్యక్తం చేసినట్లు తెలిసింది. తన పట్ల పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగాలని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించిన మంత్రులకు జీవన్ రెడ్డి జవాబు ఇస్తూ పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమనితెల్పి చెప్పారు. ఇన్ని అవమానాలు భరిస్తూ పార్టీలో ఎందుకు ఉండాలని అడుగుతున్న తన కుటుంబసభ్యులకు కూడా ఏం సమాధానం చెప్పాలని మంత్రులను జీవన్‌రెడ్డి అడిగి, సారీ చెప్పి సమావేశాన్ని ముగించేశారు. ఇది ఇలా ఉంటే బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రంజాన్ నమాజు చేయడం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత కలిసి రంజాన్ నమాజ్‌లో ఆయన పాల్గొడం రాజకీయంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చగా మారింది.



శనివారం తిరుమలలో మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంగమాంబ అన్నదాన కేంద్రంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

## 6 గ్యారంటీల కోసం త్వరలో ప్రైవేటు బిల్లు

### అర గ్యారంటీ కూడా అమలు చేయలేదు..

### అభయహస్తం మేనిఫెస్టో పెద్ద ఫ్రాడ్

### మహిళలు, విద్యార్థులు.. అందరి తరపున బిల్లును ప్రవేశపెడతాం: మీడియాతో మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు,ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపైన కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ప్రవేట్ మెంబర్ బిల్లును సభలో అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరుగ్యారంటీల బిల్లు మద్దతుకోసం అన్ని పార్టీ లకు లేఖలు రాస్తామని చెప్పారు.ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రభుత్వాలు ఆమోదించే సాంప్రదాయం ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నది కాబట్టి ఈ ఆరు గ్యారెంటీల అమలు కోసం మేము పెడుతున్న ప్రైవేటు మెం బర్ బిల్లును కాంగ్రెస్ పార్టీ ఆమోదించాలని కోరారు.ఆరు గ్యారంటీలను పాలక పక్షం ప్రతిపక్షం రెండు కోరుతున్నాయి కాబట్టి ఈ బిల్లు ఆమోదం ఈజీగా జరుగుతుందన్నారు.ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. ఇప్పుడు ప్రైవేట్ మెంబర్ బిల్లును బిజెపి వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. రాష్ట్రంలోని రైతులు మహిళలు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులు యువకులు ఇలా ప్రతి ఒక్క వర్గం తరఫున ఈ బిల్లును మేము ప్రతిపాదిస్తున్నామన్నారు. కోటి కోసం కోటి తిప్పలు పడతారు కదా, అట్లాగే కాంగ్రెస్ వాళ్ళు మాత్రం ఓటు కోసం కోటి మోసాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు లాల్ బహదూర్ స్టేడియంలో డిసెంబర్ 7, 2023 నాడు చేపట్టారు. చేపట్టిన రోజు వారు పెట్టిన తొలి సంతకానికి సంబంధించి... ప్రభుత్వం ఏర్పడగానే ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఫైల్ మీద తొలి సంతకం చేస్తానని వాగ్దానం చేశారు. ఈ ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి అభయహస్తం చట్టానికి మార్గాన్ని సుగమం చేస్తూ తొలి ఫైల్ పై సంతకం చేశారు. వారం రోజుల తర్వాత గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి, ఆనాటి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన ప్రసంగంలో ఇదే మాట చెప్పారని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీల్లో ఈరోజు వరకు అర గ్యారెంటీ కూడా అమలు కాలేదు. ప్రపంచ ఎన్నికల చరిత్రలోనే అతిపెద్ద ఫ్రాడ్ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో అని వ్యాఖ్యానించారు. అందుకే మా సీనియర్ నాయకులు, న్యాయ నిపుణులు, మాజీ అడ్వకేట్ జనరల్‌తో కూర్చొని ప్రైవేట్ మెంబర్ బిల్లును తయారు చేశామని,ఈ బిల్లును రాష్ట్ర శాసనసభలో, శాసనమండలిలో వచ్చే శుక్రవారం రోజు ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 1986 ఆ టైంలో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారని, నాడు బిజెపి ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సి.హెచ్. విద్యాసాగర్ రావు ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడితే, గవర్నమెంట్ దాన్ని ఆహ్వానించి, దాన్ని చట్టం కూడా చేసిందని గుర్తు చేశారు. ఇదివరకు జరిగిన ఉదంతం మన కళ్ల ముందు ఉంది. అంటే గవర్నమెంట్‌కు సంస్కారం ఉంటే, గవర్నమెంట్‌కు చిత్తశుద్ధి ఉంటే, ప్రజల పట్ల ప్రేమ ఉంటే, ఎవరు బిల్లు ప్రవేశపెడితే ఏమిటి? అని ప్రశ్నించారు. మేము బిల్లు తయారు చేసుకొని వచ్చాం. మరి ఆ బిల్లును దయచేసి ప్రవేశపెట్టే విధంగా సహకరిస్తారని స్పీకర్‌ను కలుస్తాం, ఛైర్మన్‌ను కలుస్తాం, మెంబర్లందరికీ బిల్లు కాపీలు ఇస్తాం. ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని చెప్పి మా లాబీయింగ్ కూడా మేము చేస్తాం అని పేర్కొన్నారు. 'ఒక ఫైల్ సంతకం పెడితే ముఖ్యమంత్రి, ఆ ఫైల్ దొరక్కుండా పోయే ఆస్కారం ఉంటుందా? ఇట్లా అబద్ధాలు చెప్పవచ్చా? ఫైల్ సంతకం పెట్టి రెండున్నర ఏళ్లు అయిపోయిన తర్వాత, 840 రోజులు అయిపోయిన తర్వాత, ఆ ఫైల్ ఎక్కడ ఉంది అని అడిగితే సమాధానం చెప్పలేని స్థితి ప్రభుత్వానికి ఉంటదా ఎక్కడైనా దేశంలో? ఇవాళ ఆ స్థితి రాష్ట్రంలో కనబడతా ఉంది. మాకు అనుమానం వస్తుంది మరి... రాను పోను ఢిల్లీ విమానంలో ఎక్కడైనా పోగొట్టుకున్నారా? లేదా ఎఫ్.ఎస్.ఎల్ అగ్ని ప్రమాదంలో కాలిపోయిందా? లేదా మొదటి సంతకమే మోసంతో మొదలైందా? అనేది ఇవాళ తేలవలసిన ప్రశ్న' అని పేర్కొన్నారు. మహిళలకు ..2,500 మీరు ఇచ్చిన హామీ మేరకు రావాలి. వెంటనే మహాలక్ష్మి ్మ పథకం ప్రారంభం కావాలి. అట్లాగే ..రూ.4,000 పెన్షన్, పెద్ద మనుషులందరూ ఎదురుచూస్తా ఉన్నారు, రైతు బంధు కాదు, రైతు భరోసా. ..రూ.10,000 కాదు, ..రూ.15,000 అన్నారు. అది ఆ రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల తరపున ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతా ఉన్నాం. రాష్ట్రంలోని 22 లక్షల మంది కౌలు రైతుల తరపున ఈ బిల్లు పెడతా ఉన్నాం, ఎందుకంటే మీరు కౌలు రైతులకు కూడా ..15,000 ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది దివ్యాంగులకు మీరు ఇచ్చిన మాట, ..6,000 పెన్షన్ వంద రోజుల్లో... వారి తరపున ఈ బిల్లు పెడతా ఉన్నాం అని చెప్పారు. ఈ బిల్లు చట్టం ఏంటే ఆరు గ్యారెంటీలు విషయంలో ఎవ్వరికీ దరఖాస్తు పెట్టుకునే పని లేదు, దండాలు పెట్టే పని లేదన్నారు. ఈ చట్టం వస్తే రైతులు కోర్టుకు పోతే కోర్టు మొట్టికాయలేసి గవర్నమెంట్‌తోని ఖచ్చితంగా వారికి పైసలు ఇప్పిస్తది. రాష్ట్రంలోని విద్యార్థులకు లాభం అయితది. ..5 లక్షల విద్యా భరోసా కార్డ్ ఇయ్యక తప్పని పరిస్థితి గవర్నమెంట్‌కు ఆ అనివార్యత ఏర్పడుతది. అందుకే వారి తరపున ఈ బిల్లు పెడతా ఉన్నాం అని చెప్పారు.

## నాకు ప్రాణహాని ఉంది.. భద్రత కల్పించండి

### అమిత్‌షాకు రాజాసింగ్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందంటూ ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయానికి సంబంధించి తాను పలుమార్లు లేఖ రాశానని ఆయన పేర్కొన్నారు. తనకు భద్రత కల్పించాలని ఆయన లేఖలో అమిత్ షాను కోరారు,కాగా, రాజాసింగ్‌కు పలుమార్లు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రాణహాని తలపెట్టేలా మరోసారి బెదిరింపు లేఖ వచ్చింది. ఈ నెల 27న శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతుకులు ఆ లేఖలో హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అమిత్ షాకు లేఖ రాశారు.

## దానం ఎమ్మెల్యే పదవికి ముప్పు?

### స్పీకర్ తీర్పుపై బిజెపి హైకోర్టులో సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని తన పిటిషన్ లో ఆయన కోర్టును కోరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం పక్కాగా ఫిరాయింపు కిందికే వస్తుందని ఆయన పేర్కొన్నారు.నామినేషన్ పత్రాలనే ఆధారంగా తీసుకుని దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఏలేటి డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పార్టీ మారినప్పటి నుంచి ఆయన ఎమ్మెల్యేగా పొందుతున్న జీతభత్యాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు దగ్గరైన నేపథ్యంలో, దానం నాగేందర్ కేసులో హైకోర్టు ఇచ్చే తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

## భద్రాద్రి ఆలయ అభివృద్ధి తొలి దశ గోదావరి పుష్కరాలకు పూర్తి

### సమీక్ష జరిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి21:** భద్రాచల శ్రీ సీతారామచంద్రమూర్తి ఆలయ అభివృద్ధిపై శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన సీఎం ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనులు నిర్వహించాలని సిఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి అంచనాలతో తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని ఘాట్స్ నిర్మాణం,అభివృద్ధి ఉండాలని సిఎం తెలిపారు. 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పనిచేయాలని సిఎం సూచించారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు,అంచనాలు సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో, పూజారులు, అధికారులు పాల్గొన్నారు.

# సిట్ బృందానికి చిక్కిన డ్రగ్ పెడ్లర్ అభిషేక్‌సింగ్

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** తెలుగు రాష్ట్రాల్లో మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సిట్ దర్యాప్తు చేపట్టిన ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అభిషేక్‌సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసు కుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరా బాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ ఓఆర్‌ఆర్ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్‌శర్మ, రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్‌రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్‌శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. కాగా, అభిషేక్‌సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్‌సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను సిట్ అధికారులు విశ్లేస్తున్నారు.

# గజ్వేల్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్

## 2026-27లో ప్రీప్రైమరీ నుంచి 8వ తరగతి వరకు

## 2027-28లో 9 నుంచి 12వ తరగతి వరకు

## అడ్మిషన్లు.. ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాలని నిర్ణయించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నారు. అందులో భాగంగా సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లికన స్కూల్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా జీవో ఆర్‌టీ నంబర్ 58ని జారీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుండి గజ్వేల్ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్(టిపిఎస్) ప్రారంభించాలని నిర్ణయించారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రారంభించనున్న టిపిఎస్ కోసం రూ. 16.62 కోట్ల అం చనా వ్యయంతో అదనపు మౌలిక సదుపాయాల మంజూరుకు ప్రభుత్వ ఉత ర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ(పిపి) నుండి 8వ తరగతి వరకు, 2027-28 విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు తరగతులు ప్రారంభిం చడానికి అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# ఇంటెగ్రేటెడ్ స్కూల్ బిల్డింగుల నిర్మాణానికి నిధులు మంజూరు

## క్యూర్ పరిధిలో పాఠశాలలకు రూ. 1,011 కోట్లు మంజూరు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి విద్యశాఖ నిధులు మంజూరు చేసింది. క్యూర్ ఏరియాలో 11 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ బిల్డింగ్స్ నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది. ఇంటిగ్రేటెడ్ స్కూల్ బిల్డింగ్స్‌తోపాటు 17 పాఠశాలల ఉన్నతీకరణను కూడా ఈ నిధుల ద్వారా చేపట్టనున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న 164 ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా మరో 501 అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టానున్నారు. వీటిన్నింటి కోసం రూ. 1011.65 కోట్లకు పాఠశాల విద్యా శాఖ పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయసింది. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టీ నంబర్ 57ను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతాలలో రూ.1011.65 కోట్ల నిర్మాణాలను చేపట్టనునానరు. రూ. 1011 కోట్లలో 30 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్, సీఎస్‌ఆర్ నిధుల నుండి ఇవ్వనుండగా..70 శాతం నిధులు ఏఐఐబీ రుణం కింద ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన పనులకు ప్రభుత్వం రూ. 1011.65 కోట్లకు పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. వాటిలో రూ. 496.75 కోట్ల 11 సమీకృత పాఠశాల సముదాయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే ఉన్న 164 ప్రభుత్వ పాఠశాలల్లో రూ. 150.30 కోట్లతో 501 అదనపు తరగతి గదుల నిర్మాణంను చేపట్టనున్నారు.

# భార్య మృతి తట్టుకోలేక ఎస్ఐ ఆత్మహత్య

## దిక్కుతోచని స్థితిలో ఇద్దరు చిన్నారులు

**జమ్మికుంట టౌన్, ప్రభాతవార్త:** భార్య ఆత్మహత్య చేసుకున్న బాధతో మన స్తాపానికి గురైన ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ తానూ ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. తల్లిదండ్రులిద్దరి మరణాలతో దిక్కుతోచనిస్థితిలో ఇద్దరు చిన్నారులు రోదనలు ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించాయి. కరీంనగర్ టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్ర శేఖర్ యాదవ్ ఇల్లందకుంట మండలం సీతం పేటలోని అత్తగారింట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 17న ఆయన భార్య దివ్య తీవ్రమైన కడుపునొప్పి భరించలేక గన్నేరుపప్పు తిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. భార్య దివ్య అంత్యక్రియలు సీతంపేటలో జరిగాయి. అంత్యక్రియల రోజు ఇరుకుటుంబాల మధ్య ఘర్షణ వాతావరణ నెలకొనగా మధ్యవర్తులు చొరవతో సద్దుమణిగిన విషయం తెలిసిందే. మూడవరోజు పిట్టకు పెట్టే కార్యక్రమానికి భర్త చంద్రశేఖర్ హాజరయ్యాడు. మళ్లీ 5వ రోజు కార్యక్ర మానికి హాజరై ఇంటికి చేరుకొని స్నానం చేసి బట్టలు మార్చుకోవడానికి గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో తలుపులు పగల గొట్టి చూడగా ఉరివేసుకొన్న స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షి ంచి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భార్య మృతిని తట్టుకోలేక ఎస్సై చంద్రశేఖర్ తీవ్ర మనస్తాపానికి గురై ఆమె లేని జీవితం వద్దనుకొని తాను ఆత్మహత్య చేసుకున్నారు. వీరిద్దరి మరణంతో ఇద్దరి చిన్నపిల్లలు అనాధలు అయ్యారు. సమాచారం అందుకున్న పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



దివ్య, చంద్రశేఖర్‌యాదవ్ (ఫైల్)

# సంక్షేమంలో ప్రక్షాళన.. గురుకులాలు, హాస్టళ్లపై దృష్టి

## మెనూ, డైట్, వసతుల ఏర్పాట్లకు చర్యలు

## కీలక మార్పులు చేస్తున్న సర్కార్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర సర్కార్ అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలోని పలు గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగడం వల్ల సకాలంలో ఓనర్లకు బిల్లులు చెల్లించక, ఆ బిల్డింగుల ఓనర్లు భవనాలకు తాళాలు వేసి వెళ్లిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 216 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 327 బీసీ గురుకులాలు ఉంటే, 21 గురుకులాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 306 గురుకులాలకు సొంత భవనాలు లేవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలదీ ఇదే పరిస్థితి. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం విశాలమైన క్రీడా మైదానాలు ఉండేలా 250 స్కూల్స్ ను, 25 ఎకరాల స్థలంలో 150 నుంచి 200 ఖర్చుతో ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారంచుట్టింది. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం గురుకులాల బాట పట్టింది. విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతం పెంచింది. విద్యార్థులకు అందించే ఆహార మెనూలోనూ కీలక మార్పులు చేసింది. తప్పుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఏ పొరపాటు జరగకుండా అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు.

గురుకులాల సెక్రెటరీలు సైతం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లుల చెల్లింపులు గురుకులాలకు సప్లై చేసే కూరగాయలు, ఇతర సరుకుల బిల్లులు, మెస్ చార్జీలను త్వరితగతిన చెల్లించేలా ఆర్థిక శాఖకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అయితే, నాసిరకం సరుకులు సప్లై చేసే కాంట్రాక్టర్లు, వాటిని అప్రూవల్ చేసిన వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గతంలో 2004-14 మధ్య గ్రీన్ ఛానల్ మెస్ ఛార్జీలు ఉండేవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిగా రద్దు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవస్థను పునరుద్ధరించింది. మెస్ చార్జీలు, భవనాల అద్దెలు ప్రతి నెల పదో తేదీ లోపు గ్రీన్ గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించనున్నారు.

పౌష్టికాహారానికి ప్రత్యేక వ్యవస్థ ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరగకుండా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేకంగా ఫుడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశారు. తప్పు జరిగితే అధికారులే బాధ్యత వహించేలా మార్పులు తీసుకొచ్చారు. కామన్ డైట్ మెనూ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తారు. పెంచిన డైట్ చార్జీలు అమల్లోకి రావడంతో ఎనిమిది లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. అంతేకాకుండా, మెనూ లో కూడా కీలక మార్పులు చేశారు. కామన్ డైట్ మెనూ, స్టాండర్డైజేషన్ ఆఫ్ స్టోరేజ్, కిచెన్ డైనింగ్ ఏరియా మెయింటెనెన్స్ ద్వారా సమస్యలకు చెక్ పెట్టేలా మార్పులు చేశారు. నెలలో రెండు సార్లు మటన్, నాలుగుసార్లు చికెన్, గుడ్డుతో పాటు టమాట రైస్, పప్పు,పెరుగు, బగార రైస్, స్నాక్స్ కు మిల్లెట్ బిస్కెట్స్, బాయిల్డ్ పెసర్లు, ఫ్రైడ్ పల్లి, బెల్లం, బాయిల్డ్ బఠాణీ, బాయిల్డ్ బొబ్బర్లు, ఎగ్ బజ్జీ, ఇవే కాకుండా బ్రేక్ ఫాస్ట్ లో కూడా పలు మార్పులు చేసి నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. అంతేకాకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందుతుందో లేదో చూసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.

# సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు అధిక ప్రాధాన్యం



## ఫీడ్‌బ్యాక్ తీసుకున్న మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం

## తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి సీతక్క ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గత పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్ర దింపులు జరిపి, మొత్తం 12,728 గ్రామ పంచా యతీలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు.

తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పంపుల పనితీరు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన తదితర 16 కీలక అంశాలపై వివరాలు సేకరించారు. దీనిపై మంత్రి సీతక్క శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్‌ల అభిప్రాయ సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, 'గ్రామస్థాయిలో సర్పంచ్‌ల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా మిషన్ భగీరథ సేవలను మరింత మెరుగుపరుస్తాం. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.సర్పంచులు గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

మిషన్ భగీరథ వ్యవస్థ లేని మారుమూల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వర్షాకాలానికి ముందే చెక్‌డ్యాంలు నిర్మించాలని మంత్రి సూచించారు.

స్థానిక నీటి వనరులను బలోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుంది' అని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ 1916కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నట్లే, ఈ వేసవిలో కూడా మిషన్ భగీరథ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

సమస్యాత్మక గ్రామాలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాపై వచ్చే ప్రతి సమాచారం పట్ల వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్క మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.

# గ్రామాల్లో ప్రభుత్వ బడులు.. పట్టణాల్లో ప్రైవేటు స్కూళ్లు

## విద్యార్థుల చేరికపై సోషియో ఎకనమిక్ సర్వే

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటే.. పట్టణ ప్రాం తాల్లో ప్రైవేటు స్కూల్స్‌లో ఎక్కువ మంది చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూల్స్‌లో 63.6 శాతం మంది విద్యార్థులు చేరుతుంటే.. ప్రైవేటు స్కూల్స్‌లో 31.6 శాతం మంది చేరుతున్నారు. ఇక పట్టణాల్లో ఈ పరిస్థితి రివర్స్‌గా మారింది. పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థులు ఎక్కువ మంది చేరుతుంటే.. గవర్నమెంట్ స్కూల్స్‌లో తక్కువ మంది చేరుతున్నారు. పట్టణాల్లో ప్రైవేట్ స్కూల్స్‌లో 54 శాతం మంది విద్యార్థులు చేరుతుండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 23 శాతం మంది విద్యార్థులు మాత్రమే చేరుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సోషియో ఎకనమిక్ సర్వేలో ప్రభుత్వం వెల్లడించింది.

రాష్ట్రంలో 39,641 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, సెంట్రల్ గవర్న మెంట్, గురుకులాలు ఉండగా.. వాటిలో 11,689 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. సోషియో ఎకనమిక్ సర్వే ప్రక్రారం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 63.6 శాతం మంది విద్యార్థులు చేరుతుండగా.. ఎయిడెడ్ స్కూల్స్‌లో 4.5 శాతం మంది పిల్లలు చేరుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేటు స్కూల్స్‌లో 31.6 శాతం మంది విద్యార్థులు చేరుతున్నారు. ఇక పట్టణ ప్రాంతాలకొచ్చేసరికి ప్రైవేట్ స్కూల్స్‌లో 54 శాతం మంది విద్యార్థులు చేరుతున్నారు. పట్టణాలు, నగరాల్లోని గవర్నమెంట్ స్కూల్స్‌లో కేవలం 23 శాతం మంది విద్యార్థులు చేరుతుండగా.. ఇక్కడ కొనసాగుతున్న ఎయిడెడ్ స్కూల్స్‌లో 22.8 శాతం మంది పిల్లలు చేరుతున్నారు.

రాష్ట్రంలోని 39,641 స్కూల్స్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 62,36,000 మంది విద్యార్థులు చేరగా.. వారిలో 11,689 ప్రైవేటు పాఠశాలల్లో 37,43,893 మంది విద్యార్థులు చేరినట్టు సోషియో ఎకనమిక్ సర్వేలో ప్రకటించారు.

# ఈద్గాలలో పండుగ శోభ

## ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

## మీరాలం, మక్కా, చౌక్ మసీదు తదితర ప్రాంతాల్లో భారీ బందోబస్తు



మీరాలం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ముస్లిం సోదరులు

**హైదరాబాద్ (చార్మినార్), మార్చి 21, ప్రభాతవార్త :** పాతనగరంలో ఈద్-ఉల్ -ఫితర్ (రంజాన్ పండుగ) ను ముస్లింలు శనివారం అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుతున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పాతబస్తీలో చార్మినార్ జోన్ రాజేంద్రనగర్ జోన్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించటంతో శనివారం ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్ పండుగు)ను జరుపుకు న్నారు. హైదరాబాద్ పాతనగరంలో ఏ ప్రాంతంలో చూసిన రంజాన్ పండుగ వాతావరణం కనిపిం చింది. రంజాన్ మాసం సందర్బంగా శనివారం తెల్లవారు జామున నాలుగు గంటలు వరకు పాతబస్తీలోని మార్కెట్లలో ప్రజలు కొనుగోలు చేశారు. మీరాలం ఈద్గా, చారిత్రక మక్కామసీదు, చౌక్‌మసీదుతో పాటు వివిధ ప్రాంతాల మసీదులను అందంగా తీర్చిదిద్దారు. బహదూర్‌పుర శివారులో ఉన్న మీరాలంలోని చారిత్రక ఈద్గాలో వేలాది మంది ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్దనలు జరిపారు. ఎఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, బహదూర్ పుర నియోజకవర్గం శాసన సభ్యులు మహ్మద్ ముబీన్‌తోపాటు పలువురు ఎంఐఎం మాజీ కార్పొరేటర్లు ప్రార్దనలలో పాల్గొన్నారు .రాజేంద్రనగర్ జోన్ పోలీసులు మీరాలం ఈద్గా ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాలాపత్తర్, జహాను బహదూర్‌పుర, మొయిన్‌పుర, దూద్‌బౌలి, హసన్‌నగర్, రంనాస్‌పుర, ఇంద్రానగర్, కామాటిపుర, బిలాల్‌నగర్‌తోపాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న చారిత్రక మీరాలం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్దనలలో పాల్గొన్నారు.హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ చారిత్రక మీరాలం ఈద్గా వద్ద స్వయంగా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రార్థనలు అనంతరం ఆయన చిన్నారులకు చాకెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ప్రభుత్వ విభాగాలకు నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు సిపి సౌత్‌రేంజ్ తఫ్సీర్ ఇక్బాల్,జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్,జాయింట్ సిపి నార్త్ రేంజ్ ఎన్.శ్వేతా, సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి ఆర్.వేంకటేశ్వర్లు, రాజేంద్ర నగర్ జోన్ డిసిపి ఎస్.శ్రీనివాస్, ట్రాఫిక్ డిసిపి అవినాష్ కుమార్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా మక్కామసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలలో చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్ఎస్ఐ మృతి

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మార్చి 21, ప్రభాతవార్త:** హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సిద్దిపేట కమీషనరేట్‌కు చెందిన ఓ ఆర్ఎస్ఐ మ ృతి చెందాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట కమీషనరేట్ పరిధిలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న తాళ్లపల్లి రాజ సాంబయ్య(60) ఈనెల 7వ తేదీన శరీరం మీద ఏర్పడిన గడ్డలకు చికిత్స తీసుకునేం దుకు హైటెక్‌సిటీ యశోధ ఆసుపత్రిలో చేరాడు. ఈమేరకు ఈనెల 10వ తేదీన సాంబయ్యకు డాక్టర్లు మెదడు సర్జరీ చేశారు. కాగా సాంబయ్యకు ఇతర ఇబ్బందులు తలెత్తడంతో మరో సర్జరీ చేశారు. సర్జరీ అనంతరం ఆసుపత్రిలో చికిత్స తీసుకుం టున్న సాంబయ్య ఈనెల 20వ తేదీన చికత్స పొందుతూ మ ృతిచెందినట్లు డాక్టర్లు ద ృవీకరించారు. ఈ విషయమై మ ృతుడు సాంబయ్య భార్య తిరుపతమ్మ మాదాపూర్ పోలీసులకు పిర్యాదు చేయగా, బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసుకున్న మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా సాంబయ్య మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.



ఆర్ఎస్ఐ తాళ్లపల్లి రాజయ్య (ఫైల్)

# నేడు భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ పర్యటన

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** భువనగిరి, సిద్దిపేట జిల్లాలో టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం పర్యటించ నున్నారు. ఉదయం 11 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి కార్యవర్గ సమావేశం డిసిసి అధ్యక్షుడు బీర్ల అయిలయ్య అధ్యక్షతన జరగనుంది.ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

# బడ్జెట్ దూరదృష్టి గల ప్రణాళిక

## వాణిజ్య మండళ్ల సమాఖ్య అధ్యక్షుడు ప్రకాష్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై దృష్టి సారించి అభివృద్ధికి ఒక మార్గసూచిని వివరిస్తుందని రాష్ట్ర వాణిజ్య మండళ్ల సమాఖ్య ఫెడరేషన్ అధ్యక్షులు అమ్మనబోలు ప్రకాష్ అన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా తీసుకునే చర్యలు ఆర్థిక వృద్ధికి తోడ్పడటంతో పాటు, పెట్టుబడులను ఆకర్షిస్తాయని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈలకు పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలకు కూడా త్వరితగతిన ఆమోదం తెలపడం వల్ల ద్రవ్య లభ్యత, వ్యాపార విశ్వాసం మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యుత్ సుంకాలు, రవాణా ఖర్చులు వంటి పెరుగుతున్న నిర్వహణ వ్యయాలతో పాటు, చిన్న, మధ్య తరహా వ్యాపారులకు సరసమైన నిర్వహణ మూలధనం లభించడం కూడా ఒక ఆందోళనకరమైన విషయంగా మిగిలిపోయిందని తెలిపారు. టోకు మార్కెట్లు, గిడ్డంగులు, రవాణా వ్యవస్థలతో సహా వాణిజ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# రాష్ట్రంలో 5 రెట్లు పెరిగిన మాంసం వినియోగం

## గొర్రెల పెంపకంలో దేశంలో నంబర్ 1

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త :** తెలంగాణలో మాంసాహార ప్రియుల జోరు ఏ స్థాయిలో ఉందో తాజా ఆర్థిక సర్వే కళ్లకు కట్టింది. గత పదేళ్లలో రాష్ట్రంలో మాంసం వినియోగం ఊహించని రీతిలో 5 రెట్లు పెరగడం గమనార్హం. కేవలం తిండిలోనే కాదు, పశుసంపద ఉత్పత్తిలోనూ తెలంగాణ దేశవ్యాప్తంగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్‌లుక్ 2026 సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రం మొత్తం మీద 2013-14 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2.30 లక్షల టన్నులుగా ఉన్న మాంసం వినియోగం, 2024-25 నాటికి అది ఏకంగా 11.01 లక్షల టన్నులకు చేరుకుంది. అలాగే గొర్రెల పెంపకంలో కూడా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది. పౌల్ట్రీ రంగంలో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. కేవలం మాంసమే కాదు, అనుబంధ రంగాల్లో కూడా తెలంగాణ వృద్ధి అద్భుతంగా ఉంది. పదేళ్ల క్రితం 1,006 కోట్లుగా ఉన్న గుడ్ల వినియోగం, ఇప్పుడు 1,935.26 కోట్లకు పెరిగింది. అంటే సగటున ప్రతి ఒక్కరి ఆహారంలో గుడ్ల వాటా రెట్టింపు అయ్యింది.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఆర్ఓ ప్లాంట్లు

## రూ. 10 కోట్లతో ఏర్పాటు

## మధ్యాహ్న భోజన పథకం నేపథ్యంలో మంజూరు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి రివర్స్ ఆస్మోసిస్(ఆర్‌వో) ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. 33 జిల్లాల్లో ఉన్న 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ. 70 కోట్లను కేటాయిం చింది.

రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూల్స్, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను కూడా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

అందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉదయం అల్పాహారం అందించనున్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 50 కోట్లను కేటాయించారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి అన్ని గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని, ఉదయం బ్రేక్‌పాస్‌నతను ప్రారంభి స్తున్న నేపథ్యంలో.. కాలేజీల్లో చదువుతున్న 2 లక్షల మంది విద్యార్థులకు త్రాగునీటికి ఇబ్బంది రాకుండా ఉండాలని అన్ని కాలేజీల్లోనూ ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభించాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది.

ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటే సుమారు రూ. 10 కోట్లు అవసరం అవుతాయని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తమకు కావల్సిన రూ. 10 కోట్లను ఇవ్వాలని కోరుతూ ఇంటర్ విద్య డైరక్టర్.. ఇంటర్ బోర్డు కార్యదర్శికి లేఖ రాశారు.

430 గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన రూ. 10 కోట్లను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని.. ఈ లోపుగా మీరు రూ. 10 కోట్లను తాత్కాలికంగా మంజూరు ఇంటర్ బోర్డు నిధుల నుండి ఇంటర్మీడియట్ విద్య ఖాతాకు రూ.10.00 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేయాలనే కోరుతూ లేఖ రాశారు.

# తెలుగు రాష్ట్రాల్లో జోరుగా 'సంక్షేమ' బడ్జెట్లు

ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భట్టి తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తించనుంది. ఈ గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ఈసారి పద్దులో రైతు భరోసాకు రూ.18 వేలకోట్లను కేటాయించింది. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్, యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా 'సి.ఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం' ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పోటా పోటీగా బడ్జెట్ ప్రతిపాదనలు రూ.3లక్షల కోట్లకు పైగా ప్రవేశపెట్టినా బడ్జెట్ లోటును తీర్చుకుంటూ వ్యయం దగ్గర జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

**డాక్టర్ వై.నాగేశ్వరరావు**

రెండు తెలుగు(ఏపీ, తెలంగాణ) రాష్ట్రాల్లో బడ్జెట్ ప్రతిపాదనలు వచ్చేశాయి. జోరుగానే బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఫిబ్రవరి 14న రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టి సభ ఆమోదం తీసుకున్నారు. తెలంగాణలో డిప్యూటీ సిఎం,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్చి 20న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశ పెట్టారు. ఈ ప్రతిపాదనలు ఆమోదించేందుకు సోమవారం నుంచి సభలో చర్చ జరగనుంది. మొత్తంగా రెండు రాష్ట్రాలు తమ తమ బడ్జెట్లను ఏప్రిల్ నుంచి ప్రభుత్వ నిర్వహణకు, పథకాల కొనసాగింపునకు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈసారి కూడా ఎప్పటిలానే రెండు రాష్ట్రాల బడ్జెట్ ప్రతి పాదనలు పెరిగిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం కంటే ముందే ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 2026–27 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వంలో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే ఆ తరువాత అయిదేళ్ల పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించాలనేదే తమ విధానమని స్పష్టం చేసారు. రాష్ట్ర బడ్జెట్ 2026–27ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు. రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.53,915 కోట్లు, రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు.. ద్రవ్యలోటు రూ.75,868 కోట్లు ఉందని ప్రకటించారు. ఇక, శాఖల వారీగా వ్యవసాయ శాఖకు రూ. 11,745 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 32,208, బీసీ సంక్షేమం రూ. 23,650 కోట్లు, ఇంధన శాఖ రూ.19,306 కోట్లు, పంచాయితీ రాజ్‌కు రూ. 22,941 కోట్లు, ఇరిగేషన్ రూ.18,223 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,600 కోట్లు, మత్స్యకార సేవకు రూ.600 కోట్లు, ధరల స్థిరీకరణకు రూ.


తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క


ఎపి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

560కోట్లు మనబడి మన భవిష్యత్ పథకానికి రూ. 1,500 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకానికి రూ. 654 కోట్లు, యూత్ అండ్ స్పోర్ట్స్‌కు రూ. 438 కోట్లు, సాగు నీటి ప్రాజెక్టులు: రూ. 9,906 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: రూ. 1,927 కోట్లు.. అన్నదా సుఖీభవ: రూ. 6,600 కోట్లు, మత్స్యకారులకు రూ. 260 కోట్లు.. పోలవరం: రూ. 6,105 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి: రూ. 500 కోట్లు.. పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ. 19,306 కోట్లు.. బీసీ సంఘాల కోసం రూ.23,650 కోట్లు.. జల వనరుల శాఖకు రూ. 18,223 కోట్లు.. పంచాయతీరాజ్‌కు రూ.22,941 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ.14,538 కోట్లు కేటాయింపులు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల అంచనా ప్రతిపాదనలతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా పేర్కొన్నది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931గా ఉన్నట్టు తెలిపింది. రాష్ట్ర వృద్ధి రేటు 10.2 శాతమని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టగా, శాసనమండలిలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక శాఖకు రూ.60,438 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ. 33,688 కోట్లు ప్రతిపాదించారు. సెకండరీ, ఉన్నత విద్యాశాఖలకు రూ.26,674 కోట్లు, వ్యవసాయం, సహకార శాఖలకు రూ.23,179 కోట్లు, సాగునీటి పారుదల శాఖకు రూ.22,615 కోట్లు, విద్యుత్తు శాఖకు రూ.21,285 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,907కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.7,430 కోట్లు కేటాయించారు. అసెంబ్లీలో గంట 56 నిమిషాల పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలిలో మంత్రి ఉత్తమ్ తమ బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. వరుసగా 4వ సారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టిని సీఎం రేవంత్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అభినందించారు. 2026–27 వార్షిక బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి. వ్యవసాయం, సహకార శాఖ రూ. 23,179 పశుసంవర్ధక, మత్స్యశాఖ రూ.1,529,బీసీసంక్షేమ శాఖ రూ.12,511,ఎస్సీ సంక్షేమం రూ.11,784,ఎస్టీ సంక్షేమం రూ.7,937,మైనారిటీ సంక్షేమం రూ.3,679, మహిళా,శిశు, దివ్యాంగ, వయోవృద్ధులశాఖ రూ.3,143, విద్యుత్తు శాఖ రూ.21,285,పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ రూ.1,049,ఆర్థిక శాఖ రూ.60,438, పౌర సంబంధాలు రూ.7,366,సాధారణ పరిపాలనా శాఖ రూ. 1,190, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం రూ.13,679, హోంశాఖ రూ.11,907, గృహ నిర్మాణం రూ.7,430, వాణిజ్య, పారిశ్రామిక రూ.3,747,ఐటీ, కమ్యూనికేషన్ రూ.875, సాగునీటి పారుదల రూ.22,615,న్యాయశాఖ రూ.2,367,అసెంబ్లీ నిర్వహణ రూ.259, మున్సిపల్, పట్టణాభివృద్ధి రూ.17,907,పంచాయతీరాజ్ రూ.33,688, ప్రణాళిక శాఖ రూ.7,971, రెవెన్యూ రూ.4,020,సెకండరీ విద్యాశాఖ రూ.21,231, ఉన్నత విద్య రూ.5,443,రవాణా శాఖ రూ.4,491,రోడ్లు, భవనాల శాఖ రూ.8,298 పర్యాటక, సాంస్కృతికశాఖ రూ.2,127 కేటాయించారు.తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో కొత్త పథకాలను ప్రకటించింది. సంక్షేమ రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించారు. కొత్తగా ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల భీమా సదుపాయం కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. బడ్జెట్‌లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.కొత్తగా రాష్ట్రంలోని అందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు నిర్ణయించారు. దీని ద్వారా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా పథకం కింద భరోసా లభిస్తుంది. జూన్, 02, 2026 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.4వేల కోట్ల మేర కేటాయింపు చూపించారు. అదే విధంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలతో ప్రత్యేక రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేసి అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించనున్నారు. అదే విధంగా జూన్ లో ప్రారంభం కానున్న కొత్త విద్యాసంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అందించనున్నారు. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల రూ. 2వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అందించనున్నారు. ●

---

# 'చే' జారిన చుక్కాని!

అసోం

**ఎ.వి.వి ప్రసాద్**

చుక్కాని లేని నావ ఎటు వెడుతుందో ఎవరూ చెప్పలేరు. అసోంలో కాంగ్రెస్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో అన్ని పార్టీల్లోను హడావుడి పెరిగింది కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రం మందు తిన్న పాములా ముందుకు కదలలేకపోతోంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి పావులు కదుపుతుండగా, ముందుకునడిపించగల సరైన నాయకత్వం లేక కాంగ్రెస్ అల్లాడుతోంది. గౌరవ్ గొగొయ్ నాయకత్వంలో ఎన్నికలను ఎదుర్కొనడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య సమన్వయం లోపించడం, కీలక నేతలు పార్టీని వదలివెళ్లడం ప్రధాన సమస్యలుగా చుట్టుముడుతున్నాయి. ఎన్డీయే కూటమిలో ఉన్న అసోం గణపరిషత్, బోడోలాండ్ ఫ్రంట్‌తో బిజెపి సీట్లఒప్పందాలు ఇప్పటికే పూర్తి కాగా, కాంగ్రెస్ నాయకత్వంలోని 'మహాజోట్'లో మాత్రం ఇంకా ఆరంభదశలోనే ఉన్నాయి. కూటమి పార్టీల మధ్య అవగాహన లోపమే అందుకు కారణం.అన్నిటికంటే ముఖ్యంగా పలువురు సీనియర్ నేతలు ఇటీవల కాంగ్రెస్‌కు దూరంకావడం కూడా పార్టీనేతలను ఎక్కువగా కలవరపరుస్తోంది.మహాజోట్‌లో కాంగ్రెస్‌తోపాటు అసోంజాతీయ పరిషత్, సిపిఎం, ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కూడా ఉన్నాయి. కాంగ్రెస్ మినహా కూటమిలోని మిగిలిన పార్టీలకు గత ఎన్నికల్లో కూడా లభించిన ఓట్ల శాతం చాలా తక్కువ. కాంగ్రెస్ గత ఎన్నికల్లో బిజెపికి దగ్గరగా వచ్చింది కానీ అధికారానికి ఆమడ దూరంలోనే ఆగిపోయింది. బిజెపి గత రెండుఅసెంబ్లీ ఎన్నికల నుంచిరాష్ట్రంలో ఓట్ల శాతం బాగా పెంచుకొంటూ వచ్చింది. దానికి ప్రధాన కారణం హిమంత బిశ్వ శర్మఅనే చెప్పాలి.బిజెపిని పటిష్టం చేయడమేగాక కాంగ్రెస్‌ను మరింతగా బలహీనపరచడం ఆయనగెలుపు వ్యూహంగా కనిపిస్తుంది.పార్టీలో విభేదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఇతర పార్టీలను మచ్చిక చేసుకోవడం ఆయనకుఓటుతోవచ్చిన విద్యఅనే చెప్పాలి. ఏప్రిల్ 9న జరిగే ఎన్నికలకు కూడా ఆయన అటువంటివ్యూహాలనే అనుసరిస్తున్నారనిపిస్తుంది.అందుకే సీట్ల సర్దుబాట్లు సజావుగా సాగిపోయాయి. అయితే మహాజోట్‌లో చిన్నపార్టీలు ఎక్కువ కావడంతో సీట్లపంపిణీ కూడా తలనొప్పిగా మారింది. దానికంటే, పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్‌ను వదిలి బిజెపిలో చేరడం పార్టీ అధిష్ఠానాన్ని కుదిపేస్తోంది. తరుణ్ గొగొయ్ వంటి సమర్థ నేతల ప్రభావం ఇప్పుడులేదు.ఉన్న మరికొందరు సీనియర్ నేతలు బిజెపిలోకి వెళ్తుండడంతో పార్టీ అధిష్ఠానం అయోమయంలో పడుతోంది. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో బిజెపినికాంగ్రెస్ నేరుగా ఢీకొంటున్నది ఒక్క అసోంలోనే. మిగిలిన నాలుగు చోట్ల అంతగా ప్రభావం చూపలేని భాగస్వామిగా మాత్రమేఉంది. పిసిసి చీఫ్‌గా ఉన్న భూపేన్ కుమార్ బోరా ఫిబ్రవరిలో పార్టీని వీడి బిజెపిలో చేరడంతో కాంగ్రెస్‌కు ఒకదాని తర్వాత ఒకటి దెబ్బలు తగులుతూనే ఉన్నాయి.పార్టీని పటిష్టం చేయడంలో గతంలో కీలకపాత్ర వహించిన బోరా హఠాత్తుగా బిజెపి పంచన చేరడంతో అధిష్ఠానం సైతం అవాక్కయింది. అది ఎవరూ ఊహించని పరిణామం. ఆ దెబ్బ నుంచి ఇంకా కోలుకోకుండానే మరో దెబ్బ తగిలింది. మూడు దశాబ్దాలు పైగా కాంగ్రెస్‌లో సమైక్యతకు కృషి చేసిన ఎంపి ప్రద్యుత్ బోర్దొలయ్ కూడా ఫిరాయించి బిజెపి తీర్థం పుచ్చుకోవడంతో అధిష్ఠానం మరింత సంక్షోభంలోకి జారిపోయింది.మరి కొందరు సీనియర్ నేతలు, పెద్దసంఖ్యలోకార్యకర్తలు కూడా వలస బాటపట్టారు. పార్టీపరిస్థితిమరింత క్షీణించకుండా 'అడ్డుచక్రం' వేయడానికి అసోం ఎన్నికల స్క్రీనింగ్ కమిటీచైర్‌పర్సన్‌గా ప్రియాంక గాంధీని అధిష్ఠానం నియమించింది. ఆమె తరచుగా గువాహతి,ఇతర ప్రాంతాలలో పర్యటిస్తూ పార్టీ కార్యకర్తలు, నేతల్లో కొత్త ఉత్సాహం నింపడానికి యథాశక్తి ప్రయత్నిస్తున్నారు. కానీ వలసలను మాత్రం ఆపలేకపోతున్నారు.హిమంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె తయారుచేసిన ఛార్జిషీట్ల ప్రభావం కూడా అంతగాకనిపించలేదనే చెప్పాలి.కాంగ్రెస్‌లోని చివరి హిందూ నేత కూడా బిజెపిలోకి వచ్చేదాకా విశ్రమించబోనంటూ హిమంత ఇటీవల చేసిన మరో ప్రకటన మరింత కాక పుట్టిస్తోంది. కాంగ్రెస్ కేవలం ఒక నిర్దిష్ట వర్గానికే పరిమితమైన పార్టీ అంటూ హిమంత చేస్తున్న విమర్శలు కూడా ఎక్కువ ప్రభావాన్నే చూపుతున్నాయి. ముఖాముఖి పోరులో కాంగ్రెస్‌ను మానసికంగా దెబ్బతీసిఎన్నికల ముందే విజయాన్ని ఖరారు చేసుకొనే దిశగా బిజెపిఅడుగులు వేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ ఇటీవల రెండు సార్లు అసోంలోపర్యటించి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో వాటి ప్రభావం కూడా ఎన్నికలపై కనిపిస్తుందని భావిస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో ఇద్దరు కీలకనేతలు పార్టీని వదలి వెళ్లడంతో ప్రియాంక గాంధీకి కూడా పరిస్థితి దిక్కుతోచకుండా ఉంది. 2015కు ముందు హిమంత కూడా కాంగ్రెస్ నాయకుడే. కానీ ఇప్పుడు! ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ చేసినవాడు. అందుకే రానురాను కాంగ్రెస్ మరింతగా బలహీనపడుతోంది. తాజా ఫిరాయింపులన్నిటికి సూత్రధారి ఆయనే అనడంలో సందేహం లేదు. గౌరవ్ గొగొయ్‌కి పార్టీ రాష్ట్ర నాయకత్వం అప్పగించిన తర్వాత నాయకుల మధ్యవిభేదాలు అధికమయ్యాయి. ప్రచార కమిటీ సారథి అయిన బోరా, మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ అయిన బోర్దొలాయ్ 'చే' జారిన తర్వాత పదిమందిని ఆకట్టుకోగల సీనియర్ నాయకులే కాంగ్రెస్‌కు కరవయ్యారు. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ చుక్కాని జారిపోయినట్లే కనిపిస్తోంది. సరైన నాయకులు లేనిచోట ప్రియాంక మాత్రం పార్టీని ఎలా గట్టెక్కించగలరో చూడాలి. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 29 శాతం ఓటు బ్యాంకు ఉంది. అది ఎంత వరకు నిలబడుతుందో, ప్రియాంక గాంధీ ఎలా నిలబెట్టగలుగుతారో సందేహమే. ●


ప్రియాంక గాంధీ

---

# అనుతిన్‌కే 'థాయ్' పట్టం!

థాయిలాండ్

**గన్ని మోహన్**

ఆగ్నేయాసియాలోని చిన్నదేశంలో జరిగిన ఎన్నికల్లో ఆ దేశ పార్లమెంటుకు అనుతిన్ చర్నవిరకుల్ రెండోసారి ఎన్నిక కావడం దేశంలో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలే నని తెలుస్తోంది. ఆయన స్థాపించిన భూంజాథాయ్ పార్టీ గణనీయమైన ఫలితాలు సాధించింది. కింగ్‌డమ్ ఆఫ్ థాయిలాండ్‌గా పేర్కొంటున్న ఈ చిన్న దేశంలో మైన్మార్, లావోస్, కాంబోడియా, మలేసియా దేశాలు సరి హద్దులుగా కొనసాగుతుంటే అత్యధికంగా 2615 కిలోమీటర్ల సముద్ర తీరం కూడా ఉన్న దేశంగా ఉంది. దేశజనాభా కూడా 71.5 మిలియన్లుగా ఉంది. ప్రతి చదరపు కిలోమీటరుకు 140మంది వ్యక్తుల నివాస సాంద్రత కలిగి ఉన్న ఈ దేశంలో అధికారం కోసం కూటముల కుమ్ములాటలు తీవ్రస్థాయిలోనే జరిగాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 299 స్థానాలున్న పార్లమెంటులో 292 స్థానాలు గెలిచి భూంజాథాయ్ పార్టీ మెజార్టీ మార్కును అధిగమించింది. దీనితో వెంటనే బాధ్యతలు స్వీకరించిన అనుతిన్ కేబినెట్‌ను కూడా తనదైన శైలిలో విస్తరించేపనిలో పడ్డారు. ముందు థాయిలాండ్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన దృష్టిసారించారు. విపక్షాలు కూడా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని దేశ ప్రజల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేద్దామంటూ బాధ్యతలు స్వీకరించిన వెంటనే థాయ్ ప్రధాని ఇచ్చిన పిలుపు అందరిని కలుపుకుని వెళ్లాలన్న లక్ష్యంగా కనిపిస్తోంది. రెండు దశాబ్దాల పాటు కొనసాగిన ఏకపక్ష పాలన అనంతరం భూంజాయ్‌థాయ్ పార్టీ కొన్ని సవాళ్ల ఎదుర్కొన్నా చివరకు నిలదొక్కుకుని అధికారం చేపట్టగలిగింది. దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అయింది. రుణభారం పెరిగింది. వాణిజ్యపరంగా అనిశ్చితి ఉంది. దీనికితోడు ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధం కూడా కొంత దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించింది. 558.57 బిలియన్ డాలర్ల జిడిపి కలిగిన థాయిలాండ్ తలసరి ఆదాయం కూడా నామ మాత్రంగానే ఉంది. గత ఏడాది కొలమానం చూస్తే 7942 డాలర్లుగా ఉంది. ఇక వృద్ధిరేటు కూడా 2 శాతం నుంచి 2.5 శాతానికి మించిపోవడం లేదు. ఉత్పత్తిరంగం, పర్యాటకం వ్యవసాయ రంగాలపైనే ఆధారపడిన ఈ దేశంలో ఇప్పుడు సంస్కరణలు అత్యవసరం. ఆటో విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ దేశానికి నంబర్‌వన్‌గా పేరుంది. పర్యాటకరంగ పరంగా కూడా ఏటా 39 మిలియన్ల మంది సందర్శిస్తారు. వీటి నుంచే ప్రధాన ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్న థాయిలాండ్‌లో ఇప్పుడు సంస్కరణలు అనివార్యం అవుతున్నాయి. శక్తివంతమైన మిలిటరీ, న్యాయ వ్యవస్థలకు అనుగుణంగా అనుతిన్ పాలన చేయగలరన్న అంచనాలు ఇప్పటికే దేశ ప్రజల్లో నెలకొన్నాయి. థాయిలాండ్‌లో దశాబ్దాల తరబడి నెలకొన్న సంస్థాగత పాలన నుంచి ఇప్పుడిప్పుడే ప్రజాభీష్ట పాలనవైపు కొనసాగుతున్నదన్న భావన నెలకొంది. దేశంలో నిర్వహించిన రిఫరెండమ్ కూడా మార్పు రావాలనే కోరుకుంది. అందువల్లనే ఇప్పుడు మార్పు అనివార్యమై అనువంశిక పాలనకు తెరదించి కొత్తపార్టీని ప్రజలు ఎన్నుకున్నారు. జాతీయ వాదంతోను, మిలిటరీ సానుకూల, రాజరిక సానుకూల వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఇప్పుడు అనుతిన్‌పై పడింది. అలాగే కాంబోడియాతో ఉన్న సరిహద్దు వివాదాన్ని కూడా తక్షణమే పరిష్కరించుకోవాల్సిన అవసరం కూడా సూచిస్తోంది. ఈ సమస్యల పరిష్కారం తోనే అనుతిన్ సామర్థ్యం, నాయకత్వ సత్తా వెలుగులోకి వస్తుందని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. థాయిలాండ్ కొత్త ప్రధానికి తక్షణమే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, ఆ తర్వాత కాంబోడియాతో నెలకొన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవం ముందున్న సవాళ్లని తెలుస్తోంది. ఈ సరిహద్దు వివాదంపై కాల్పుల విరమణ అవగాహన ప్రస్తుతం అమలులో ఉంది. 800 కిలోమీటర్ల సరిహద్దు వివాదాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం భూంజైథాయ్ పార్టీకి సూచిస్తోంది. అంతేకాకుండా సరిహద్దు ప్రహరీ నిర్మాణం, అటూ ఇటూ రాకపోకలు మూసివేతతోపాటు లక్షమందికిపైగా వలంటీర్ సైనికులను నియమించుకుని భద్రతను పెంచాల్సిన అవసరం ఎంతో ఉంది. గతంలో ఆయన హయాంలోనే మిలిటరీకి తక్షణ కార్యాచరణ చేపట్టే అధికారాలను కూడా కల్పించింది. భూమ్‌జాయ్‌థాయ్ పార్టీకి ఇతర పక్షాల నుంచి అసమ్మతిని కూడా ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి. రెండో అతి పెద్ద పార్టీగా ఉన్న ప్రొగ్రెసివ్ పీపుల్స్ పార్టీ 120 సీట్లతో అనుతిన్‌కు పక్కలో బల్లెంగా నిలిచింది. దశాబ్దాలుగా పాలించిన ఫ్యూథాయ్ పార్టీ కేవలం 74 సీట్లతో మూడో స్థానానికే పరిమితం కావడంతో తిరుగుబాటు ఉండదని తేలిపోయింది. అంతకుముందు పాలించిన పేటోంగ్ట్రాన్ షినవత్రా కాంబోడియాతో ఉన్న సంబంధాలపై నైతిక నియమావళి ఉల్లంఘించారని గద్దెదిగాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రధానిగా వచ్చిన అనుతిన్ పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు పిలుపు నిచ్చారు. అప్పటి నుంచి ఆయన సరిహద్దు వివాదం, ఆర్థిక వ్యవస్థలనే ప్రచారాస్త్రాలుగా చేసుకుని పాలన పగ్గాలు చేపట్టారు. అన్నింటికంటే ముఖ్యంగా థాయ్ రాజ్యాంగ న్యాయస్థానం అనుతిన్ ఎన్నికలను ధృవీకరించాల్సి ఉంది. ఎన్నికల సంఘంపై అంబుడ్స్‌మన్ ఆఫీస్ పిటిషన్ దాఖలు చేయడంతో ఎన్నికలపై మళ్లీ సందిగ్ధత నెలకొంది. మూడొంతుల మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడంతో అనుతిన్ చర్నవిరకుల్ తనశైలి పాలన మార్కును చూపించగలరన్న ఆశాభావం థాయ్‌ప్రజల్లో నిలువెల్లా నెలకొంది. ప్రజల ఆశలు ఎంతమేరకు నెరవేరుస్తారన్నది ఇప్పుడు దేశ ప్రధాని చర్నవిరకుల్ పాలనా దక్షతపైనే ఆధారపడి ఉంది. ●



అనుతిన్

---

# ప్రశ్నార్థకంగా మారిన తైవాన్ భవితవ్యం

**సుంకవల్లి సత్తిరాజు**

ఒక వైపు పశ్చిమాసియా భగ్గుమంటుంటే, తూర్పు ఆసియాలో కూడా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. తైవాన్‌పై చైనా ఏక్షణంలోనైనా దాడి చేసే అవకాశముంది. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రజలంతా సుఖశాంతులతో జీవిస్తున్న తైవాన్‌లో చైనా కాలు మోపడానికి సిద్ధంగా ఉంది. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా భాసిల్లుతున్న తైవాన్‌ను ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తనలో విలీనం చేసుకుని నియంతృత్వ బీజాలను నాటడానికి డ్రాగన్ తహతహలాడుతున్నది. తూర్పు ఆసియాలో భూసరిహద్దులు లేని ద్వీప దేశం తైవాన్. తైవాన్‌ను 'ఫార్మోసా' అని కూడా పిలుస్తారు. చైనా ప్రధాన భూభాగం నుండి తైవాన్ ప్రావెన్స్‌ని 'స్ట్రయిట్ ఆఫ్ తైవాన్' వేరు చేస్తున్నది. ఇటీవలి కాలంలో చైనా,తైవాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చెలరేగి సర్దుమణిగిన విషయం విదితమే. అయితే తాజాగా తైవాన్ చైనాల మధ్య ఉద్రిక్తతలు తిరిగిఊపిరి పోసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు క్షిపణుల వర్షం కురిపిస్తూ భీకర యుద్ధం చేస్తున్న తరుణంలో, ఇరాన్ డ్రోన్ల సహాయంతో అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తూ, హార్ముజ్ జలసంధి పై పట్టు బిగించి, చమురు సరఫరా జరగకుండా నిలిపివేసి ప్రపంచాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టిన క్లిష్ట సమయంలో సందట్లో సడేమియా అన్నట్టుగా తైవాన్ ఆక్రమణకు చైనా పావులు కదపడం పెరుగుతున్న సామ్రాజ్య వాద కాంక్షకు పరాకాష్టగా భావించాలి. వర్తమాన ప్రపంచం అశాంతికి నిలయంలా మారింది. ఈ పరిస్థితులను ఇలాగే గాలికి వదిలేస్తే మూడవ ప్రపంచ మహాసంగ్రామాన్ని ఏరికోరి ఆహ్వానించడమే కాగలదు. శాంతి భద్రతలు కరువైతే యుద్ధోన్మాదం విలయతాండవం చేయకతప్పదు. ఎక్కడైతే శాంతి సుస్థిరతలకు భంగం వాటిల్లుతుందో,అక్కడ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇప్పటి వరకు జరిగిన యుద్ధాలు, వర్తమానంలో పలుదేశాల మధ్య జరుగుతున్న సంఘర్షణలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. విజ్ఞానం పెరిగినా అజ్ఞానం వెర్రితలలు వేస్తూ యుద్ధాలకు పురిగొల్పుతున్నది. ఇతర దేశాలకుచెందిన భూభాగాలను ఆక్రమించాలనేదుగ్ధతో, ఆధిపత్య జాఢ్యంతో జరుగుతున్న సంఘటనలు ప్రపంచ ప్రజలను అశాంతికి గురిచేసి,వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. అశాంతి, అలజడులతో, యుద్ధాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు తిరగబడుతున్నాయి.ప్రపంచంలోని పలు దేశాల్లో ఇప్పటికీ ప్రజలు జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆకలి,దరిద్రం,నిరుద్యోగం, నిరక్షరాస్యత, అవినీతి వంటి పలుఅంశాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సామ్రాజ్య విస్తరణ కోసం వివిధ దేశాల మధ్య జరిగే యుద్ధాల వలన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకున్నామన్న అహంకారంతప్పయుద్ధాల వలన సాధించేదేమీ ఉండదన్న సత్యం బోధ పడేదెప్పుడు? ప్రజలను నిత్య మారణహోమంలో సమిధలుగా చేసి తృప్తి పడడం ఆధునిక యుగంలో చోటుచేసుకుంటున్న తీవ్రమైన ఉన్మాదం. ఆధునిక యుగంలో యుద్ధాలు అనాగరికానికి, అరాచక వాదానికి పరాకాష్ట. తైవాన్ సరిహద్దుల్లోకి చైనా తన యుద్ధ విమానాలను, సైన్యాన్ని భారీగా మోహరిస్తుందన్న వార్తలు భయోత్పాతాన్ని కలిగిస్తున్నాయి. తైవాన్ పై డ్రాగన్ దేశం దాడిచేసి, ఆక్రమించుకోబోతున్నదా? దీనిపై ప్రపంచ దేశాల ప్రతిస్పందన ఎలాఉండబోతున్నది? ప్రశాంతంగా ఉన్న ప్రపంచాన్ని తన అహంకారంతో యుద్ధాల వైపు నెట్టిన అమెరికాకు చైనాను విమర్శించే నైతిక హక్కు ఉంటుందా?ఒక సమస్య తరువాత మరొక సమస్య ప్రపంచ దేశాలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక వైపు అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. అమెరికాకు మిత్ర దేశాలుగా మారిన గల్ఫ్‌దేశాలన్నీ విధ్వంసమైపోతుంటే, ప్రపంచంలో చమురు సంక్షోభం తీవ్రమైపోతుంటే ఆగని ఇరాన్ ప్రతీకార జ్వాలల్లో అమెరికా ఆయుధ సంపత్తి భస్మీపటలమైపోతున్నది. అమెరికా,ఇరాన్ దేశాల ఇగోలకు ప్రపంచ దేశాలన్నీ విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలను వణికిస్తున్న మరోసంఘర్షణకు చైనా తెరతీసింది. తైవాన్ పైదాడికి తెగబడుతున్నది. తూర్పు ఆసియాలో వాయవ్య పసిఫిక్ మహాసముద్రంలో భూ సరిహద్దులు లేని ద్వీప దేశమైన తైవాన్‌ను ఆక్రమించుకుని, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో విలీనంచేసి తూర్పు ఆసియాలో తిరుగులేనిశక్తిగా ఎదగాలని చేసే ప్రయత్నంలో భాగంగానే చైనా తన సైనిక బలగాలను, యుద్ధ విమానాలను తైవాన్ సమీపంలో మోహరిస్తున్నది. చైనా చాలా కాలంగా తైవాన్‌ను తన దేశంలో విలీనం చేసుకోవాలనే కుతంత్రానికి తెరలేపింది. తైవాన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం తైవాన్‌కు ఆయుధాల సరఫరా వేగవంతం చేయాలని ఇటీవల అమెరికా సెనేట్ కోరింది.ఇప్పటికే తైవాన్ తన దేశ రక్షణ కోసం 3.5లక్షల కోట్లు కేటాయించింది. తైవాన్ చైనాలో అంతర్భాగమని, తైవాన్‌ను ఆక్రమించుకుంటామని జిన్‌పింగ్ హెచ్చరించగా, ప్రజాస్వామ్యదేశమైన తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని ఆ దేశ అధ్యక్షుడు లైచింగ్ టె ప్రకటించడమే కాకుండా,ఇందుకు అమెరికా సహాయాన్ని అర్థించడం కూడా జరిగింది. దక్షిణ కొరియా, జపాన్ వంటి పలు దేశాలు తైవాన్‌కు అండగా నిలబడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వెనిజులాపై దాడిచేసి ఆ దేశ అధ్యక్షుడైన నికోలస్ మదురోను నిర్బంధించడం, ఇరాన్‌పై యుద్ధానికి దిగడంవంటి పలుకారణాలను సాకుగాచూపి, తాము కూడా తైవాన్‌ను ఆక్రమించుకుంటే తప్పేంటనే ఆలోచన చైనాలో అంకురించింది. తైవాన్ అంశం చిలికి చిలికి గాలివానలా మారి పెను యుద్ధానికి దారితీసే అవకాశాన్ని తోసి పుచ్చలేం. ఇప్పటికే తైవాన్ జలసంధి చుట్టూ చైనా వందలాది యుద్ధ విమానాలను, పదుల సంఖ్యలో యుద్ధ నౌకలను మోహరించినట్టు వార్తలు వెలువడ్డాయి. తైవాన్ చూట్టూ ఇటీవల చైనా సైనిక, నౌకా వైమానిక విన్యాసాలు చేసింది. తైవాన్ భూతల, గగనతలాల్లో చైనా ఆధిపత్యం చెలాయించడం ఏమిటి? ఈ పరిస్థితులు ఏర్పడడానికి కారణమేమిటి? తైవాన్‌ను తన దేశ అంతర్భాగంగా చైనా పేర్కొనడానికి కారణమేమిటి? తైవాన్ తనను తాను స్వతంత్ర దేశంగా ఎందుకు భావిస్తున్నది? చైనా తైవాన్ మధ్యలో అమెరికా ఎందుకు జోక్యం చేసుకుంటున్నదనే విషయాలపై అవగాహన కలగాలంటే చరిత్ర పుటలను తిరగేయాలి. అప్పట్లో చైనాలో చెలరేగిన అంతర్యుద్ధంలో చైనా ప్రధాన భూభాగంపై కమ్యూనిస్టులు పట్టుసాధించారు. 1949 లో చైనా లోని కువో మింటాంగ్ ప్రభుత్వం పతనంతో మావో జెడాంగ్ నేతృత్వంలో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆవిర్భవించింది. మావో చేతికి చైనా అధికార పగ్గాలు రావడంతో సివిల్ వార్‌లో ఓడిపోయిన సైనికులు,నాయకులు, వ్యాపారులు, లక్షలాది మంది ప్రజలు తైవాన్‌కు పలాయనం చిత్తగించి,అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పటి వరకు శాంతి, సామరస్యాలతో మనుగడ సాగిస్తున్నారు. చైనా ప్రధాన భూభాగం' పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' (పి.ఆర్.సి)గాను, తైవాన్ 'రిపబ్లిక్ ఆఫ్ చైనా' (ఆర్.ఓ.సి) గాను పిలువ బడుతున్నది. 1949 నుండి 1975 వరకు చియాంగ్ కై షేక్ ఆధ్వర్యంలో తైవాన్ గణనీయమైన ప్రగతి సాధించింది. అతని మరణానంతరం కూడా తైవాన్ అనేక రంగాల్లో ముందంజలో దూసుకుపోవడం గమనార్హం. నేడు ప్రపంచంలో తైవాన్ అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థలు గల దేశాల్లో 20వ స్థానంలో ఉంది.వన్ చైనా పాలసీ ప్రకారం తైవాన్‌ను ఏ దేశం స్వతంత్ర దేశంగా గుర్తించకూడదు. తైవాన్‌కు సంబంధించిన విషయాలను చైనాతో మాత్రమే అధికారికంగా సంప్రదించాలి. అమెరికా చైనాల మధ్య 1972, 1979, 1982వ సంవత్సరాల్లోమూడు కమ్యూనిక్ ఒప్పందాలు కుదిరాయి. వన్ చైనా పాలసీని ఉల్లఘించి, తైవాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేయడం,ప్రత్యక్ష ఒప్పందాలు కుదుర్చుకోవడం పట్ల,'త్రీ కమ్యూనిక్స్'ను ఉల్లంఘించడం పట్ల చైనా తీవ్ర అభ్యంతరం చెబుతున్నది. ఇప్పటికైనా తైవాన్‌ను చైనా ప్రత్యేక దేశంగా గుర్తించాలి. ఎకానమిస్ట్ ఇంటిలిజెన్స్ యూనిట్ జరిపిన సర్వేలో అత్యంత ఉత్తమమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు గల దేశాల్లో తైవాన్ 12వ స్థానం సంపాదించింది. ఇలాంటి అభివృద్ధి చెందుతున్న,ఉత్తమప్రజాస్వామ్యదేశమైన తైవాన్ అస్థిత్వాన్ని కాపాడాలి.యుద్ధాలతో ప్రజల జీవితాలు అతలాకుతలమైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో,చైనా గనుక తైవాన్ పైయుద్ధానికిదిగితే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమోతాయో ఊహించలేం. ప్రస్తుతం తైవాన్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ●



# మైనారిటీల ఓట్లు హారిస్తున్న బిజెపి

## ఓటర్ల జాబితా సవరణ దానికోసమే..

## ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతా: మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మార్చి 21:** పవిత్ర రంజాన్ పర్వదినం వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్న ఆమె, ముస్లిం మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ పేరుతో మైనార్టీల ఓటు హక్కును కాలరాస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, ముఖ్యంగా మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ తొలగింపులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. మోదీ కానీ, బీజేపీ కానీ మీ ఓటు హక్కును దొంగిలించనివ్వను. ప్రజాస్వామ్యాన్ని, పౌరుల హక్కులను కాపాడేందుకు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడతానని ఆమె అన్నారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. వెరిఫికేషన్ సాకుతో అర్హులైన వారిని జాబితా నుంచి తొలగించడం ద్వారా బీజేపీకి లబ్ధి చేకూర్చాలని చూస్తున్నారంటూ ఎన్నికల సంఘంపై మమత విమర్శలు గుప్పిస్తున్నారు. బెంగాల్‌ను టార్గెట్ చేసి, రాష్ట్రాన్ని విభజించాలని చూస్తున్న వారు ఖినరకానికిఖి వెళతారంటూ ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు ఇక్కడ అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తారు. ఈ సామాజిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరు కోమని మమత స్పష్టం చేశారు. బెంగాల్ అస్తిత్వాన్ని దెబ్బతీసే శక్తులకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

### బెంగాల్ ఎన్నికలకు భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రెండు దశల్లో జరగనున్న పోలింగ్ కోసం రికార్డు స్థాయిలో 2,400 కంపెనీల భద్రతా బలగాలను మోహరించనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 23న తొలిదశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ జరగనుంది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు , ఇండియా రిజర్వ్ బెటాలియన్, ఇతర రాష్ట్రాల సాయుధ పోలీసులతో కూడిన ఈ బలగాలను ప్రతి దశలోనూ మోహరిస్తారు. ఇప్పటికే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా 480 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు బెంగాల్‌లో విధుల్లో ఉన్నాయి. గతంలో 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింస చెలరేగిన నేపథ్యంలో ఈసీ ఈసారి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా భద్రతను కొనసాగించాలని నిర్ణయించింది. ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కోసం 200 కంపెనీలు, శాంతిభద్రతల పరిరక్షణ, హింస నివారణ కోసం మరో 500 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు రాష్ట్రంలోనే ఉంటాయని స్పష్టం చేసింది. పోలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన 1,700 కంపెనీల బలగాలను వెనక్కి పంపిస్తారు. బలగాల కదలికలు, మోహరింపును సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సమన్వయం చేస్తుంది. సీఆర్పీ ఎఫ్ వెస్ట్ బెంగాల్ సెక్టార్ ఐజీ శలభ్ మాథుర్‌ను ఖిస్టేట్ ఫోర్స్ కోఆర్డినేటర్‌గా ఈసీ నియమించింది. ఈ బలగాలకు అవసరమైన రవాణా, వసతి ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



## డేజియాన్ ఆటో విడిభాగాల ఫ్యాక్టరీలో ప్రమాదం

### 10 మంది మృతి, 59 మందికి తీవ్రగాయాలు

**సియోల్, మార్చి 21:** దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. డేజియాన్ నగరంలోని ఒక ఆటో విడిభాగాల తయారీ కర్మాగారంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 10 మంది కార్మికులు మరణించగా, 59 మంది గాయపడ్డారు. వీరిలో 25 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఫ్యాక్టరీ భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో అధికారులు రోబోలను రంగంలోకి దింపి, భవనాన్ని చల్లబరిచాక గాలింపు పనులు చేపట్టారు. ప్రమాద సమయంలో లోపల చిక్కుకుపోయిన మరో నలుగురు కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పైనుంచి దూకగా, మరికొందరు పొగ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జేమ్యూంగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 500 మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. మంటలను అదుపులోకి తెచ్చిన సిబ్బంది, ఫ్యాక్టరీలోని 100 కిలోల ప్రమాదకర రసాయనాలను సురక్షితంగా బయటకు తరలించారు.

# మంటల్లో పశ్చిమాసియా

## నతాంజ్ అణుకేంద్రంపై మళ్లీ దాడులు.. ఖండించిన ఇరాన్



**టెహ్రాన్, మార్చి 21:** ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై మరోసారి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయని తస్నీమ్ వార్తా సంస్థ తెలిపింది. అయితే, రేడియో ధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్‌లు నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయని మండిపడింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన వేళ తాజా దాడులు జరగడం గమనార్హం. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్‌పై ఓసారి దాడి జరిగింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) ఈ విషయాన్ని ధ్రువీకరించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా అనేక భవనాలు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండకపోవచ్చని, అణు కేంద్రానికి పెద్దగా నష్టం లేదని తెలిపింది. టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అణుశుద్ధి కేంద్రాన్ని గతేడాది సైతం అమెరికా, ఇజ్రాయెల్‌లు లక్ష్యంగా చేసుకున్నాయి.

## యుద్ధం వేళ.. ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా




**వాషింగ్టన్, మార్చి 21:** యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యుఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం ముగించడంపై ఆలోచిస్తున్నాం: ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 21:** పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యుఎఇ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. హార్మూజ్ బాధ్యత తీసుకోవాలి.. ఈ సందర్భంగా హార్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు.

## డిగోగార్షియా యుఎస్ బేస్‌లపై ఇరాన్ క్షిపణి దాడులు



**టెహ్రాన్, మార్చి 21:** పశ్చిమాసియాకే పరిమితమైన అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలు ఇప్పుడు హిందూ మహా సముద్రానికి విస్తరించాయి. ఏకంగా 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డియాగోగార్సియాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించడం అంతర్జాతీయంగా కలకలం సృష్టిస్తోంది. ఇరాన్ వద్ద ఇంతటి శక్తిమంతమైన క్షిపణులు ఉన్నాయని అంచనా వేయడంలో విఫలమయ్యామని అమెరికా భావిస్తోంది. ఇరాన్ రెండు క్షిపణులను ప్రయోగించగా, ఒకటి సాంకేతిక లోపంతో విఫలమైంది. మరొకటి అమెరికా రక్షణ వ్యవస్థల చేతిలో నిర్వీర్యమైంది. దాడి విఫలమైనప్పటికీ, కీలకమైన యుద్ధ విమానాలు, బాంబర్లు ఉండే స్థావరంపై దాడికి యత్నించడం అమెరికాను ఆత్మరక్షణలో పడేసింది. ఇరాన్ తన శత్రువులకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా భద్రత ఉండదని హెచ్చరించింది. పార్కులు, పర్యాటక కేంద్రాలే లక్ష్యంగా దాడులు ఉంటాయని ఇరాన్ జనరల్ ఒకరు ప్రకటించడం ప్రపంచ ఉగ్రవాద ముప్పుపై ఆందోళనలను పెంచుతోంది. ఇప్పటికే హార్మూజ్ జలసంధిలో రవాణా స్తంభించిపోవడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఒకవైపు దాడులతో రెచ్చిపోతున్న ఇరాన్, మరోవైపు కీలక నేతలను కోల్పోతోంది. ఈ వారంలోనే అలీ లారిజానీ వంటి ముఖ్య నేతతో పాటు, తాజాగా రివల్యూషనరీ గార్డ్ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనీ కూడా అమెరికాఇజ్రాయెల్ దాడిలో మరణించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యం తగ్గలేదని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

## తోటి విద్యార్థిని కాల్చి చంపిన కళాశాల విద్యార్థి



**వారణాసి, మార్చి 21:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కాలేజీ క్యాంపస్‌లోనే విద్యార్థిని మరో విద్యార్థి తుపాకీతో అతి కిరాతకంగా కాల్చి చంపాడు. ఉదయ్ ప్రతాప్ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న సూర్య ప్రతాప్ సింగ్ (23) అనే విద్యార్థిని మంజీత్ చౌహాన్ అనే మరో విద్యార్థి హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం వీరిద్దరి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుడు మంజీత్.. సూర్య ప్రతాప్‌పై దాదాపు 8 రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కింద పడిపోయిన తర్వాత కూడా అతనిపైకి ఎక్కి మరీ కాల్పులు జరపడం అక్కడున్న వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దారుణానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనతో కాలేజీ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఫర్నిచర్ ను ధ్వంసం చేసి నిరసనలకు దిగారు. మరోవైపు, మృతుడి తండ్రి తన కుమారుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు.

నా కొడుకును చంపిన వాడిని ఎన్‌కౌంటర్ చేయాలి. అప్పుడే వాడి ఆత్మకు శాంతి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వారణాసి పోలీసులు ప్రధాన నిందితుడు మంజీత్ చౌహాన్ ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న ఇతరుల కోసం గాలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాలేజీ వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

## ఇరాక్ అమెరికా కాన్సులేట్‌పై రాకెట్ల దాడి

**టెహ్రాన్, మార్చి 21:** అమెరికా, ఇరాన్ మధ్య రాజుకుంటున్న ఉద్రిక్తతలు ఇరాక్‌ను తాకాయి. రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య, లాజిస్టిక్ కేంద్రంపై మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దౌత్య కార్యాలయం అగ్నిప్రమాదానికి గురైంది. దాడి తీవ్రతకు దట్టమైన నల్లటి పొగ కిలోమీటర్ల మేర ఆకాశంలోకి ఎగసిపడటంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. గత కొంతకాలంగా బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం, సైనిక స్థావరాలపై రాకెట్లు, డ్రోన్లతో దాడులు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన దాడికి అషాబ్ అల్‌కహ్ఫ్ అనే ఇరాన్ మద్దతు ఉన్న గ్రూప్ బాధ్యత స్వీకరించింది. మరోవైపు, కతైబ్ హిజ్బుల్లా అనే మరో శక్తిమంతమైన గ్రూప్ కీలక ప్రకటన చేసింది. నివాస ప్రాంతాలపై అమెరికా దాడులు నిలిపివేస్తే, తాము ఐదు రోజుల పాటు దాడులు ఆపుతామని షరతు విధించింది. అమెరికా తన కేంద్రాల రక్షణకు సీ-రామ్ వంటి అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తోంది. వీటి ద్వారా చాలా డ్రోన్లను గాలిలోనే కూల్చివేస్తున్నప్పటికీ, కొన్ని లక్ష్యాలను ఛేదించడంతో ఆస్తి నష్టం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు మొదలైనప్పటి నుంచి ఇరాన్ అనుకూల గ్రూపులు ఇరాక్‌లోని అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఇరు దేశాల ఆధిపత్య పోరులో ఇరాక్ యుద్ధ క్షేత్రంగా మారుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద దాడులు జరగడంతో విమాన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ భయానక పరిస్థితుల నేపథ్యంలో, తమ పౌరులు తక్షణమే ఇరాక్ విడిచి వెళ్లాలని అమెరికా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.



## తమిళనాడులో రామ్‌దాస్, శశికళ కలయికతో పోటీ..

**చెన్నై, మార్చి 21:** తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇద్దరు సీనియర్ నేతలు, పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్. రామదాస్, జయలలిత నెచ్చెలి వీకే శశికళ అనూహ్యంగా చేతులు కలిపారు. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కొత్త కూటమి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తమ సొంత పార్టీల్లోనే ఈ ఇద్దరు నేతలు ఒంటరి కావడం గమనార్హం. పీఎంకేలో తన కుమారుడు అన్బుమణి రామదాస్‌తో విభేదాల కారణంగా ఎస్.రామదాస్ పార్టీపై పట్టు కోల్పోయారు. మరోవైపు, అన్నాడీఎంకేను దక్కించుకోలేకపోయిన శశికళ ఏఐపీటీఎంఎంకే పేరుతో సొంత పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలో తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే వీరిద్దరూ ఏకమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. విల్లుపురం జిల్లా తైలాపురంలోని రామదాస్ నివాసంలో వీరిద్దరూ సమావేశమయ్యారు. సుదీర్ఘ చర్చల అనంతరం పొత్తు నిర్ణయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ తమ కూటమి తరఫున అభ్యర్థులను నిలబెడతామని స్పష్టం చేశారు. తమ కూటమిలోకి మరిన్ని చిన్న పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు రామదాస్ తెలిపారు. ఈ కొత్త కూటమి అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే ఓటు బ్యాంకులకు గండి కొట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## భూటాన్‌లోనూ భారత్ యుపిఐ సేవలు!




**థింపు, మార్చి 21:** భారత యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు సరిహద్దులకు ఆవల కూడా విస్తరిస్తున్నాయి. పొరుగుదేశమైన భూటాన్‌తో సరిహద్దు చెల్లింపుల కోసం భారత్ చేసుకున్న ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య డబ్బు పంపడం మరింత చౌకగా, సులభంగా మారనుంది. పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఈ నగదు బదిలీ ప్రక్రియను అమలు చేయనున్నారు. భారత పోస్టల్ శాఖ, భూటాన్ పోస్టల్ శాఖ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) వారి పాస్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను భారత్ యూపీఐతో అనుసంధానించడం ద్వారా ఈ సేవలను అందిస్తారు. ఈ చొరవతో ఇరు దేశాల పౌరులకు డిజిటల్ చెల్లింపు సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక సంబంధాలు బలపడతాయని అధికారిక ప్రకటనలో తెలిపారు. కేవలం నగదు బదిలీకే పరిమితం కాకుండా, పోస్టల్ కార్యకలాపాలు, టెక్నాలజీ అభివృద్ధి, శిక్షణ, లాజిస్టిక్స్, ఫిలాటెలీ (తపాలా బిళ్లల సేకరణ) వంటి రంగాల్లో సహకరించుకోవాలన్నారు.

## హార్మూజ్ జలసంధిలో చిక్కుకున్న రెండు భారత్ నౌకలు!

**న్యూఢిల్లీ, మార్చి 21:** అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు భారత వంటింటిపై నేరుగా ప్రభావం చూపేలా ఉన్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొనడంతో, భారత్‌కు వంటగ్యాస్ (ఎల్‌పీజీ) తీసుకువస్తున్న రెండు భారీ ట్యాంకర్లు సముద్ర మార్గంలో నిలిచిపోయాయి. ఈ పరిణామంతో దేశంలో ఎల్‌పీజీ సరఫరాపై ఆందోళనలు మొదలయ్యాయి. ఖతార్ నుంచి ఎల్‌పీజీ లోడ్ చేసుకుని మహానది, నర్మద అనే రెండు భారతీయ నౌకలు స్వదేశానికి బయలుదేరాయి. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ క్షిపణులతో, అమెరికా యుద్ధనౌకలతో పహారా కాస్తుండటంతో ఈ మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో నౌకల కెప్టెన్లు ముందుజాగ్రత్త చర్యగా ఒమన్ తీరంలోని సురక్షిత ప్రాంతంలో ట్యాంకర్లను నిలిపివేసి, ఉద్రిక్తతలు తగ్గే వరకు వేచి చూస్తున్నారు. గతనెల28న ఈ ప్రాంతంలో ఘర్షణలు మొదలైనప్పటి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత్ తన ఎల్‌పీజీ అవసరాలలో సింహభాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఇప్పుడు ఈ సరఫరా గొలుసుకు ఆటంకం కలగడంతో, దేశీయంగా వంటగ్యాస్ కొరత ఏర్పడి ధరలు అమాంతం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అధికంగా ఉండటంతో, ఈ రవాణా సమస్య సామాన్యుడిపై మరింత భారం మోపనుంది. ఈ పరిస్థితిని భారత విదేశాంగ, నౌకాయాన మంత్రిత్వ శాఖలు నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో గస్తీ కాస్తున్న భారత నౌకాదళం అవసరమైతే రంగంలోకి దిగడానికి సిద్ధమవుతోంది. భారత యుద్ధనౌకల రక్షణతో ఈ ట్యాంకర్లను సురక్షితంగా జలసంధి దాటించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

## ఇరాన్ చమురు విక్రయాలకు అమెరికా అనుమతులు!



**వాషింగ్టన్, మార్చి 21:** ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అనూహ్య నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఇంధన మార్కెట్లపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు, సముద్రంలో ఇప్పటికే రవాణా అవుతున్న ఇరాన్ చమురు అమ్మకాలకు 30 రోజుల పాటు తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ద్వారా ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలను స్థిరీకరించాలని ట్రంప్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 19 మధ్య నౌకల్లోకి ఎక్కించిన ఇరాన్ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన లైసెన్స్‌లో స్పష్టం చేసింది. కొత్తగా చమురు ఉత్పత్తి చేయడానికి గానీ, కొనుగోలు చేయడానికి గానీ ఈ వెసులుబాటు వర్తించదని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో సుమారు 14 కోట్ల బ్యారెళ్ల చమురు ప్రపంచ మార్కెట్లకు అందుబాటులోకి వస్తుందని బెస్సెంట్ వివరించారు.

ఇరాన్‌తో కొనసాగుతున్న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీకారణంగా ఏర్పడిన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకే ఈ చర్య తీసుకున్నామని ఆయన తెలిపారు. ధరలను అదుపులో ఉంచేందుకు మేము ఇరాన్ బ్యారెళ్లనే టెహ్రాన్‌కు వ్యతిరేకంగా వాడుతున్నామని బెస్సెంట్ చేసిన వ్యాఖ్యలు అమెరికా వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో ఈ వెసులుబాటును అలుసుగా తీసుకోవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇరాన్ పొందడం కష్టతరం చేస్తామని, ఆ దేశంపై ఒత్తిడి విధానం యథాతథంగా కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు.

### అమెరికా దళాలకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు..

## బ్రిటన్‌కు ఇరాన్ హెచ్చరికలు



**టెహ్రాన్; మార్చి 21:** అమెరికాఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడి చేసేందుకు అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తోందన్న నివేదికల నేపథ్యంలో ఇరాన్ శనివారం తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే, స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. ప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వాడేందుకు అనుమతిస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించుకోవడానికి ఇరాన్ వెనుకాడదని అరాఘ్చి పేర్కొన్నారు. ఈ వివాదం తమది కాకపోయినా, బ్రిటన్ అనవసరంగా తలదూరుస్తోందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్ తన ఆందోళనను అధికారికంగా బ్రిటన్‌కు తెలియజేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చి, బ్రిటన్ హోం మంత్రి యెవెట్ కూపర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు సైనిక స్థావరాలను అందుబాటులో ఉంచడాన్ని తమపై జరుగుతున్న దురాక్రమణలో పాలుపంచుకోవడంగానే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ హెచ్చరికలకు బ్రిటన్ కూడా గట్టిగానే బదులిచ్చింది. అరాఘ్చితో జరిగిన ఫోన్ సంభాషణలోనే హోం మంత్రి యెవెట్ కూపర్ తమ వైఖరిని స్పష్టం చేశారు. బ్రిటన్ స్థావరాలు, భూభాగం, లేదా ఇతర ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆమె తేల్చిచెప్పారు. ఈ పరస్పర హెచ్చరికలతో ఇరాన్, బ్రిటన్ మధ్య దౌత్యపరమైన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## ఆ తొమ్మిది దేశాల గగనతలం వాడొద్దు

### విమాన సంస్థలకు డిజిసిఎ ఆదేశాలు

**న్యూఢిల్లీ, మార్చి 21:** పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ భారత విమానయాన సంస్థలకు ముఖ్య సూచనలు జారీ చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్, ఇరాక్, యూఏఈ సహా 9 దేశాల గగనతలాన్ని పూర్తిగా ఉపయోగించవద్దని స్పష్టం చేసింది. ఇరాన్ భూభాగంలో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు నిర్వహించడం, దీనికి ప్రతిగా ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగే అవకాశం ఉండటంతో పౌర విమానయానానికి తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని డీజీసీఏ తన ఆదేశాల్లో పేర్కొంది. సైనిక ఘర్షణల సమయంలో పొరపాటున పౌర విమానాలను శత్రు విమానాలుగా గుర్తించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. డీజీసీఏ ఆదేశాల ప్రకారం బహ్రెయిన్, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైత్, లెబనాన్, ఖతార్, యూఏఈ గగనతలాల్లో అన్ని ఎత్తులలోనూ విమానాలు నడపవద్దు. అయితే, ఒమన్, సౌదీ అరేబియా గగనతలంలో మాత్రం కనీసం 32,000 అడుగుల ఎత్తులో ప్రయాణించేందుకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని, మార్చి 28 వరకు కొనసాగుతాయని డీజీసీఏ వెల్లడించింది. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని,

అత్యవసర ప్రణాళికలు అమలు చేయాలని సూచించింది. ఇప్పటికే కొన్ని విమానయాన సంస్థలు తమ సర్వీసులను దారి మళ్లిస్తుండటంతో ప్రయాణ సమయం పెరిగే అవకాశం ఉంది.

# రబీలో 90 లక్షల మె.ట. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు




## రెండు వారాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ప్రభుత్వం

### రైసుమిల్లర్ల సమావేశంలో పౌర సరఫరాల కమిషనర్ ఎం. స్టీఫెన్‌రవీంద్ర

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రబీ సీజన్‌లో 90లక్షల మె.ట ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. తెలంగాణ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించడమే లక్ష్యంగా శనివారం పౌర సరఫరాల భవన్‌లో రాష్ట్ర రైస్ మిల్లర్లతో ఆయన ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అదనపు గోదాములను వెంటనే గుర్తించి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లందరినీ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యం రైస్ మిల్లులు గోదాముల్లో తరలించడానికి క్షేత్రస్థాయిలో రవాణా ఏర్పాట్లు చేసు కోవాలనఙ జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వారి నుంచి ధాన్యం వెంటనే సేకరణ చేయాలని కోరారు. ధాన్యం అన్‌లోడ్ చేయడంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా, అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులు మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పని చేస్తామని రైస్ మిల్లర్లు అంగీకరించారు. ఈ సీజన్‌లో ధాన్యం ప్యాకింగ్ అవసరాలను తీర్చడానికి, గోనెసంచుల కేటాయింపులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మిల్లర్ల వద్ద ఇంకా 35 కోట్ల పాత గోనెసంచులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కమిషనర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రబీ కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా వెంటనే 10 కోట్ల సంచులను జిల్లా మేనేజర్లకు తిరిగి ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించారు. అంతేకాకుండా, 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన బియ్యం కు సంబంధించిన అంశాలను కూడా మిల్లర్లను రవీంద్ర ఆలస్యంపై దించిన వాటికి అనుగుణంగా ఉండాలని కమిషనర్ వివరించారు. 10 శాతం నూకలు, మినహాయింపుతో కలుపు కుని, 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నుండి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ కేటాయింపుకు ఆమోదం తెలిపారు. మిల్లింగ్ పరిశ్రమకు మద్దతుగా, 10 జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ ఛార్జీలను ప్రభుత్వం విడుదల చేసింది. అదే సమయంలో, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు ఇతర సమస్యలపై మిల్లర్ల నుండి కమిషనర్ వినతిపత్రాలను స్వీకరించారు. ఈ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన మిల్లర్లకు హామీ ఇచ్చారు. రాబోయే వారాల్లో తెలంగాణ వ్యాప్తంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సాఫీగా మరియు సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగేలా పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తోందని చెప్పారు. కారణాలు అడిగారు. బియ్యం కోసం ఎఫ్‌సిఐ నగటు నాణ్యతా ప్రమాణాలు రూపొం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్

## ఎల్లంపల్లి నిర్మాత కాంగ్రెస్ ప్రభుత్వమే

### రాష్ట్రానికే నర్సెట ఆయిల్‌పాం ముఖ్య కేంద్రం

### ఏ రాష్ట్రానికైనా ఇక్కడి నుంచే

### ఆయిల్ పంపిణీ : మంత్రి తుమ్మల

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/నంగునూర్, మార్చి 21,ప్రభాతవార్త :** కాళేశ్వరం కూలేశ్వరం అయిన తర్వాత ఇప్పటివరకు చుక్కనీరు తీసుకురాలేదని, కాళేశ్వరానికి జీవనది ఎల్లంపల్లి అని దాన్ని నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమే నని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్సెట్లలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ఈ నెల 22న సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి ఎక్కడికి నీళ్లు తరలించాలన్న ఎల్లంపల్లి కీలకమని, అక్కడ నుంచి నీరు తీసుకువచ్చి రిజర్వాయర్లలో నింపుతున్నామని, కాళేశ్వరం నుంచి నీళ్లు వస్తు న్నాయని మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు కూలిపోయిన కాళేశ్వరంలో ముక్కు మూసుకొని చావాలన్నారు. నర్సెట్లలో నిర్మించిన ఆయిల్‌పాం శ్రమ ఫలితం మాది, మీదేమో శిలాఫలకమని అర్థంపర్థం లేకుండా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజల్లో పరువు తీసుకోవద్దని సూచించారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రజల కష్టమని.. రైతుల భవిష్యత్‌కు సంబంధించిన ఫ్యాక్టరీ అని ప్రజల కష్టంతో నిర్మించిన ఫ్యాక్టరీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 2024లో టెండర్లు పిలవడం జరిగిందని అతి తక్కువ సమయంలో 16 నెలల్లోనే పూర్తి చేసిన దేశంలోనే మొదటి ఫ్యాక్టరీ అన్నారు. హైదరాబాద్ తప్ప అన్ని జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేయడానికి అవకాశం ఉందన్నారు. తాను వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 5 ఆయిల్‌పాం ఫ్యాక్టరీల నిర్మాణాలకు సంతకం చేసి ముందుగా నర్సెట ఫ్యాక్టరీని పూర్తి చేశామన్నారు. తెలంగాణలో ఎక్కడ ఆయిల్‌పాం సాగుచేసినా ఆయిల్ ఉత్పత్తి ఇక్కడి నుంచే జరుగుతుందన్నారు. రాష్ట్రానికే సిద్దిపేట ఆయిల్‌పాం ముఖ్య కేంద్రంగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నంత కాలం అవినీతి, ఆరాటం, దోపిడీ వ్యవహారాలే బిఆర్ఎస్‌ను ఓడిపోయిన గుర్తుకు రావడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేస్తే కనీస జ్ఞానం లేకుండా రుణమాఫీ కాలేదని మాట్లాడడం సరికాదని హరీశ్‌రావుని హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో ఐటి ఉద్యోగాల తగ్గుదల

### కాంగ్రెస్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాల తగ్గుదలని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట ఈ నెల 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బడ్జెట్ ప్రవేశ పెడుతున్న సమయంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క కూడా ఇదే విష యాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు. ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండుసార్లు అంగీకరిం చడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గు దలకు కృత్రిమ మేధస్సు (ఎఐ) కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపా లనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రెవెన్యూ అంచనాలు, వాస్తవ ఖర్చుల మధ్య స్పష్టత కరవు

### బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు, రెవెన్యూ అంచనాలు, వాస్తవ ఖర్చుల మధ్య స్పష్టత లేకుండా గందరగోళంగా ఉందని బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యా రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని మండిపడ్డారు. మేము ఎప్పటినుంచో 15శాతం కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, కేవలం సుమారు 8 శాతం మాత్రమే ఇచ్చారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో 14శాతం నుంచి 18శాతం వరకు కేటాయింపులు ఉన్నాయన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి ముఖ్య రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడాన్ని గొప్పగా చెప్పుకుంటుందని, కానీ కేంద్ర పథకాలను తమవిగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. మ్యాచింగ్ ఫండ్స్ ఇవ్వలేక, కనీస సమన్వయం లేక అనేక పథకాలు నిలిచిపోతున్నాయన్నారు. సోలార్ పంపుల వంటి పథకాలలో కూడా రాష్ట్రం వెనుకబడిందన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు సరిగా అమలు కావడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు సైతం బకాయిలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఏ శాఖను చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. పేదలకు ఇండ్ల నిర్మాణం నుంచి రైతుల సమస్యల వరకు ప్రతి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఎన్.రాంచందర్ రావుపిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడుతూ. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని పిలుపునిస్తున్నామని ఆయన అన్నారు.

## గిరిజన సంస్థలో అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** గిరిజన సహకార సంస్థ లో అవినీతి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వారిపై వేటు వేసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎల్‌పిజి పాయింట్లు, డీలర్ డిపోలు, డీలర్ గోదాములు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణతో పాటు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువుల కొనుగోళ్లలో జరుగుతున్న భారీ అవకతవకలపై కఠిన చర్యలు తీసుకుంది. గిరిజన సహకార సంఘాల పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న దోపిడీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి చేరకుండా స్థానిక అధికారులు మేనేజ్ చేస్తున్నట్టు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో సంబంధిత విభాగాల్లో నిధులు స్వాహా చేసిన అధికారులు, ఉద్యోగులపై క్రిమినల్ కేసులను నమోదు చేసే పనిలో సంబంధిత ఉన్నతాధికారులు ఉన్నారు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు, క్రిమినల్ కేసు విచారణ సమాంతరంగా సాగాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ప్రజల ప్రశంసలు అందుకున్న బడ్జెట్

### తెలంగాణ బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, ప్రజల ప్రయో జనాలే పరమావధిగా, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని 2026- 27 ఆర్థిక బడ్జెట్ నిదర్శనమని, తెలంగాణ బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ బడ్జెట్‌లో రూపొందించిన విధానాలను ప్రశంసించారు. పేర్కొ న్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ యుక్త వయస్సు బాలబాలికలకు పౌష్టికాహారంతో పాటు ఏర్పడకుండా ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు వంటి సంక్షేమపథకాలు అనేక ఇతర కొత్త పథకాలు చేసి అభివృద్ధి సంక్షేమం ఈ ప్రభుత్వంకు రెండు కళ్ళవంటివని ప్రజలకు వివరించే విధంగా ఈ బడ్జెట్ ఉందని అన్నారు. ప్రజల ప్రశంసలు అందుకున్న ప్రజాప్రభుత్వ బడ్జెట్ అని ఆయన కొనియాడారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన ప్రగతిని సాధించిందని దేశ జిడిపి వృద్ధిరేటు 9.8 శాతం నుండి 8 శాతానికి తగ్గి మందగమనంలో ఉన్నప్పటికీ తెలంగాణ వృద్ధి రేటు 10.6 శాతం నుండి10.7 శాతానికి మెరుగుపడడం విశేషమని అన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర జిఎస్‌డిపి 17,82,198 కోట్ల రూపాయలకు చేరిందని దేశ సగటు వృద్ధిరేటు కంటే తెలంగాణ 2.7 శాతం అధిక వృద్ధిని నమోదు చేస్తుందని ఇందుకు ప్రధాన కారణం మెుఖ్యమంత్రి సమన్వయంతో పని చేయడమేనని అన్నారు. దేశ జిడిపిలో మన రాష్ట్రం ఐదు శాతం వాటాతో బలమైన గ్రోత్ ఇంజన్ గా నిలుస్తుందని మన ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరియైన దిశలో సాగుతున్నాయి అనడానికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే దిశగా బడ్జెట్ రూపొందించడం అభినందనీయమని వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్లో పెద్దపీట వేశారని దీనితో వారి సంక్షేమానికి మరింత సంక్షేమ కార్యక్రమాలు అందే అవకాశం ఉందని తెలిపారు.



## స్నేహితుడితో కలిసి కెసిఆర్ ఈద్ వేడుకలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** రంజాన్ పర్వదినం సం దర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో వారి చిన్ననాటి స్నేహితుడు, మర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జుబేర్ మహమ్మద్‌లతో కలిసి కెసిఆర్ ఈద్ సెలబ్రేట్ చేసుకున్నారు. వారు తమ కుటుంబసభ్యులతో కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధినేత వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## రేపు అసెంబ్లీ ముట్టడిలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలి

### కాంగ్రెస్ ప్రభుత్వంలో అడుగడుగునా అవినీతి

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసం చేస్తూ, అవినీతికి పాల్పడుతూ, హిందూ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ మండిపడ్డారు. శనివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తూళ్ల వీరేందర్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసం చేస్తూ, అవినీతి మరియు నిర్వీర్యమైన పాలనతో తెలంగాణను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ప్రజా సమస్యలను సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇక ప్రజల ముందే నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సారథ్యంలో అసెంబ్లీ ముట్టడి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యత వహించేలా చేస్తామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, నిరుపేదలు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యలతో మార్చి 23న జరిగే అసెంబ్లీ ముట్టడిలో పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ సర్కారును నేరుగా ప్రశ్నించాలని కోరుతున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలా ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తేనే మార్పు సాధ్యమని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా ప్రజల పక్షాన పనిచేసేలా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలిపోయిన పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఏ విషయంపై మాట్లాడినా డబ్బులు లేవు అనే సమాధానమే వినిపిస్తుందన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణను ఈ దుస్థితికి తీసుకువచ్చాయన్నారు. బడ్జెట్‌లోనైనా ప్రజలకు ఉపయోగపడే చర్యలు తీసుకుంటారని ఆశించినా, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ అసెంబ్లీ ముట్టడిలో తెలంగాణలోని నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు వస్తాయని ఆనే ఆశతో ఎన్నాళ్లుగానో ఎదురుచూసి చివరకు నిరాశ చెందిన ప్రతి నిరుద్యోగి ముందుకు రావాలన్నారు. మార్చి 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నేరుగా ప్రశ్నించే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## బాసర త్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

### ఇప్పటికీ ల్యాప్‌టాప్‌లు అందించకపోవడం దారుణం

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** బాసరలో కొనసాగుతున్న త్రిపుల్ ఐటీ రాజీవ్‌గాంధీ యూని వర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జి యుకెటి) విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యార్థులు డిమాండ్ చేస్తున్న 12 సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. త్రిపుల్ ఐటీ మెయిన్ గేట్ వద్ద విద్యార్థుల శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంకేతమని, ఇలాంటి ఉద్యమాలను అణచి వేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. అకాడమిక్ ఇయర్ ముగియబోతున్నప్పటికీ ఇప్పటికీ వరకు ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించకపోవడం దారుణ మన్నారు. ల్యాప్‌టాప్‌లు లేకుండా సాంకేతిక విద్య ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. యూనివర్సిటీలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్లే విద్యార్థిని తేజస్విని మరణిం చిందని ఆరోపించారు. పదివేల మందికి పైగా విద్యార్థులు ఉన్న క్యాంపస్‌లో కేవలం కొద్దిమంది వైద్య సిబ్బంది మాత్రమే ఉండటం అత్యంత దారుణమన్నారు. ఎంబిబిఎస్ డాక్టర్లను నియమించి 24 గంటలు వైద్య సేవలు అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వీసీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని తేజస్విని మృతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు.

# జనగణనలో బిసి కులగణన చేపట్టాలి

### రేపు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బిసిల మహాధర్నా : జాజుల

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న జాతి జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, తెలంగాణ రాష్ట్రంలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇదే ప్రధాన డిమాండ్‌తో మార్చి 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బిసిల మహాధర్నా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన 20 బీసీ సంఘాలు, 30బీసీ కుల సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛలో ఢిల్లీ మహాధర్నా వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దా లుగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని బీసీల ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి గత ఏడాది ఏప్రిల్ 30న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జాతి జన గణనలో సమగ్ర కులగణ చేపడతామని ప్రకటించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాము ప్రకటించినట్లు గానే వచ్చే నెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా జాతి జనగణన చేపడుతుందని, అందులో గెజిట్ ద్వారా ఇందులో 33 ప్రశ్నలను రూపొందిం చిన్నారు. ఇందులో ఎస్సీ ఎస్టీ కుటుంబాలు ఎన్ని అడిగిన కేంద్ర ప్రభుత్వం బీసీ కుటుంబాల సంఖ్యను విస్మరించడం బాధాకరమన్నారు. ఇండ్ల లెక్కింపులో కూడా బీసీ ఇండ్లను లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బీసీల 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఈ బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఆదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే ధర్నాకు 29 రాష్ట్రాల నుండి బీసీ సంఘాల నేతలు కదిలిరానున్నారని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల జేఏసీ నేతలు కుం దారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యామ్ కురుమ, ప్రొఫెసర్ సంఘాని మల్లేశ్వర్, కోల జనార్దన్, కాటేపల్లి వీరస్వామి, వర్ల హానుమాన్లు తదితరులు పాల్గొన్నారు.




బిసి సంఘాల జెఎసి సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

# విద్యా శాఖకు బడ్జెట్‌లో అన్యాయం

### తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దగ్ధం

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యాశాఖకు అన్యాయం జరిగిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మండి పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యాశాఖకు బడ్జెట్‌లో నిధులేవీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్య దర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లా డుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ ఉన్న బడ్జెట్‌లో ఎన్నికల హామీ ప్రకారం నిధులు కేటాయించలేదని, ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. రూ. 3,24,234 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా విద్యారంగానికి కేవలం రూ. 26,674 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఇది బడ్జెట్‌లో కేవలం 8.22 శాతం నిధులు మాత్రమేనన్నారు. ఈ నిధులతో రూ. 9వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం, పబ్లిక్ స్కూల్స్ నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గత బడ్జెట్ కంటే కేవలం 1.18 శాతం నిధులు పెంచారు అంటే గత ఏడాది కంటే రూ. 3566కోట్లు మాత్రమే పెంచారని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసే లేదని, ఇచ్చిన మాట మేరకు ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1000కోట్లు ఇచ్చారు తప్ప బడ్జెట్‌లో అన్ని యూనివర్సిటీలకు అరకొర నిధులు కేటాయిం చారన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మెట్టల చైతన్య యాదవ్, ఓయూ అధ్యక్షులు ఉప్పల ఉదయ్ కుమార్, నాయకులు సుశాంత్, భాను, అశ్వన్, సిద్దు శివ, సందీప్, సత్తిబాబు పాల్గొన్నారు.

# కెసిఆర్ తెచ్చిన కాళేశ్వరం జలాలతోనే రూ. 300 కోట్లతో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రారంభం



సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ విడుదల చేస్తున్న హరీశ్‌రావు

### శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్‌రెడ్డిది

### రద్దు చేసిన రూ.1,070 కోట్ల పనులు పునరుద్ధరించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట నియోజకవర్గంలో రూ. 1070 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే సిఎం రేవంత్‌రెడ్డి రద్దు చేయడంతో పనుల్లో మధ్యలోనే నిలిచి పోయాయని వాటి రద్దు చేసిన నిధులను మంజూరు చేసి పనులను పునరు ద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న సిద్ది పేటకు వస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బహి రంగ లేఖ విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గానికి ఒక్కసిద్దిపేట నియోజకవర్గానికి ఒక్క పని కూడా చేయకపోగా, బీఆర్ఎస్ పాల యాంలో మంజూరైన ప నులు మాత్రం రద్దు చేసిం దన్నారు. నియోజక వర్గం లో నిలిచిపోయిన పనులు సిఎం రేవంత్‌రెడ్డిని వెక్కిరిస్తు న్నాయన్నారు. సిద్దిపేటలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించబోతున్న పనులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తి చేసినవేనని తెలిపారు. నర్సెటలో 62 ఎకరాలలో రూ.300 కోట్లతో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని బీఆర్ఎస్ హయాంలో కెసిఆర్ ఆశీస్సులతో నిర్మించడం జరిగిందన్నారు. ఆయిల్‌పాం నిర్మాణంలో శ్రమ ఫలితం మాది... నీదేమో శిలా ఫలకమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించి పూర్తిచేసిన పనులను ప్రారంభించడానికి సిఎం కత్తెర పట్టుకొని తిరుగుతున్నాడని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పాం ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణమన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అంటూ మాట్లాడిన నీ చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభించడం శోచనీయమన్నారు. అభివృద్ధి పనుల ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు, పామాయిల్ తోటల సాగులో మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్య మని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వానిదే కొండంత పాత్ర అన్నారు. నిలిచిపోయిన గొప్ప ఘన కార్యం చేశానని చెప్పడానికి సిద్దిపేటకు వస్తున్నావా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండు భూపేష్, మారెడ్డి రవీం దర్‌రెడ్డి కూర మాణిక్యరెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

# 29న ట్రైనీ సూపర్‌వైజర్ల రాత పరీక్షలు: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో 198 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీల పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 29న రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబరు 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను ఈ నెల 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఒకవేళ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తితే ఈమెయిల్ చేయాలని లేదా పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య 9391005006 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్‌ను సాధ్యమైనంత వరకు ఏ4 సైజు పేపర్‌కు ఇరువైపులా (సింగిల్ షీట్ వచ్చేలా) ప్రింట్ తీసుకోవాలని, దానిపై దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన పాస్‌పోర్ట్ సైజు ఫోటోను కేటాయించిన చోట మాత్రమే అతికించాలని బోర్డు స్పష్టం చేసింది. ఫోటో సరిగ్గా లేకున్నా లేదా అతికించకపోయినా పరీక్షకు అనుమతించబోమని, ఎటువంటి ఫిజికల్ హాల్‌టిక్కెట్లు పోస్టు ద్వారా పంపబడవని పేర్కొంది. పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతించబోమని, పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులను బయటకు వెళ్లనివ్వబోమని హెచ్చరించింది. అభ్యర్థులు తమ వెంట కేవలం బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, ఫోటో అతికించిన హాల్‌టిక్కెట్ మాత్రమే తీసుకురావాలని, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, పర్సులు వంటివి నిషేధితమని వెల్లడించింది. పరీక్షా కేంద్రాల్లో వస్తువులను భద్రపరచడానికి ఎటువంటి క్లోక్ రూమ్ సౌకర్యం ఉండదని, అభ్యర్థులు ముఖ్యంగా మహిళలు ఆభరణాలు ధరించి రావద్దని సూచించింది.పరీక్షా సమయంలో అభ్యర్థుల వేలిముద్రలు, డిజిటల్ ఫోటో (బయోమెట్రిక్) సేకరిస్తారని, కావున చేతులకు మెహందీ, టాటూలు వంటివి లేకుండా చూసుకోవాలని బోర్డు కోరింది. ఓఎంఆర్ షీట్‌పై ఎటువంటి అనవసర గుర్తులు, మతపరమైన చిహ్నాలు రాయకూడదని, అడిగిన వివరాలను మాత్రమే జాగ్రత్తగా పూరించాలని సూచించింది. పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థులు తమ ప్రశ్నపత్రం బుక్‌లెట్‌ను వెంట తీసుకువెళ్లవచ్చని, అయితే ఓఎంఆర్ షీటును తప్పనిసరిగా ఇన్విజిలేటర్‌కు అందజేయాలని పేర్కొంది. ఏదైనా ప్రశ్నపై సందేహం లేదా అస్పష్టత ఉంటే ఆ ప్రశ్నలోని ఇంగ్లీష్ వెర్షన్‌నే ప్రామాణికంగా తీసుకుంటామని బోర్డు వివరించింది. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్‌ను నియామక ప్రక్రియ ముగిసే వరకు భద్రంగా ఉంచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ వి.వి శ్రీనివాసరావు హెచ్చరించారు.



### రంజాన్ వేళ కుటుంబసమేతంగా

## కెసిఆర్‌ను కలిసిన మహమూద్‌అలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి21:** రంజాన్ పండుగ సందర్భంగా మాజీ హోంమంత్రి మహమూద్ అలీ కుటుంబసమేతంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావును కలిశారు. మహమూద్ అలీ కుటుంబసభ్యులందరూ కెసిఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మహమూద్ అలీకి, ఆయన కుటుంబసభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.కెసిఆర్‌ను కలిసిన సందర్భంగా మహమూద్ అలీ కుటుంబసభ్యులు ఆయన ముని మనుమడిని కూడా తీసుకొచ్చారు. దాంతో మహమూద్ అలీ మునిమనుమడిని కేసీఆర్ ప్రత్యేకంగా ఆశీర్వదించారు.

**మహమూద్ అలీ ఇంట్లో రంజాన్ వేడుకలు.. హాజరైన కెటిఆర్**

కాగా అంతకు ముందు మహమూద్ అలీ నివాసంలో రంజాన్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. మహమూద్ అలీకి కేటీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



# వాణిజ్య సిలిండర్ల సరఫరా 20% పెంపు

### కేంద్ర పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు సమాచారం

**న్యూఢిల్లీ, మార్చి 21:** వాణిజ్య సిలిండర్ల సరఫరాపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను 20 శాతం పెంచినట్లు తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సమాచారం ఇచ్చింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి గృహ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో పేర్కొన్న కేంద్రం, ఇప్పుడు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, క్యాంటీన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలు, క్యాంటీన్లు మూతపడటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వలస కూలీలకు ఉచితంగా 5 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎల్లుండి నుంచి వాటిని సరఫరా చేస్తామని ప్రకటించింది. సిలిండర్ల బ్లాక్‌మార్కెటింగ్‌చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయినా కూడా బ్లాక్‌మార్కెట్‌లో సిలిండర్లధరలు యథేచ్ఛగా పెరుగుతుండటంతో అదనపు సరఫరానుపెంచుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. వాణిజ్యసిలిండర్లసరఫరా తగ్గడంతో హోటళ్లు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు ఇతరత్రా అన్ని రంగాలపైనా తీవ్రస్థాయి ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఈ కొరతను కట్టడిచేసేందుకే కేంద్రం ఆయిల్‌మార్కెటింగ్‌కంపెనీలను ఎప్పటికప్పుడు నివేదికలు కోరుతూ నిల్వలు పర్యవేక్షిస్తోంది.

## జార్ఖండ్‌లో బయటపడిన రెండో ప్రపంచయుద్ధం నాటి బాంబు

**రాంచి, మార్చి 21:** ఝార్ఖండ్ రాష్ట్రంలోని తూర్పు సింగ్‌భమ్ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. సువర్ణరేఖ నదీ తీరంలో ఇసుక తవ్వకాల సమయంలో రెండో ప్రపంచ యుద్ధం నాటి భారీ బాంబు ఒకటి బయటపడింది. దీంతో స్థానికుల్లో తీవ్ర భయాం దోళనలు నెలకొనగా, దానిని నిర్వీర్యం చేసేం దుకు పోలీసులు సైన్యం సహాయాన్ని కోరారు. బహరాగోడా పోలీస్ స్టేషన్ పరిధిలోని పాని పాడానాగుడ్‌సాయి ప్రాంతంలో ఇసుక తవ్వ కాలు జరుపుతుండగా గ్యాస్ సిలిండర్ ఆకారం లో ఉన్న ఈ బాంబును గుర్తించారు. దీనిపై ఎఎయ్- ఎం 64500 ఐబి, అమెరి కన్‌మేడ్ అని రాసి ఉండటంతో ఇది అమెరికా తయారీదని పోలీసులు భావిస్తున్నారు. సుమారు 227 కిలోల బరువున్న ఈ బాంబు రెండో ప్రపంచ యుద్ధం నాటిదని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రజలు ఎవరూ దాని దగ్గరకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశారు. రాంచీ నుంచి వచ్చిన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ దీనిని పరిశీలించి, ఇది ఇంకా యాక్టివ్‌గా ఉందని నిర్ధారించింది. ఇంత భారీ, పాతతరం బాంబును నిర్వీర్యం చేసే నైపుణ్యం తమకు లేదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, తూర్పు సింగ్‌భమ్ ఎస్పీ (రూరల్) రిషవ్ గార్గ్ సైన్యంలోని బాంబ్ డిస్పోజల్ విభాగానికి అధికారికంగా లేఖ రాశారు. పశ్చిమ బెంగాల్‌లోని కలైకుండా వైమానిక దళ స్థావరం సహాయాన్ని కూడా కోరారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసి, సైనిక బృందం కోసం ఎదురుచూస్తున్నారు.



# అమెరికా, ఇజ్రాయెల్ దళాల దాడులు ముమ్మరం

### ఇరాక్ ఎంబసీపై ఇరాన్ దాడులు
### జెరూసలెంలోని అల్‌అక్సా మసీదు సమీపంలో పేలుడు
### సైనికచర్య ముగింపు దిశగా ఆలోచిస్తున్నాం : ట్రంప్

**టెహ్రాన్, జెరూసలెం, వాషింగ్టన్, మార్చి 21:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్‌ల దాడులు రోజురోజుకూ మరింత ఉధృతం అవుతున్నాయి. ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధికేంద్రంపై మళ్లీ దాడులు జరిగాయి.శనివారం జరిగిన ఈ దాడుల్లో కేంద్రం ధ్వంసంచేసినట్లు అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రకటిస్తున్నా అణుశుద్ధి వ్యవస్థకు ఎలాంటి ఆటంకం లేదని ఇరాన్ ప్రకటిం చకుంది. ఇదిలా ఉంటే ఇరాన్ ప్రయోగించిన క్షిపణి ఇజ్రాయెల్‌లోని అల్ అక్సా మసీదు సమీపంలో పడం విధ్వంసం సృష్టించింది. దీనితో రంజాన్‌రోజున బాంబుదాడులపై సర్వత్రా కలవరం వ్యక్తం అయింది. తొలిసారిగా ఈ మసీదును ప్రార్థనలకోసం మూసివేసారు. అలాగే ఇజ్రాయెల్, అమెరికాల ఎయిర్‌బేస్‌లనే లక్ష్యంగాచేసుకుని ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. డిగోగార్షియాలోని అమెరికా స్థావరంపై సుదూర శ్రేణి క్షిపణలును ప్రయోగించింది. అయితే రెండు క్షిపణుల్లో ఒకటి నిర్వీర్యం చేసామని, మరోటి లక్ష్యం చేరలేదని అమెరికా ప్రకటిస్తోంది. అలాగే యుద్ధంలో ఇప్పటివరకూ 16 యుద్ధవిమానాలను కూల్చివేసామని ఇరాన్ చెపుతుంటే ఇరాన్‌లో ఆయుధశక్తి నిర్వీర్యం అయిపోయిందని అమెరికా ట్రంప్ పేర్కొనడం ఉద్రిక్తతలకు ఆజ్యంపోసినట్లయింది. 4500 కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగోగార్షియా స్థావరంపైకి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడంతో అమెరికాసైతం నివ్వెరపోయింది. యుద్ధం కొనసాగుతున్నా ఇరాన్ ఆయుధశక్తి పెంచుకుంటున్నట్లు అమెరికా



గుర్తించింది. అలాగే ఇరాన్‌సైతం కువైట్, ఇరాక్‌లలోని అమెరికా ఎంబసీలపై విస్తృత దాడులుచేసింది. ఇరాక్ దౌత్యకార్యాలయంపై వెల్లువలా ర్యాకెట్లనుప్రయోగించి వణుకు పుట్టించింది.

**హార్ముజ్ జలసంధిని పునరుద్ధరించండి: 22 దేశాల విజ్ఞప్తి**

ఇదిలా ఉంటే హార్ముజ్ జలసంధిని పునరుద్ధరించి చమురు, గ్యాస్‌రవాణను సులభతరంచేయాలని ఇరాన్‌కు 22 దేశాలు సంయుక్తంగా విజ్ఞప్తిచేసాయి. మరోవైపు ట్రంప్ జలసంధి సమీపంలోని స్థావరాలపై బాంబులతో దాడులు కురిపిస్తుంటే ఇతర గల్ఫ్, ఆసియా, యూరోప్ దేశాలు జలసంధిని పునరుద్ధరించి నౌకల రాకపోకలను భద్రతాపూర్వకంగా పంపించాలనికోరాయి. అయితే ఇరాన్ మాత్రం జలసంధిమీదుగా వెళుతున్న నౌకలనుంచి సర్‌ఛార్జి వసూలుచేస్తోందన్న విమర్శలు ఎదురయ్యాయి. మిలియన్ డాలర్ల ఫీజుగా చెల్లించాలని ఇరాన్ డిమాండ్‌చేస్తోందన్న ఆరోపణలున్నాయి.

**యుద్ధం ముగింపు యోచనలో ట్రంప్**

ఇదిలా ఉంటే యుద్ధంముగింపు దశకు వచ్చిందని ముందునుంచి చెపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇపుడుయుద్ధం ముగించేయోచనలో ఉన్నారు. ఇరాన్‌పై సైనికచర్యను ముగించే అంశంపైనే ఆలోచిస్తున్నామన్నారు. ఆ దేశ క్షిపణి సామర్థ్యాలు,వైమానిక నావికా వ్యవస్థలు పూర్తిగా ధ్వంసంచేసామని మరోసారి అణ్వాయుధాలు తయారు చేయకుండా అమెరికా నిఘా వేస్తుందని ప్రకటించారు.

ఇదిలా ఉంటే సైనికచర్యను క్రమేపీ తగ్గించేదిశగా ఉన్నామని, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని ట్రంప్ ట్రూత్ సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. అయితేట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా వ్యతిరే కించింది. కాల్పుల విరమణ ఒప్పందానికి తావులేదని, పూర్తిస్థాయిలోయుద్ధానికి పాల్పడిన తర్వాత ఇరాన్‌కు ఇపుడుప్రధాన శత్రువులు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు మాత్రమేనని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌సైతం వెల్లడించారు. ఇప్పటివరకూ ఈరెండుదేశాలు జరిపిన దాడుల్లో 21వేలమంది ఇరానీయులు గాయపడ్డారని ఆదేశ ఆరోగ్యశాఖ వెల్లడించింది.

# రాష్ట్రంలో ఘనంగా రంజాన్ వేడుకలు

### ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్న కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** తెలంగాణ రాష్ట్రంలో రంజాన్ శోభ కనిపించింది. ఈ రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు రాష్ట్రంలో మసీదులు, దర్గాలు,ఈద్గాలలో ముస్లీంలతో కిటకిటలాడాయి. ముస్లీం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. హైదరాబాద్‌లోని చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేశారు. పాతబస్తీలోని రద్దీని దృష్టిలో పెట్టుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ముస్లీం సోదరులు ప్రత్యేక ఈద్ ప్రార్థనలు చేశారు. మీరాలం ట్యాంక్ వద్ద కూడా ముస్లీం సోదరులు ప్రార్థనలు చేశారు. రంజాన్ వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన పలు ప్రార్థనల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. మట్టేవాడ, ఎల్బీ నగర్, ఖిలా వరంగల్ ప్రాంతాల ఈద్గాల్లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మికతతో పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. 20వ తేదీన ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల అభివృద్ధికి రూ.3,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని,ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని గుర్తు చేశారు..దీంతో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడిందని వివరించారు.ఈ సందర్భంగా తమ నియోజకవర్గం వ్యాప్తంగా ఈద్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులను కేటాయించినట్లు వివరించారు..మట్టేవాడ ఈద్గా, ఖిలా వరంగల్ ఈద్గా లకు అభివృద్ధికి చెరొక రూ.1 కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని,అలాగే ఎల్బీనగర్ ఈద్గా అభివృద్ధికి రూ.60 లక్షల రూపాయిలు, చింతల్ ఈద్గా అభివృద్ధికి రూ.40 లక్షలు రూపాయలను మంజూరు చేసినట్లు తెలిపారు..ముస్లిం సోదరుల సంక్షేమార్థం 400 కుట్టు మిషన్ యంత్రాలను పంపిణీ చేయడంతో పాటు, రంజాన్ తోఫా కింద 3,500 కిట్లను చేశామన్నారు..రంజాన్ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు.

# ప్రేమికురాలు మరొకరిని పెళ్లాడిందని కత్తితో దాడి

### తండ్రి, స్నేహితుడితో కలిసి దాడి చేసిన యువకుడు


**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మార్చి 21 ప్రభాతవార్త:** తాను ఇష్టపడిన మహిళ తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని కక్ష పెంచుకున్న ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. తండ్రి, స్నేహితుడితో కలిసి మహిళ ఇంటికి వెళ్లిన యువకుడు కత్తితో మహిళపై దాడి చేసి గాయపర్చాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన నూకరత్నం(25) గతకొన్ని రోజులుగా మియాపూర్ పరిధిలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటుంది. నూకరత్నంకు గతంలో పెళ్లి జరుగగా, కొన్నేళ్ల క్రితం భర్తకు కోల్పోయింది. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి నగరానికి వచ్చి మియాపూర్‌లో ఉంటూ స్థానికంగా హౌజ్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. కాగా నూకరత్నం పనిచేస్తున్న వద్దే అలీషా అలియాస్ పాండు అనే యువకుడు సైతం వంటమనిషిగా పనిచేస్తున్నాడు. పాండు నూకరత్నంను చూసి ఇష్టపడి, పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

మరోవైపు నూకరత్నంకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు ఒకరికి ఒకరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. కాగా నూకరత న్నంను ఇష్టపడుతున్న పాండు వీరి పెళ్లిని జీర్ణించుకోలేకపోయాడు. ఈనెల 19వ తేదీన పాండు తన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లారు. పాండు నూకరత్నంను ఇష్టపడుతున్నట్లు చెప్పి తనతో రమ్మని అడిగాడు. అందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన పాండు తనవెంట తెచ్చుకున్న కత్తితో నూకరత్నం మీద దాడి చేశాడు. పాండు దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం నూకరత్నం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయమై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నూకరత్నం మీద దాడి చేసిన పాండుతో పాటు అతని తండ్రి లాలూను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఆ పరిస్థితే వస్తే భారత్‌పై అణుబాంబులు వేస్తాం

### పాకిస్థాన్ మాజీ హైకమిషనర్ అబ్దుల్ బాసిత్

**కరాచి, మార్చి 21:** భారత్, పాకిస్థాన్‌లు రెండూ అణ్వాయుధాలు కలిగిన దేశాలు. అణ్వాయుధాలు కలిగి ఉన్నప్పటికీ భారత్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుండగా పాకిస్థాన్ సైన్యం, దాని ఉన్నతాధికారులు మాత్రం రెచ్చిపోతున్నారు. మధ్యప్రాచ్య సంఘర్షణల నేపథ్యంలో తాజాగా పాకిస్థాన్ మాజీ హైకమిషనర్ అబ్దుల్ బాసిత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ అమెరికా పాకిస్థాన్‌పై అణు దాడి చేస్తే.. పాకిస్థాన్ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటుందన్నాడు. 2014 నుంచి 2017 వరకు న్యూఢిల్లీలో ఇస్లామాబాద్ అగ్రశ్రేణి దౌత్యవేత్తగా పనిచేసిన బసిత్ సాధ్యం కాని విషయం గురించి ప్రస్తావించాడు. ఒకవేళ ఇరాన్ పరిస్థితి విషమించి, ఇజ్రాయెల్, అమెరికా మన అణ్వాయుధ



సామర్థ్యాన్ని నాశనం చేయాలని చూస్తే పాకిస్థాన్ భారత్‌పై దాడి చేస్తుందన్నాడు.

అమెరికా లేదా ఇజ్రాయెల్‌పై నేరుగా దాడి చేసే అవకాశం లేకపోతే, తాము ఏమాత్రం వెనుకాడకుండా ముంబై, న్యూఢిల్లీ వంటి నగరాలపై విరుచుకుపడతామని హెచ్చరించారు.ఆ తర్వాత జరిగే పరిణామాలను అప్పుడు చూసుకోవచ్చని పిచ్చి కూతలు కూశాడు. ఇలాంటి పరిస్థితి వస్తే మాత్రం భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడమే తమ ముందున్న ఆప్షన్ అని బాసిత్ పేర్కొన్నాడు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య ఘర్షణ మరింత ఉద్రిక్త దశలోకి ప్రవేశించిన తరుణంలో బాసిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. గత మూడు వారాలుగా, సైనిక దాడులు, ప్రతిదాడులు పలు రంగాలలో విస్తరించాయి. ఇజ్రాయెల్ టెహ్రాన్, బీరుట్‌లోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు, అమెరికా బలగాలు ఆ ప్రాంతంలో వ్యూహాత్మక కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాయి.

# ఆరు డిస్కమ్‌లకు ఎ+ రేటింగ్

### అగ్రస్థానంలో ఢిల్లీ పంపిణీ సంస్థలు
### తెలంగాణ, అంధ్రప్రదేశ్‌లకు ఎ-గ్రేడ్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ర్యాంకింగ్‌లో పలు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్) పనితీరు మెరుగుపడింది. చాలా వరకు డిస్కంలు ఎ నుండి బి+ గ్రేడ్‌లలో ఉండగా, అత్యల్ప కేటగిరీలో ఏదీ లేదు. ఇది మెరుగైన విశ్వసనీయత, డిజిటల్ స్వీకరణ, వినియోగదారుల సేవా కార్యకలాపాల మెరుగుదలను కనపరిచాయి. కేంద్ర విద్యుత్, ఆర్‌ఈసీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కామ్స్ (సీఎస్ఆర్డీ) 2024-25 నివేదిక ప్రకారం, దేశంలోని విద్యుత్ సరఫరా వినియోగదారుల సేవల పంపిణీల మెరుగుదలను కనబరచడంతో డిస్కంలు ఉన్నత పనితీరు గ్రేడ్‌లను సాధించాయి. కార్యాచరణ విశ్వసనీయత (45 మార్కులు) కనెక్షన్లు, ఇతర సేవలు (10 మార్కులు), మీటరింగ్, బిల్లింగ్, వసూళ్లు (35 మార్కులు), లోపాల సవరణ, ఫిర్యాదుల పరిష్కారం (10 మార్కులు) గా నిర్ణయించి వాటిలో వచ్చిన మొత్తం మార్కులను ఆధారంగా చేసుకుని గ్రేడ్ లను ఇచ్చింది. వీటిలో ఆరు విద్యుత్ పంపిణీ సంస్థలు అగ్రస్థానంలో ఉండగా, ఇందులో మూడు ఢిల్లీకి చెందిన విద్యుత్ పంపిణీ సంస్థలే ఉన్నాయి. మిగిలిన మూడు డిస్కంలలో మహారాష్ట్రకు చెందిన రెండు, ఉత్తరప్రదేశ్‌కు సంబంధించిన ఒకటి ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని మూడు సంస్థలైన సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ, ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్, సౌత్ పవర్ డిస్ట్రిబ్యూషన్, అలాగే తెలంగాణలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఎ గ్రేడ్ సాధించాయి. కాగా గత మూడేళ్లుగా దేశంలోని డిస్కామ్ పనితీరులో స్థిరమైన మెరుగుదల కనిపిస్తోందని ఈ నివేదిక స్పష్టం చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక రేటింగ్ బ్యాండ్‌లలో (ఎ+, ఎ, బి+) ఉన్న యుటిలిటీల సంఖ్య దాదాపు రెట్టింపు కాగా, తక్కువ కేటగిరీలలోని డిస్కామ్‌ల వాటా క్రమంగా తగ్గుద చోటు చేసుకుంది. కేంద్రం పేర్కొన్న 76 డిస్కామ్‌లలో పాల్గొనకపోవడం లేదా తగినంత డేటా సమర్పించకపోవడం వల్ల 10 డిస్కామ్‌లను మినహాయించి 66 యుటిలిటీలను అధికారులు మూల్యాంకనం చేశారు. ఈ 66 డిస్కామ్‌లు కలిసి దేశవ్యాప్తంగా సుమారు 34.5 కోట్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. వీటిలో ఆరు డిస్కామ్‌లు అత్యున్నతమైన ఎ+ గ్రేడ్‌ను సాధించగా, ఏదీ కూడా అత్యల్ప కేటగిరీ అయిన డి లోకి రాలేదు. గణనీయమైన సంఖ్యలో అంటే 27 డిస్కామ్‌లు బి+ రేటింగ్‌ను పొందాయి. ఇది సగటు పనితీరును సూచిస్తుంది. మొత్తం మీద, 58 డిస్కామ్‌లు, అంటే దాదాపు 88 శాతం, ఎ, బి+, బి కేటగిరీల పరిధిలోకి వచ్చాయి. ఇది మధ్యస్థం నుండి అధిక పనితీరు గల శ్రేణులలో బలమైన కేంద్రీకరణను ప్రతిబింబిస్తోంది. జాతీయ సగటు స్కోరు 100 కి గాను 76.97గా ఉండగా, 29 యుటిలిటీలు ఈ బెంచ్‌మార్క్ కంటే మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయి.

ప్రైవేట్ డిస్కామ్‌లు సాపేక్షంగా మెరుగైన పనితీరును కనబరిచాయి, వాటిలో ఏదీ బి+ కంటే తక్కువ స్కోరు సాధించలేదు. దీనికి విరుద్ధంగా, చాలా ప్రభుత్వ రంగ డిస్కామ్‌లు ఆమోదయోగ్యమైన శ్రేణులలో పనితీరు కనబరిచినప్పటికీ, కొద్ది సంఖ్యలో సి+, సి వంటి తక్కువ కేటగిరీలలో ఉంచబడ్డాయి.

# ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి

### విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం తగదు
### టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కొద్దిమంది ధనవంతుల కోసం విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం కాకుండా.. రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం శనివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో చావ రవి అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో యుకె పాఠశాలల ఏర్పాటు కోసం ఆయా యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపి ఆహ్వానించడం పట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ విస్మయం వ్యక్తం చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ పాఠశాలలను ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాల్సి న బాధ్యతను విస్మరించి, కొందరికే నాణ్యమైన విద్యను పరిమితం చేయాలనే ఆలోచన సరికాదన్నారు. గత ప్రభుత్వం కొన్ని వందల గురుకులాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసిందని.. ఈ ప్రభుత్వం కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అనే ఆకర్షణీయమైన పేర్లతో ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్యను కొందరికే పరిమితం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కెజి తరగతులు ప్రారంభించాలని, పర్యవేక్షణ అధికారుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిఒ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండాలని, 50 మంది విద్యార్థులు మించిన పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. పిఆర్సీ రిపోర్టు విడుదల చేసి 1.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలు, పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలన్నారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జెఎసి ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని లేని పక్షంలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వతంత్ర పోరాటం చేస్తామని తెలిపారు. ఈ నెల 29న జోగులాంబ జిల్లా గద్వాల జిల్లా ఆలంపూర్‌లో జరిగే టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు సత్యానంద్, రాజు, రంజిత్ కుమార్, రవిప్రసాద్ గౌడ్, మల్లారెడ్డి, రవి కుమార్, శ్రీధర్, సింహాచలం, జ్ఞానమంజరి, వెంకటప్ప, వెంకటేశం, సోమయ్య, విశాలి, యాకయ్య, కొండలరావు పాల్గొన్నారు.

# పత్తి చేనులో పసికందు..

## రక్షించిన పోలీసులు - బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగింత


బాలల సంరక్షణ అధికారులకు అప్పగిస్తున్న రూరల్ సిఐ కుమారస్వామి, ఎస్సై కళ్యాణ్

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 21, ప్రభాతవార్త :** మనసును ముక్కలు చేసే ఘటన... మానవత్వాన్ని గుర్తు చేసిన స్పందన.. కాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ గ్రామ పంచాయతీ పరిధి సీతానగర్ శివారులో శనివారం చోటుచేసుకుంది. పత్తి చేనులో గుడ్డలో చుట్టి పడేసిన పసికందును గుర్తించిన గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తల్లి ఒడిలో ఉండాల్సిన ఆ పసికందు, ఆకలితో అలమటిస్తూ గుక్కపట్టి ఏడుస్తుండటం అక్కడి వారిని కన్నీళ్లు పెట్టించింది. పసిబిడ్డ కేకలు విన్న ఓ మహిళ దగ్గరకు వెళ్లి చూసినప్పుడు గుడ్డలు చుట్టబడి ఉన్న శిశువు కనిపించడంతో ఆమె ఆందోళనకు గురైంది. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చి ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలియజేశారు. గ్రామస్తుల అప్రమత్తతతో క్షణాల్లో స్పందించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శిశువును సురక్షితంగా బయటకు తీశారు. వల్లకొండ సర్పంచ్, స్థానికులతో కలిసి శిశువును వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, ఈస్గాం ఎస్సై కళ్యాణ్ బాలల సంరక్షణ శాఖ అధికారులకు అప్పగించారు. పసికందును అక్కడ వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటన సమాజాన్ని ఆలోచింపజేస్తుంది. పుట్టిన బిడ్డను ఇలా వదిలేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆర్థిక ఇబ్బందులా? సామాజిక ఒత్తిడులా? లేదా మరేదైనా కారణమా? ఏ కారణం అయినా పసిబిడ్డను ఇలా నిరాధారంగా వదిలేయడం మానవత్వానికి విరుద్ధమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## స్టాఫ్ నర్స్ ఉద్యోగాల పేరుతో మోసం..

# రూ.1.85 కోట్ల వసూలు.. నిందితుడు రఘురాం అరెస్ట్..



**.సూర్యాపేట బ్యూరో, మార్చి 21 (ప్రభాత వార్త) :** స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.1.85 కోట్లు వసూలు చేసిన మోసగాడిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట జిల్లా,మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన దుగ్యాల రఘురాం ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, గౌరవ సూర్యాపేట 1వ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రఘురాం తాను క్రీడా ఈవెంట్లు నిర్వహిస్తానని, పెద్ద పెద్ద నాయకులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి బాధితులతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. అనంతరం హైదరాబాద్ లోని హెల్త్ డిపార్ట్ మెంట్ లో పని చేస్తున్న వాణి అనే మహిళ సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడు. సూర్యాపేట జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు మేరకు, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తుండగా, ఆమెను సూర్యాపేటకు బదిలీ చేయిస్తామని చెప్పి రఘురాం రూ.20 లక్షలు వసూలు చేశాడు. ఆమె ద్వారా మరికొంతమందికి పరిచయం ఏర్పరచుకుని, నకిలీ నియామక పత్రాలు చూపిస్తూ సుమారు 60 మంది నుంచి సుమారు రూ. 2 కోట్లు వరకు డబ్బులు దండుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు కాగా, ప్రధాన నిందితుడు రఘురాంను అతని స్వగ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి నకిలీ జాబ్ సర్టిఫికెట్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మోసపూరితంగా వసూలు చేసిన డబ్బుతో రూ.30 లక్షల విలువైన ప్లాట్, మరో రూ.30 లక్షల విలువైన కారు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. మరో నిందితురాలు వాణి పరారీలో ఉండగా, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# బడ్జెట్‌ను సవరించాల్సిందే.. లేకుంటే ఉద్యమాలే:

## సిపిఐ రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్‌లు హరగోపాల్, కోదండరాం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఆర్థిక విశ్లేషకుడు పాపారావు తదితరులు

**చిక్కడపల్లి మార్చి 21 ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు నిధుల కేటాయింపును పెంచాలని, బడ్జెట్‌ను సవరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని సీపీఎం హెచ్చరించింది. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీ ఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యారంగానికి 15 శాతం కేటాయిస్తామని చెప్పి, కేవలం 8 శాతం మాత్రమే కేటాయించడంపై వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ (24 ), కేరళ (23 ) వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో కేటాయింపులు చాలా తక్కువని ప్రొఫెసర్ హరగోపాల్ ఎత్తిచూపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను లాక్కోవడమే కాకుండా, బీజేపీయేతర రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయిస్తూ వివక్ష చూపుతోందని వక్తలు ఆరోపించారు. సెస్సులు, సర్చార్జీల రూపంలో వసూలు చేయడం వల్ల రాష్ట్రాలకు రావాల్సిన వాటా దక్కడం లేదని ఆర్థిక విశ్లేషకులు పాపారావు తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో రూ. 6 లక్షల కోట్ల అప్పు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే రూ. 3.49 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. ఈ ఏడాది మరో రూ. 82 వేల కోట్ల అప్పు చేయబోతున్నారని వివరించారు. పేదల సంక్షేమం కోసం అతి సంపన్నులపై అదనంగా పన్నులు వేయాలని, స్వీడన్ వంటి దేశాల్లో ధనికులపై 60 శాతం వరకు పన్నులు ఉంటాయని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకు నిర్దిష్ట నిధులు లేవని, ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన రూ. 5 వేల కోట్లు ఏమాత్రం సరిపోవని జాన్ వెస్లీ ప్రశ్నించారు. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, దళిత సంక్షేమానికి నిధులు తగ్గించడాన్ని తప్పుబట్టారు.కేంద్రం నుంచి వచ్చే వాటాలో కేవలం 42 శాతం మాత్రమే తిరిగి వస్తోందని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సమావేశం పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నేతలు డి.జి. నర్సింహారావు, సారంపల్లి మల్లారెడ్డి, టి. సాగర్, అరుణజ్యోతి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్న ఆధునిక యుద్ధాలు

**డెహ్రాడూన్, మార్చి 21:** ఆధునిక యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను, సైబర్ స్పేస్‌ను దెబ్బతీస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రస్తుత రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని వ్యాఖ్యానించారు. యుద్ధాలు సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహారభద్రతలో భాగమయ్యాయని పేర్కొన్నారు. ఈ యుద్ధాల ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో ప్రతి దేశపౌరుడు అన్ని సమయాల్లో దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు. ఆధునిక యుద్ధాలకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సాయుధ దళాలకు ఆధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశ రక్షణలో యువత తనవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ యువత దేశం కోసం ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్యం, పౌరులు బలంగా ఉంటేనే దేశం ముందుకు సాగుతుందని అన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.

## పశుసంవర్ధక రంగానికి ఊరట ఎపి మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం, మార్చి 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపే తం చేస్తూ పశుపోషకులు, చిన్న రైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చే నిర్ణయం తీసుకు న్నామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. పురపాలక పరిపాలన పట్టణా భివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు,

గొర్రెలు/ మేకల పెంపకం కేంద్రాలు,పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్ చార్జీలు,డెవలప్‌మెంట్ చార్జీల నుండి పూర్తిగా మినహా యింపు మంజూరు చేయబడిందని తెలిపారు.



# కొండగట్టు అంజన్న సేవలో కేంద్ర మంత్రి బండి సంజయ్

**మల్యాల ప్రభాతవార్త** కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్ నగర కార్పొరేషన్ మేయర్, పలువురు కార్పొరేటర్లతో కలిసి శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా కొండగట్టు ఆలయ అర్చకులు, అధికారులు కేంద్రమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, బండి సంజయ్ అంజన్న ఆలయం చుట్టూ ప్రదక్షి ణలు చేశారు, ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రి సంజయ్ ఇటీవల చేపట్టిన కొండగట్టుకు అంజన్న ఆశీర్వాద యాత్ర సక్సెస్ చేసుకోగా, అంజన్న ఆలయానికి వచ్చేసరికి రాత్రి సమయం మించిపోయి ఆలయం మూసి ఉండడంతో అంజన్న ఆలయ రాజ గోపురం వద్దనే టెంకాయ కొట్టి స్వామివారిని తలుచుకొని వెళ్లిపోయిన కేంద్రమంత్రి త్వరలోనే స్వామివారిని దర్శించుకుంటామని అప్పుడు పేర్కొన్నారు, దీంతో మంత్రి సంజయ్ నూతనంగా ఎన్నికైన మేయర్ కార్పొరేటర్లు బిజెపి శ్రేణులతో కలిసి కొండగట్టుకు వచ్చి శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి అనంతరం శాలువాతో సత్కరించి స్వామివారి ఆశీర్వచనాలను అందజేశారు, కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, బోయినపల్లి ప్రవీణ్ రావు బండ రమణారెడ్డి, బిజెపి అధ్యక్షులు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు, నాయకులు బొట్ల ప్రసాద్, మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి, పొన్నగంటి రమేష్, కొల్లూరి గంగాధర్, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు .

## టిటిడి ఆలయాలు

# ఆధ్యాత్మిక కేంద్రాలు

### తిరుమలలో భక్తుల సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షించాలి

### అత్యాధునిక సిసి కెమెరాలు, ముఖగుర్తింపు వ్యవస్థను మెరుగుపరచాలి

### ఎఐ ద్వారా మరిన్ని మెరుగైన చర్యలు: తిరుమలలో ఎపి సిఎం చంద్రబాబు


శనివారం శ్రీవారిఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సిఎం చంద్రబాబు దంపతులు

**తిరుమల,మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని చెప్పారు.శనివారం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో నడుస్తున్న కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ముఖగుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్తులో సప్తగిరులపై కాలుష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని, మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదానం పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్లుగా శిక్షణనిచ్చి, వారి సేవలను టిటిడి పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.టిటిడిలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మరింత మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్మెంట్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అంతకుముందు కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలపై అధికా రులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి, వనరులను సమర్థవంతంగా వినియోగించే విధంగా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. లడ్డూల తయారీ, విక్రయాలు, నిల్వ వంటి అంశాలను కూడా సమగ్రంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పా రు. పలువురు ఎన్ఆర్ఐ దాతల సహకారంతో కార్యా ఫౌండేషన్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను అమెరికా లోని దాత వేజేండ్ల జయప్రసాద్ వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి అనగాని సత్యప్రసాద్ , చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ , టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, తిరుపతి ఎస్పీలంకెల సుబ్బ రాయుడు, సివిఎస్ఒ కె. విమురళీ కృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విజిలెన్స్,ఐటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

# అరసవల్లి క్షేత్రానికి మహర్దశ

- రూ.4 కోట్లతో పుష్కరిణి పునరుద్ధరణ
- శంకుస్థాపన చేసిన రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు
- ప్రసాద్ స్కీమ్ ద్వారా రూ.58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంతోనే ఆధ్యాత్మిక వైభవం: కేంద్ర మంత్రి



**అరసవల్లి (శ్రీకాకుళం జిల్లా), మార్చి 21 ప్రభాతవార్త:** ప్రపంచ దేశాల నుంచి భక్తులు తరలివస్తున్న ప్రసిద్ధ అరసవల్లి క్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం ద్వారా రూ.58 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. రూ.58 కోట్లతో మెగా మాస్టర్ ప్లాన్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అరసవల్లి క్షేత్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఇప్పటికే పుష్కరిణి పనులకు రూ.4 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం కింద మరో రూ.58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వంటశాల, భోజనశాల, భక్తుల కోసం వసతి గృహాలు, విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అరసవల్లి రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నాటి నుంచి భక్తుల తాకిడి గణనీయంగా పెరిగిందని, దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని మంత్రులు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విశాలమైన రహదారులు, సెంటర్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక హబ్‌లుగా మార్చడమే లక్ష్యమని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి కూటమి హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన జిల్లా ముద్దుబిడ్డ, అమరవీరుడు చింతాడ మోహనరావు సాహసాన్ని స్మరించుకునేలా ఈ పార్కు ను తీర్చిదిద్దడం గర్వకారణమని, వినోదం కోసం వైజాగ్ వెళ్లాల్సిన పని లేకుండా జిల్లా కేంద్రంలోనే అద్భుతమైన వసతులు కల్పించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఏపీహెచ్‌బీ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో సుడా ఆధ్వర్యంలో నిర్మించిన 'కార్గిల్ విక్టరీ పార్కు'ను ఆయన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు పార్కులోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, స్వయంగా బ్యాట్ పట్టి బాక్స్ క్రికెట్, పికిల్ బాల్ ఆడి సందడి చేశారు. యుద్ధంలో గాయపడిన హవిల్దార్ చిన్ని సింహాచలం, హవిల్దార్ టొంప నీలాచలం సహా ఆ పోరులో పాల్గొన్న జిల్లాకు చెందిన 58 మంది యోధుల చరిత్రను నేటి తరం తెలుసుకునేలా పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషమని, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీలు ఈ ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడ్డారని మంత్రి కొనియాడారు.కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ఇది పూర్తిస్థాయిలో 'యూజర్ ఫ్రెండ్లీ' పార్కని, ఇందులో ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ స్క్రీన్, సోలార్ దీపాలు, స్ప్రింక్లర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. పార్కులోకి ప్రవేశం ఉచితం కాగా, క్రీడా కోర్టులను వినియోగించుకునే వారి నుంచి వసూలు చేసే స్వల్ప ఛార్జీలతోనే పార్కు నిర్వహణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అభివృద్ధికి ఈ పార్కు ఒక 'ట్రయల్ రన్' మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ అభివృద్ధి పనులు చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోరికాన రవికుమార్, ఇంజనీర్ సుగుణాకర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశ్రామిక రంగంలో ఎపి ముందడుగు

- ఫలితాలను ఇస్తోన్న 21 నెలల కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు - అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్

- నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు శంకుస్థాపన - కేంద్ర మంత్రులతో కలిసి 23న ఎపి సిఎం చంద్రబాబు భూమిపూజ

- రూ.1,35,964 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) సంస్థ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పడానికి సిద్ధమైంది. దీనికి ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు.

రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 5,465 ఎకరాల్లో మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి చేయనుంది.

**క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు**

స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 50 మి.మె.ట సామర్థ్యంతో అదనంగా 316 ఎకరాల్లో క్యాప్టివ్ పోర్టును కూడా ఏఎంఎన్ఎస్ ఇండియా ఏర్పాటు చేయనుంది. దీని కోసం ప్రత్యేకంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో మరో 6,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిశ్రమల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో భారీగా పెరిగిన ఉక్కు మార్కెట్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఏఎంఎన్ఎస్ ఇండియాకు లభించనుంది.

**అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం**

ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌హెచ్16తో కలిపేలా 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. కనెక్టివిటీ పెంచడంతో పాటు పరిశ్రమకు అవసరమయ్యే నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు..**

సోమవారం జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా హాజరవుతారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ,

మానవ వనరుల అభి వృద్ధి శాఖ మంత్రి లోకేష్ ముఖ్యఅతిధులుగా పాల్గొంటా రు.

ఇంకా ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేష్ విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ ్మ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ భూమి పూజలో పాల్గొంటారు.

సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు.

మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్ సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరిస్తారు. అలాగే

అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# గుడ్డు రుచులు

గుడ్డు పొరటో, ఆమ్లెట్టో చేసేస్తాం. దోశ పిండి సిద్ధంగా లేదంటే హాఫ్ బాయిల్డ్ ఎగ్‌తోనో, బాంబే టోస్ట్‌తోనో ముగించేస్తాం. గుడ్డుతో వంటలూ సులువే, పోషకాలూ ఎక్కువే!

## స్టఫ్డ్ ఎగ్ బాల్స్



**కావలసినవి :** గుడ్లు-4, శనగపిండి-కప్పు, బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మిరియాల పొడి-చెంచా చొప్పున, ఉప్పు-కొద్దిగా, కారం-2 చెంచాలు, పసుపు -పావు చెంచా, మిర్చి-3, వెల్లుల్లి రెబ్బలు-4, అల్లం అంగుళం ముక్క, బంగాళదుంపలు-2, ఉల్లిపాయ-1, బ్రెడ్‌పొడి-అర కప్పు, నూనె - తగినంత. **తయారీ :** గుడ్లను ఉడికించి పక్కనుంచుకోవాలి. బంగాళదుంపలు ఉడికించి, మెత్తగా మెదపాలి. ఒక పాత్రలో శనగపిండి, బియ్యపిండి, మొక్కజొన్న పిండి, కారం, ఉప్పు, పసుపు, మిరియాల పొడి, అల్లం, మిర్చి, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయ ముక్కలు, మెదిపిన బంగాళదుంపలు, బ్రెడ్ పొడి వేసి బాగా కలపాలి. గుడ్డును సగానికి కోసం, ఈ మిశ్రమంలో ముంచి బాల్‌లా చేసి నూనెలో వేయించాలి. అంతే రుచికరమైన 'స్టఫ్ట్ ఎగ్ బాల్స్' సిద్ధం.



## ఎగ్ ఛాట్

**కావల్సినవి :** ఉడికించిన గుడ్లు- నాలుగు, తరిగిన టొమాటోలు-రెండు, ఉల్లిపాయ-ఒకటి(సన్నగాతరగాలి), తరిగిన వెల్లుల్లి-చెంచా, పచ్చిమిరపకాయలు-నాలుగు (సన్నగా తరగాలి), పుదీనా, కొత్తిమీర తరుగు-కొద్దిగా, ఉప్పు-తగినంత, కారం-చెంచా, పసుపు-చిటికెడు, ఛాట్ మసాలా-చెంచా, పోపు దినుసులు-చెంచా, కరివేపాకు-రెండు రెమ్మలు, నూనె-మూడు పెద్ద చెంచాలు.

**తయారీ :** ఓ గిన్నెలో ఉడికించిన గుడ్లలోని పచ్చభాగాలను తీసుకుని పొడిలా చేసి పెట్టుకోవాలి. మరో గిన్నెలో తెల్లభాగాన్ని కాస్త పెద్ద ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టుకోవాలి. ఇందులో నూనె వేసి వేడయ్యాక పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇందులోనే జీలకర్ర, ఆవాలు, కరివేపాకు, టొమాటో ముక్కలు వేసి వేయించాలి. ఇది వేగుతున్నప్పుడే కారం, ఉప్పు,పసుపు, ఛాట్ మసాలా వేసి బాగా కలపాలి. కాసిన్ని నీళ్ల పోసి ఉడికించాలి. నీళ్లన్నీ ఇగిరిపోయాక పుదీనా తురుము



## క్లాసిక్ ఆమ్లెట్

**కావలసినవి :** గుడ్లు-4, బచ్చలికూర తరుగు-కప్పు, ఉల్లిపాయ-2, పచ్చిమిర్చి-2, వెల్లుల్లి కాడలు-2, చీజ్-100 గ్రా, నిమ్మరసం- చెంచా, ఆలివ్ నూనె-3 చెంచాలు, ఉప్పు-తగినంత, మిరియాపొడి -చెంచా, వెన్న-2 చెంచాలు. **తయారీ :** వెల్లుల్లి కాడలను కడిగి సన్నగా తరిగి ఉంచాలి. గుడ్లు పగలకొట్టి.. అందులో ఉప్పు, మిరియాల పొడి, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు, బచ్చలికూర తరుగు, నిమ్మరసం వేసి బీట్ చేయాలి. నాన్ స్టిక్ ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. గుడ్డు మిశ్రమం వేసి సమంగా పరచుకునేట్లు సర్దాలి. మూత పెట్టి నాలుగు నిమిషాలు వదిలేయాలి. మూత తీసి.. చీజ్ తురుము, వెన్న, మిరియాల పొడి వేసి సన్న సెగ మీద ఒక నిమిషం ఉంచి దించేస్తే సరిపోతుంది. రొటీన్‌కు భిన్నమైన క్లాసిక్‌ఆమ్లెట్ అండ్ గ్రీన్స్ వహ్వా అనిపిస్తుంది.

## బెల్ పెప్పర్ ఎగ్స్

**కావలసినవి :** ఎరుపు, ఆకుపచ్చ, పసుపునపచ్చ బెల్ పెప్పర్స్-ఒక్కోటీ రెండు చొప్పున, మిరియాల పొడి - టేబుల్ స్పూన్, చీజ్-100 గ్రా, ఉప్పు -తగినంత, ఉల్లి కాడల తరుగు - అర కప్పు, గుడ్లు-6, చిల్లీ ఫ్లేక్స్-చెంచా, సన్న కారప్పూస-రెండు చెంచాలు.

**తయారీ :** బెల్ పెప్పర్స్ సగానికి కోసి, తొడిమలు, గింజలు తీసేయాలి. కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి చిలకరించినట్లు వేసి అవెన్‌లో బేక్ చేయాలి. బయటకు తీసి తురిమిన చీజ్, ఉల్లి కాడల తరుగు కొన్ని చిల్లీ ఫ్లేక్స్, కాస్త మిరియాల పొడి, ఉప్పు, గుడ్డు సొన వేసి.. మరోసారి బేక్ చేయాలి. తినేటప్పుడు ఇంకాస్త మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్ సన్న కారప్పూస వేస్తే అమోఘంగా ఉంటాయి. □



# మంచి 'ఆర్టిస్ట్'గా బేబి షామిలి..




షామిలీ... ఈ పేరుని దక్షిణాదిన ఎవరు విన్నా... 'బేబి షామిలీ' అనేస్తారు. పసితనం దాటి, పెరిగి పెద్దయినా, హీరోయిన్‌గా మారినా ఇప్పటికీ అదే ఆమె పేరు. అంతలా బాలనటిగా అందరి మనసుల్లో ముద్ర వేసిన ఆమె... ఇప్పుడు వేరే రంగంలోనూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

'అంజలి'.. ఈ సినిమా, నాలుగేళ్ల వయసులో మానసిక స్థితి సరిగాలేని చిన్నారిగా షామిలీ నటనని ఎవరూ మర్చిపోలేరు కాబట్టి, అంతచిన్న వయసులోనే జాతీయ అవార్డులు అందుకున్నారు. నిజానికి ఆమె నటనా జీవితం పూర్తిగా రెండేళ్లు కూడా రాకముందే. షామిలీ పుట్టిపెరిగింది చెన్నైలో తల్లిదండ్రులు అలిస్, బాబు, నటన మీద ఆసక్తితో ఆమె తండ్రి మద్రాసికి మారారు. కానీ ఆ కల నెరవేరక పిల్లలను ఆ వైపుగా ప్రోత్సహిం చారు. అలా అక్క షాలినీతో పాటు సినిమాల్లోకి అడుగు పెట్టారు షామిలీ బాలనటిగా దక్షిణాదిన అన్ని భాషల్లో, స్టార్ హీరోలతో నటిం చారు. ఒకరకంగా బాలనటిగా దక్షిణాదిన ఆధిపత్యం ప్రదర్శించారు. అప్పట్లో ఎక్కువ సంపాదన ఉన్న అమ్మాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రీయ అవార్డులు సహా ఎన్నో పురస్కా రాలు అందుకున్నారు. దాదాపు 70 సినిమాల్లో బాలనటిగా నటించిన షామిలీ తరవాత వాటిని పక్కన పెట్టేశారు. స్కూలు, కాలేజీల్లో నటించడానికి అనుమతి ఇవ్వలేదు అంటారామె. కాబట్టే, చదువ య్యాక దాదాపు 12 ఏళ్ల తరవాత తిరిగి సినిమాల్లోకి అడుగుపెట్టారు. తెలుగు, తమిళ, మలయాళ అవకాశాలు వచ్చాయి. 'ఓయ్'కి 'బెస్ట్ ఫిల్మ్ డెబ్యూ' అవార్డుని అందుకున్నారు. అయితే అందరినీ ఆశ్చర్య పరిచిన విషయం... ఆమె ఆర్ట్స్ వైపు వెళ్లడం. నటనంటే ఇష్టమే. కానీ దానికే పరిమితం అవ్వాలని నేనెప్పుడూ అనుకోలేదు. డ్యాన్స్ ఇష్టం నేర్చుకున్నా, పర్యటనలంటే. నచ్చిన ప్రాంతాలు చుట్టేదాన్ని. నేను విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేశా. ఆపై సింగపూర్‌లో ఫిల్మ్ ప్రొడక్షన్‌లో డిప్లొమా చేస్తున్న ప్పుడు ఆర్ట్ వైపునకి మనసు మళ్లింది అనే షామిలీ... పారిస్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందింది. చైనీస్ ఇంక్ పెయింటింగ్. ఇటలీలోని అకడమియా రియాచి ఇన్ ఫ్లోరెన్స్ నుంచి గ్లాస్ పెయింటింగ్, డిజిటల్ ఆర్ట్స్ వంటివీ నేర్చుకున్నారు. ప్రముఖ ఆర్టిస్ట్ ఏవీ ఇలాంగో ఆమెకు మెంటార్. సినిమాలు చేస్తూనే ఆర్టీని కొనసాగించాలి. ఖాళీ దొరికినా క్యారవ్యాన్‌లో కూర్చున్న బొమ్మలు గీసేదాన్ని. చాలామంది 'ఇప్పుడు ఆర్ట్ ఎందుకు? తరవాత ఎప్పుడైనా ప్రయత్నించొచ్చుగా' అనేవారు. నేను మాత్రం వదలలేదు. కొన్ని సినిమాలు వదులుకున్నా. కొన్ని సినిమాలు వదులుకున్నా. మధ్యలో కొన్ని చేసినా... మళ్లీ ఆర్ట్స్ వైపే వెళ్లాను. ఒక్కసారి ప్యాషనే మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. అందుకు నేనే ఉదాహరణ. మా ఇంట్లో ఆర్టిస్టులు ఎవరూ లేరు అయినా ఆర్ట్ని చూడగానే ప్రేమలో పడిపోయా. చుట్టూ ఉన్న ప్రతి నాలో స్ఫూర్తిని రగులుస్తుంది అంటారు షామిలీ. వంటివాటికి ఆమె చిత్రాలలో ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. తన చిత్రాలతో ఎగ్జిబిషన్లనీ ఏర్పాటుచేశారు. 2023లో 'షీ' పేరుతో చెన్నైలో సోలో ఎగ్జిబిషన్ జరిగింది. ఆపై వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన వరల్డ్ ఆర్ట్ దుబాయ్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్‌లోనూ కొనసాగుతుంది. 'పవర్ బైనరీ' పేరుతో బెంగళూరులో మరో షో చేశారు. ఆర్టిస్ట్ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇంకా ఎన్నో దేశాల్లో ఎగ్జిబిషన్లు నిర్వహించడం ఆమె కల ఆట భవిష్యత్తులో సినిమాలు నిర్మించే ఆలోచనలోనూ ఉన్నారట. మొత్తానికి ఒకప్పటి బుల్లిస్టార్... నేడు పెద్ద ఆర్టిస్ట్ దూసుకెళ్తున్నారన్నమాట. □

# దేవుడే మనకు ముందు నడుస్తాడు..



'ఇదిగో నా దూత నీకు ముందుగా వెళ్లను (నిర్గమ 32:34). 'నా దూత నీకుముందుగా వెళ్లచు..' (నిర్గమ 23:23), 'నా సన్నిధి నీకు తోడుగా వచ్చును, నేను నీకు విశ్రాంతి కలుగజేసెదననగా' (నిర్గమ 33:14). దేవుడిని వెంబడించేవారికి తప్పనిసరిగా ఆయన తోడు మనకు ఉండడమే మన భాగ్యం. సరే దేవుడి దూత లేదా దేవుడే మనకు ఎప్పుడు తోడుగా ఉంటాడు? మనం దేవుడి చిత్తానుసారంగా, ఆయన ఆజ్ఞల్ని పాటిస్తూ, వినయవిధేయతతో జీవించినప్పుడే దేవుడు మనకు తోడుగా ఉంటాడు. మనతో ఉంటూ, మన ప్రతి అక్కర్లు తీరుస్తూ, మనపక్షాన పోరాడుతాడు. మనుషులుగా మనం అన్నివేళలా దేవుడికి విధేయతగా ఉండలేం. ఎదో ఒక సమయంలో ఒక బలహీనత పరిస్థితిలో అవిధేయంగా ప్రవర్తిస్తాం, దేవుడిని బాధపెడతాం. ఇలాంటప్పుడు దేవుడు మనల్ని విడిచిపెట్టడు కానీ, బాధపడతాడు. దేవుడు మోషేకు తోడై ఉన్నాడు. మోషే అన్నివిషయాల్లో దేవుడికి విధేయుడిగా జీవించాడు. అందుకే అతడికి తోడుగా ఉండడమే కాదు, తన దూతను మోషే, ఇశ్రాయేలు ముందుగా నడిపించాడు. ఏదిఏమైనా మనం కూడా అన్నివిషయాల్లో దేవుడికి విధేయతగా, ఆయన చిత్తానికి లోబడి జీవించేందుకు ప్రయత్నిద్దాం. మోషేకు తోడై ఉన్నదేవుడు మనకు కూడా తోడై ఉంటాడు. ఆయన సన్నిధి మనకు నిత్యం తోడుగా ఉంటుంది. అవిధేయతతో ప్రవర్తించినప్పుడు వెంటనే దేవుడిని క్షమించమని వేడుకుందాం. అప్పుడు దేవుడు మనతో పాటు నడుస్తాడు.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# షాంపూలో ఇవి కలిపితే !



షాంపూను నేరుగా కాకుండా కొన్ని నీళ్లలో కలుపుకొని తలస్నానం చేయడం మనకు తెలిసిందే. అయితే నీటితో పాటు కొన్ని పదార్థాలను షాంపూలో కలుపుకొని తలస్నానం చేయవచ్చని నిపుణులు. ఫలితంగా జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుందం టున్నారు. రోజ్‌వాటర్‌లో షాంపూను కలిపి తలస్నానం చేస్తే కుదుళ్లలో దురద, అలర్జీ.. మొదలైన వాటి నుంచి ఉపశమనం లభిస్తుందట. అంతేకాదు.. జుట్టు మెత్తగా, పట్టుకుచ్చులా మెరుస్తుందంటున్నారు నిపుణులు.



1. రోజ్‌మేరీ, లావెండర్, పెప్పర్మెంట్, టీట్రీ నూనెల్లో ఏదైనా ఒకదాన్ని షాంపూలో కాస్త కలిపి చూడండి. ఇలా చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గి మరింత ఒత్తుగా పెరిగే అవకాశం. ఉందంటున్నారు నిపుణులు. 2. షాంపూలో నిమ్మరసం కలిపి తలస్నానం చేస్తే వెంట్రుకలు నిగనిగలాడుతూ పట్టుకుచ్చులా మెరుస్తాయట.
3.షాంపూలో కాస్త తేనె కలిపితే జుట్టు పొడిబారకుండా తేమను సంతరించుకుంటుంది. తేనె కుదుళ్లను ఆరోగ్యంగా మారుస్తున్న నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినా చర్మతత్వానికి సరిపడతాయో లేదో ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.. □

# పింక్ కాఫీ ప్రయోజనాలెన్నో !

'కొంచెం కాఫీ తాగితే ఎంత హాయిగా ఉంటుందో..!' కాఫీ ప్రియులు తరచూ చెప్పే మాట ఇది. మూడ్ని ఉల్లాసంగా మార్చేస్తే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అంతేనా కాఫీ తాగేవారు ఎక్కువకాలం జీవిస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి. కాఫీల్లో చాలా రకాలుగా కనిపించే ఈసారి పింక్ కాఫీని పోషకాహార నిపుణులు. ఇంట్లో ఉండే ఐరన్, ఫోలెట్లు మహిళల్లో అనిమియాని తగ్గిస్తుందట. నెలసరి సమయంలో అలసటను మాయం చేసి తక్షణ శక్తినిచ్చే కాఫీతోపాటు, ఇందులోని యాంత్రిక ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. దీన్ని



తాగడం వల్ల డోపమైన్ ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని తయారీ కోసం ఒక టీస్పూన్ బీట్రూట్ పొడిని వేడినీటిలో కలిపి చిక్కని డికాక్షన్ సిద్ధం చేసుకోవాలి. తరువాత దానిలో అరటీస్పూన్ కాఫీ పొడి, వేడి లేదా చల్లని పాలు రుచికి సరిపడా తేనె లేదా బెల్లం కలుపుకోవాలి. అంతే పింక్ కాఫీ రెడీ. అయితే గర్భిణులు మాత్రం దీన్ని కూడా మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు. □

# 'లవ్‌వాలా' మూవీ గ్రాండ్‌గా లాంచ్




రవీంద్ర తేజ్ హీరోగా SVAN ఎంటర్‌టైన్‌మెంట్ శుభకరి ఇన్‌ఫ్రా మీడియా బ్యానర్స్ పై సురేష్ వర్మ, సాయి రామ్ నిర్మిస్తున్న చిత్రం'లవ్‌వాలా. బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ కొరటాల శివ, బుచ్చిబాబు సానా వద్ద అసోషియేట్ గా పని చేసిన రంజిత్ కుమార్ దేశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రంలో అరియా మోడీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈరోజు పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా లాంచ్ చేశారు. డైరెక్టర్ కొరటాల శివ ముహుర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కొరటాల శివ, బుచ్చిబాబు సానా మేకర్స్ కు స్క్రిప్ట్ అందజేశారు. పలువురు సినీ ప్రముఖులు, మూవీ యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో రాజ్ అర్జున్, మణి చందన, కమల్, నవీన్ నేని, నాగ మహేష్, రష్మీ గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జమ్మూ శ్రీను డీవోపీ, తూము రాము ఎడిటర్, ఆర్ట్ డైరెక్టర్ బేబీ సురేశ్ భీమగాని. మూవీ ఓపెనింగ్ ప్రెస్ మీట్ లో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసి మమల్ని బ్లెస్ చేసిన బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ కొరటాల శివ గారికి, బుచ్చిబాబు సానా గారికి ధన్యవాదాలు. సినిమా అంటే పాషన్‌తో నిర్మాణం రంగంలోకి అడుగుపెడుతున్నాం. రంజిత్ చెప్పిన కథ మాకు చాలా నచ్చింది. ఇది చాలా మంచి లవ్ స్టోరీ. రవి హీరోగా నటిస్తున్నారు. అరియ మోడీని హీరోయిన్ గా పరిచయం చేస్తున్నాం. ఫస్ట్ షెడ్యూల్ తర్వాత మరిన్ని వివరాలు తెలియజేస్తాం.

# 'ది ట్రైటర్స్' హోస్ట్‌గా హీరో తేజ సజ్జా



యంగ్ హీరో తేజ సజ్జా ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త దిశగా అడుగు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన రియాలిటీ ఫార్మాట్"ది ట్రైటర్స్" తెలుగు వెర్షన్‌కు ఆయన హోస్ట్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రైమ్ వీడియో ఇండియా ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో అధికారికంగా ప్రకటించింది. ఇటీవల వరుస సినిమాలతో సక్సెస్ సాధిస్తూ ప్రేక్షకుల్లో అద్భుతమైన క్రేజ్ తెచ్చుకున్న తేజ సజ్జ, ఇప్పుడు సినిమాలతో పాటు కొత్త ఫార్మాట్స్ వైపు కూడా దృష్టి పెట్టుతున్నారు. ది ట్రైటర్స్ తెలుగు ద్వారా ఆయన ప్రేక్షకులకు మరింత దగ్గరవ్వబోతున్నారు. ఈ రియాలిటీ షో ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేక కాన్సెప్ట్‌తో పెద్ద హిట్ అయ్యింది. అదే థ్రిల్, టెన్షన్ తెలుగు వెర్షన్‌లో కూడా ఉండబోతోంది. ఈ షోలో తేజ సజ్జ ఒక కొత్త అవతార్ లో కనిపించబోతున్నారు. హోస్ట్‌గా ఆయన స్టైల్, ఎనర్జీ ఈ షోకు మరింత ప్రత్యేకత తీసుకురానుంది. ఇప్పటికే సక్సెస్ ఫుల్ యంగ్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజసజ్జా, ఇప్పుడు మల్టీ ప్లాట్‌ఫామ్ ఎంటర్టైనర్‌గా మారే దిశగా ముందుకు వెళ్తున్నారు.

తెర

# 'దేత్తడి' గ్లింప్స్ 24న రిలీజ్



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం దేత్తడి. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఆశిష్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా గ్లింప్స్ మార్చి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన గ్లింప్స్ పోస్టర్‌లో బ్లాక్, రెడ్ షేడ్స్‌తో రా ఎనర్జీ కనిపిస్తోంది. హీరో వెనుక నుంచి కనిపిస్తూ ఫైర్ బ్రీతింగ్ యాక్ట్ చేస్తున్న విజువల్ ఆసక్తిని పెంచుతోంది. 'దేత్తడి' సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. మెయిన్ స్ట్రీమ్‌లో ఎక్కువగా చూడని అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు.

# 'హ్యాపీ రాజ్' ఫన్ ట్రైలర్ లాంచ్




స్టార్ కంపోజర్ హీరో జివి ప్రకాష్ కుమార్ అప్ కమింగ్ మూవీ 'హ్యాపీ రాజ్'. హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ద నిర్మించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జీవి ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. వెంకీ గారు, శివగారు ఈ వేడుకకు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. జీవి గారి మ్యూజిక్ కంటే నాకు చాలా ఇష్టం. ఫైనల్‌గా ఇరుముడి సినిమాకి ఆయనతో వర్క్ చేయడంకుదిరింది. మ్యూజిక్ వర్క్ అంత అద్భుతంగా జరుగుతోంది. తనని మ్యూజిక్ డైరెక్టర్‌గా కలిసి ఇప్పుడు హీరోగా తన ఈవెంట్ కి రావడం చాలా సర్ప్రైజింగ్‌గా ఉంది. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమా ట్రైలర్ చూస్తే చాలా హ్యాపీగా అనిపించింది. టైటిల్ లో ఉండే హ్యాపీనెస్ ప్రేక్షకులు కూడా రావాలని కోరుకుంటు న్నాను. మైత్రి మూవీ మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా చూశాం. చాలా మంచి ఎంటర్టైన్మెంట్‌తో పాటుగొప్ప మెసేజ్ ఉంటుంది. మూవీ డైరెక్టర్ మరియా రాజా మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ముందుగా నవీన్ పోలిశెట్టి గారికి థాంక్యూ చెప్తున్నాను. .

# మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా 'బ్యాండ్ మేళం' ట్రైలర్ 26న రిలీజ్



మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు. హీరో హర్ష్ రోషన్ తన మరదలైన హీరోయిన్ ప్రేమను గెలవటానికి ఏం చేశాడు? తనకు ఎదురైన ఇబ్బందులేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అనే అంశాలతో బ్యాండ్ మేళం సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. బ్యాండ్ మేళం సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదలైన టీజర్, సాంగ్స్, తాజాగా ట్రైలర్‌తో సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. శివరాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ అందించారు. శివ ముప్పరాజు స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహించారు. మార్చి 26న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

# 'పిఠాపురంలో అలా మొదలైంది' ట్రైలర్ లాంచ్



డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు,ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర రూపొందించిన చిత్రం'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. .హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రేయసి రావే కంటే ముందు నేను చేసిన కొన్ని చిత్రాలు సరిగ్గా ఆడలేదు. చంద్ర మహేష్ గారు నాతో తీసిన 'ప్రేయసి రావే' అద్భుతమైన విజయం సాధించింది. అందులో పృథ్వీ, శివాజీ రాజా అద్భుతంగా నటించారు. శివాజీ రాజా మాట్లాడుతూ.. ప్రేయసి రావే గురించి ఇప్పుడు మాట్లాడుతుండటం ఆనందంగా ఉంది. ఆ మూవీలో శ్రీకాంత్, నా కాంబోకి మంచి పేరు వచ్చింది. శ్రీలేఖగారి సంగీతం ఆ సినిమాకి ఎంతో కలిసి వచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. శ్రీలేఖ మాట్లాడుతూ.. 'మా ప్రేయసిరావే' చిత్రాన్ని తల్చుకుంటే ఎన్నో మెమొరీస్ అలా గుర్తుకు వస్తుంటాయి. హీరో విరాట్ మాట్లాడుతూ.. 'పిఠాపురంలో అల మొదలైంది' మూవీతో నేనెంతో నేర్చుకున్నాను. మహేష్ గారి లాంటిగ్రేట్ దర్శకుడితో పని చేసే అవకాశం రావడం నా అదృష్టం. నిర్మాత దుండిగళ్ళ బాలకృష్ణ మాట్లాడుతూ.. 'పిఠాపురంలో అలా మొదలైంది' అద్భుతంగా వచ్చింది. ఈ మూవీ పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను అని అన్నారు.

ఆట



# ఇది టాలెంట్ కాదు.. టోర్నడో!

*ఐపీఎల్ 2026 ఆరంభానికి ముందే అందరి ఫోకస్ ఆ ఒక్కడి మీదే. అతనేమీ హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ కాదు.పోనీ టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమ్ ప్లేయర్ కూడా కాదు. అయినా అందరి కళ్లు అతనిపైనే. ఆఖరుకు అన్ని జట్ల బౌలర్ల ఫోకస్ కూడా ఆ ఆటగాడిని కట్టడిచేయడం పైనే. అతనే 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే ఈ వండర్‌కిడ్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాడు.*

ఐపిఎల్ సెంటరాఫ్ అట్రాక్షన్ వైభవ్ సూర్యవంశీ

**(వార్త క్రీడా విభాగం) :** అతి చిన్న వయసులోనే కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీకి ఇది రెండో ఐపీఎల్ మాత్రమే.గత ఏడాదే ఐపీఎల్ అరంగేట్రం చేసిన వైభవ్ ఆ సీజన్‌లో ఆడింది ఏడు మ్యాచ్‌లైనా.. మహా మహా బౌలర్లను చితకొట్టాడు. 14 ఏళ్ల 23 రోజుల వయసులో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చి ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందర్నీ సర్‌ప్రైజ్ చేశాడు. అంతేగాక లక్నో సూపర్ జయింట్స్‌పై 20 బంతుల్లోనే 34 రన్స్ చేసి రాత్రికి రాత్రే స్టార్‌గా మారాడు. ఇక 28 ఏప్రిల్‌న గుజరాత్ టైటాన్స్‌పై విధ్వంసమే సృష్టించాడు. 35 బంతుల్లోనే శతకం బాదాడు. క్రిస్ గేల్ తర్వాతి స్థానంలో నిలిచాడు. ఇక ఆ మ్యాచ్‌లో ఏకంగా 11 సిక్స్‌లు బాదాడంటే అతని జోరు ఏ విధంగా సాగిందో తెలుస్తుంది. మొత్తానికి గత ఐపీఎల్‌లో ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీతో సహా 252 రన్స్ చేశాడు. వైభవ్ స్ట్రయిక్ రేట్ 200 పైనే. ఆ ఐపీఎల్‌లో వైభవ్ ఏకంగా 24 సిక్స్‌లు బాదాడు.

**అండర్19 వరల్డ్ కప్‌లో విధ్వంసం :** ఇటీవల జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. ఫైనల్లో ఇంగ్లాండ్‌పై కేవలం 80బంతుల్లో 175పరుగులతో అజేయంగా నిలిచి కప్ అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తూ, భవిష్యత్తు సూపర్ స్టార్‌

## వయసు చిన్నది.. గేమ్ పెద్దది

గా గుర్తింపు పొందాడు.అఫ్ఘనిస్తాన్‌పై 68, పాక్‌పై 30,జింబాబ్వేపై 52, న్యూజిలాండ్‌పై 40, బంగ్లాదేశ్‌పై 72,స్కాట్లాండ్‌పై96,సౌతాఫ్రికాపై 127రన్స్...ఇలా వైభవ్ జోరుకు ఎదురులేకుండా పోయింది.

**సీనియర్ల హెచ్చరిక.. రెండో సీజన్ సవాల్:** మొదటి సీజన్‌లో గుర్తుపట్టని ప్రత్యర్థులు, రెండో సీజన్ నాటికి వైభవవ్ బలహీనతలపై రీసెర్చ్ చేసి వస్తారని మాజీ క్రికెటర్ బాలాజీ తెలిపారు. ఇలాంటి సమయంలో సంగక్కర వంటి దిగ్గజాల మార్గదర్శకత్వం వైభవ్‌కు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. సాంకేతికతతో పాటు మానసిక దృఢత్వం కూడా ఈ సీజన్‌లో వైభవ్‌కు పరీక్షగా మారనుంది.

**క్రిస్ గేల్ రికార్డుపై కన్నేసిన వైభవ్ :**రాయల్స్ ఈసారి వైభవ్‌ను యశస్వి జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా పంపాలని యోచిస్తోంది. జైస్వాల్ పక్కన ఉంటే వైభవ్‌పై ఒత్తిడి తగ్గుతుందన్నది టీమ్ ప్లాన్. వైభవ్ కూడా తన లక్ష్యాలను చాలా స్పష్టంగా పెట్టుకున్నాడు. ఐపీఎల్‌లో క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును బ్రేక్ చేయడమే లక్ష్యమని అతను ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు.

ఈ వండర్ కిడ్ విషయంలో రాయల్స్ యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంది. మీడియా వెలుగులకు, సోషల్ మీడియా హడావుడికి దూరంగా ఉంచింది. 14 ఏళ్లకే వచ్చిన నేమ్, ఫేమ్‌తో వచ్చే ఒత్తిళ్లకు వైభవ్ గురికావద్దనే ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే వైభవ్‌ను అధికారిక ప్రెస్ మీట్లు, ఇంటర్వ్యూలకు దూరంగా ఉంచుతోంది. వైభవ్ ఐపీఎల్‌లో కేవలం ఒక ప్లేయర్ కాదు ఒక ఫినామినన్. అతని



## వచ్చేసిన ఫ్లయింగ్ మ్యాన్

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 19వ సీజన్ కోసం విదేశీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా భారత్ వస్తున్నారు. ఈమధ్యే పొట్టి ప్రపంచకప్‌లో ఇరగదీసిన గ్లెన్ ఫిలిప్స్... గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడేందుకు అహ్మదాబాద్‌లో అడుగుపెట్టాడు. మైదానంలో పక్షిని తలపిస్తూ.. బౌండరీ లైన్ వద్ద డైవింగ్ క్యాచ్‌లతో అలరించే గ్లెన్ ఫిలిప్స్ రాకకు సంకేతంగా గుజరాత్ టైటాన్స్ ప్రత్యేక వీడియో పంచుకుంది. సర్వర్ చేతుల్లోంచి జారి పోతున్న టీ కప్పు.. గోడ మీద నుంచి కింద పడుతున్న గాజు గ్లాసు... ఓ వ్యక్తి చేతుల్లోంచి జారిపోతున్న ఫోన్‌తో వీడియో మొదలవుతుంది. టీ కప్పు, గాజు గ్లాస్, ఫోన్ కిందపడకుండా.. ఫిలిఫ్స్ ఒడుపుగా అందుకుంటాడు. ఈ స్పెషల్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది.

గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన ఫిలిఫ్స్... 19వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.శుభ్‌మన్‌గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటిల్ తొలి పోరులో మార్చి 31న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో పరుగుల వరద పారించిన గ్లేన్ ఫిలిఫ్స్‌పై టైటాన్స్ భారీ ఆశలు పెట్టుకుంది.

2021లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గ్లేన్ ఫిలిఫ్స్ మూడు మ్యాచ్‌ల్లో 26 రన్స్, 2023 ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌ల్లో 39 రన్స్‌తో నిరాశ పరిచాడు. 2025 వేలంలో రెండు కోట్లకు చేజిక్కించుకున్న గుజరాత్ టైటాన్స్ ఈ సారి కూడా గ్లేన్

## వస్తారు... కోట్లు పట్టుకెళ్తారు!

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్ మరో వారం రోజుల్లో మొదలుకానుంది. కానీ ఐపీఎల్‌లో ఈసారి ఆటగాళ్ల గాయాల సమస్యలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వేలంలో కోట్ల ధర పలికిన విదేశీ ఆటగాళ్ల గాయాలు, వ్యక్తిగత కారణాలతో లీగ్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానుండడం ఆయా ఫ్రాంచైజీలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెన్ను గాయం నుంచి కోలుకోకపోవడంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్ఆర్‌హెచ్ నిర్ణయం తీసుకుంది.మరో వైపు డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ స్టార్ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ కూడా గాయంతో దూరమయ్యాడు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు గాయాల బెడద తగిలింది.ఆ జట్టు స్టార్ మిచెల్ స్టార్క్ గాయంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ప్రస్తుతం సౌతాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న ఫెర్గూసన్.. కుటుంబంతో గడిపే కారణంతో మొదటి ఏడు మ్యాచ్‌లు ఆడడం లేదు.

విదేశీ ఆటగాళ్లు ముఖ్యంగా ఆస్ట్రేలియా ప్లేయర్లపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తీవ్ర విమర్శలు చేశాడు. ఏవో సాకులు చెప్పి స్టార్క్‌ను ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడకుండా ఆసీస్ చూస్తోందని మండిపడ్డాడు. టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన స్టార్క్... యాషెస్ తర్వాత రెండు నెలలుగా మ్యాచ్‌లు ఆడలేదని, ఇపుడు గాయం సాకు చూపెట్టడం అన్యాయమన్నాడు. పెర్గ్యూసన్ ఐపీఎల్‌లో ఆడుతూ 7 మ్యాచ్‌ల తర్వాత వచ్చి కోటి తీసుకొని వెళ్లిపోతాడు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనమని నిలదీశాడు.







## సెమీస్‌లో బోల్తా పడ్డ తన్వి, ఇషారాణి

**ఫ్రాన్స్:** ఓర్లియన్స్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ షట్లర్ల సవాల్ ముగిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్ చేరిన ఇద్దరు భారత యువ షట్లర్లు తన్వి శర్మ, ఇషారాణిలకు నిరాశే ఎదురైంది. ఫైనల్ చేరడంలో విఫలమయ్యారు. భారత యువ స్టార్ షట్లర్ తన్వి శర్మ అద్భుత ప్రదర్శన సెమీఫైనల్లోనే ముగిసింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమి ఒకుహారా చేతిలో 9-21, 16-21తో వరుస సెట్లలో ఓటమి పొందింది. తన్వి తప్పిదాలు, ఆటపై నియంత్రణ కోల్పోవడంతో ఒకుహారా అడ్వాంటేజ్‌గా తీసుకుని ఆధిపత్యం చెలాయించింది. ఒకుహారా అనుభవం, వ్యూహాత్మక ఆట ముందు తన్వీ శర్మ నిలువలేకపోయింది. తొలి సెట్‌ను సులువుగా కోల్పఓయింది.రెండో గేమ్‌లో కాస్త పుంజుకున్నప్పటికీ ఒకుహారాపై నిలకడను కొనసాగించలేకపోయింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అయిన 17 ఏళ్ల ఈ భారత క్రీడాకారిణి... మ్యాచ్ పొడవునా తన స్మాష్‌లను నియంత్రించుకోలేక ఇబ్బంది పడింది. 2016 ఒలింపిక్ కాంస్య పతక విజేత, 2017 ప్రపంచ ఛాంపియన్ అయిన 31 ఏళ్ల ఒకుహారా... మ్యాచ్‌ను 35 నిమిషాల్లో ముగించి ఫైనల్ చేరింది.

మరో మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఇషారాణి పోరాడి ఓడింది. 55 నిమిషాల పాటు జరిగిన రెండో సెమీస్‌లో ఇషారాణిపై థాయిలాండ్‌కు చెందిన పిట్చామన్ 21-12, 23-21తో గెలుపొంది ఫైనల్ చేరింది. తొలి సెట్‌ను సులువుగా కోల్పోయిన ఇషారాణి.. రెండో సెట్‌లో పుంజుకుంది.ఆరంభం నుంచే ఆధిక్యం చాటింది. ఓ దశలో 12-8తో లీడ్ పొందింది. ఆ తర్వాత నుంచి ఇరువురూ ప్రతిపాయింట్ కోసం హోరాహోరీగా తలపడ్డారు. 15-15, 18-18 ఇలా టైబ్రేకర్‌వరకు సాగింది. 21-20తో ఆధిక్యం సాధించిన ఇషారాణి కీలకసమయంలో ఒత్తిడికి లోనై పాయింట్లు చేజార్చుకుంది. ప్రత్యర్థికి సెట్‌ను 21-23తో ఇషారాణి సమర్పించుకుంది.

వాణిజ్యం





## బిఎస్ఎన్ఎల్, వొడాఫోన్ టైఅప్

**న్యూఢిల్లీ,మార్చి 21:**భారతీయ టెలికాం రంగంలో పెను మార్పులకు నాంది పలుకుతూ ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్, ప్రైవేట్ రంగంలోని వొడాఫోన్,ఐడియా జతకడుతున్నాయి.ఈ ఒప్పందంలో భాగంగా రెండు సంస్థలు తమ వద్ద ఉన్న టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ , స్పెక్ట్రమ్‌ను పంచుకోనున్నాయి. దీనివల్ల కొత్తగా మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసే ఖర్చు భారీగా తగ్గుతుంది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఈ కాస్ట్ సేవింగ్ పద్ధతి రెండు కంపెనీలకు ఊపిరి పోయనుంది. ముఖ్యంగా నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన మూలధన వ్యయం తగ్గడం వల్ల, ఆ నిధులను సేవల నాణ్యత పెంచడానికి కేటాయించే అవకాశం ఉంటుంది. బీఎస్ఎన్ఎల్‌కు కుగ్రామాల్లో ఉన్న పటిష్టమైన నెట్‌వర్క్, వొడాఫోన్ ఐడియా వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది.

పట్టణాల్లో వొడాఫోన్ టెక్నా లజీ బీఎస్ఎన్ఎల్‌కు తోడ్పడుతుంది. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ ఇప్పటికే 5జీ సేవల్లో దూసుకుపోతుండగా వొడాఫోన్, బీఎస్ఎన్ఎల్‌లు ఈ భాగస్వామ్యంతో 5జీ నెట్‌వర్క్‌ను వేగంగా నిర్మించే అవకాశం ఉంది.పోటీ పెరగడం వల్ల కాల్‌రేట్లు, డేటా ప్యాక్‌ల ధరలు అదుపులో ఉండే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వొడాఫోన్ ఐడియాలో 49 శాతం వాటాను కలిగి ఉంది. అంటే ఒక రకంగా వ్రు కూడా ఇప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణలోనే నడుస్తోంది. అటు పూర్తి ప్రభుత్వ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కు, ఇటు ప్రభుత్వం వాటా ఉన్న విఐ కి మధ్య సమన్వయం కుదరడం వల్ల టెలికాం రంగంలో ప్రభుత్వ ప్రాబల్యం పెరగనుంది. ప్రస్తుతం రెండు సంస్థలు 4జీ సైట్ల అప్‌గ్రేడేషన్ కోసం భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నాయి.ఈ కీలక సమయంలో ఇరు సంస్థలు ఏకమవ్వడం వల్ల టెక్నికల్ లోపాలు తగ్గి, కాల్ డ్రాప్స్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

## ఈ వారం మార్కెట్లకు ఆరు కొత్త ఫండ్స్





**ముంబయి, మార్చి 21:** స్టాక్ మార్కెట్లలో ఐపీఓల మాదిరిగా ఎన్ఎఫ్ఓలు అంటేన్యూ ఫండ్ ఆఫర్లు విడుదలవుతుంటాయి. ఐపిఓల్లో మాదిరిగానే ఎస్ఎంఇలు కూడా ఉంటాయి.అలాగే రిటైల్ ఇన్వెస్టర్లను కూడా ఇపుడు ఫండ్స్ పెట్టుబడుల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ వారం ఆరు పథకాలు మార్కెట్లలో అందుబాటులోకి వస్తున్నాయి.ఇప్పుడు 6 స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి కూడాఒక స్కీమ్ ఉంది.

ఎస్బీఐ ఎంఎఫ్ నుంచి ఎస్బీఐ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ నడుస్తుండగా లాస్ట్ డేట్ మార్చి 24 వరకు ఉంది. కనీసం రూ. 5 వేల నుంచి పెట్టుబడి పెట్టొచ్చు. ఎడెల్‌వీస్ నిఫ్టీ లార్జ్ మిడ్‌క్యాప్ 250 ప్లస్ 8-13 జిసెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ కూడా సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉండగా ఏప్రిల్ 1 న ముగియనుంది. కనీసం రూ. 100 పెట్టుబడితో ఇందులో చేరేందుకు అవకాశం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 912 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్ మార్చి 23న ముగియనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా ఉంది. హెచ్ఎస్‌బీసీ గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగా ఈనెల 25 ఆఖరి తేదీ. కనీస పెట్టుబడి రూ. 5 వేలుగా ఉంది. ఛాయిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి 2 స్కీమ్స్ ఉన్నాయి. అవి ఛాయిస్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, ఛాయిస్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్ కూడా సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉండగా వీటిల్లో చివరితేదీ ఏప్రిల్ 2 గా ఉంది. కనీస పెట్టుబడి రూ. 1000 మాత్రమే.

## ఏప్రిల్1 నుంచే ఆదాయపు పన్ను కొత్తనిబంధనలు

**న్యూఢిల్లీ, మార్చి 21:** దేశంలో ఆదాయపు పన్నువిధానంలో చారిత్రాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.దాదాపు 65 ఏళ్లుగా అమల్లో ఉన్న 1961 నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 తీసుకువచ్చింది.ఆదాయపు పన్ను నిబంధనలు 2026"ను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఈనెల20న నోటిఫై చేసింది. ఈ కొత్త చట్టం, నిబంధనలు ఏప్రిల్ 1,2026 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

ఈ కొత్త నిబంధనల ప్రకారం, పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత, కొత్త పన్ను విధానాల మధ్య ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉంటారు. అయితే పాతపన్ను విధానాన్ని ఎంచుకునే వేతనజీవులకు ఈ మార్పులు పెద్ద ఊరటను అందిస్తున్నాయి. ఇప్పటివరకు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాల్లో మాత్రమే ఉన్న 50 ఇంటి అద్దె అలవెన్స్ మినహాయింపు పరిధిని ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు, పుణె,అహ్మదాబాద్ నగరాలకు కూడా విస్తరించారు. 8 నగరాల్లోని ఉద్యోగులు తమ జీతంలో 50 వరకు హెచ్‌ఆర్ఎ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. ఇతర ప్రాంతాల్లో ఇది 40 గా కొనసాగుతుంది. పిల్లల చదువుల కోసం ఇచ్చే ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను నెలకు రూ.100నుంచి 3,000కు పెంచారు. హాస్టల్ ఖర్చుల అలవెన్స్‌ను నెలకు రూ.300 నుంచి ఏకంగా 9వేలకు పెంచడం గమనార్హం. పన్ను విధానాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా కొత్త చట్టాన్ని రూపొందించారు.ఇందులో భాగంగా సెక్షన్ల సంఖ్యను 819 నుంచి 536కు, చాప్టర్లను 47 నుంచి 23కు తగ్గించారు. పన్ను చెల్లింపుదారులకు గందరగోళం కలిగించే "ప్రీవియస్ ఇయర్", "అసెస్మెంట్ ఇయర్" అనే పదాలను తొలగించి, వాటి స్థానంలో ఒకే "టాక్స్ ఇయర్" అనే భావనను ప్రవేశపెట్టారు.ప్రయోజనాలతో పాటు నిబంధనలను కూడా కఠినతరం చేశారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించి, రూ.2 కోట్లకు మించి లావాదేవీలు జరిపే లేదా 3 లక్షల మందికి పైగా వినియోగదారులతో సంబంధాలున్న విదేశీ సంస్థలను పన్ను పరిధిలోకి తెచ్చేందుకు సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ నిబంధనలను స్పష్టం చేశారు. కొత్త





చట్టం కింద 150కి పైగా కొత్త ఫారాలను కూడా నోటిఫై చేశారు. ఉద్యోగులకు ఇచ్చే ఫారం 16 స్థానంలో ఇకపై ఫారం 130 రానుంది.



## బులియన్ మార్కెట్‌పై వార్ ఒత్తిళ్లు
## పడిపోతున్న బంగారం, వెండి ధరలు

**ముంబయి, మార్చి 21:** ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమ ఆసియాలో యుద్ధం చుట్టూ నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రపంచ మార్కెట్లో బంగారం, వెండి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. వారాంతంలో బంగారం ధరలు మళ్లీ పడిపోయాయి. దేశీయ బులియన్ మార్కెట్, అంతర్జాతీయ మార్కెట్ రెండింటిలోనూ విలువైన లోహాల ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు 4,574.90 వద్దకు చేరింది. బంగారం, సుమారు 9.6 శాతం పడిపోయింది. ఇది సెప్టెంబర్ 2011 తర్వాత నమోదైన అతిపెద్ద క్షీణత. ఈ వారపు క్షీణత దాదాపు 15 సంవత్సరాలలో అతిపెద్ద వారపు క్షీణతను సూచిస్తుంది.

భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తుండటంతో ఇది కొనుగోలు చేయడానికి సరైన సమయమా కాదా అనే దానిపై ప్రజలు గందరగోళంలో ఉన్నారు. పెట్టుబడిదారులు కూడా ఈ క్షీణత పట్ల ఆందోళన చెందుతున్నారు. అమెరికాఇరాన్ యుద్ధం, పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి పెట్టుబడిదారులను అప్రమత్తం చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు 4,574.90కి చేరాయి. వెండి ఫ్యూచర్స్ 2 శాతానికి పైగా పడిపోయి ఔన్సుకు 69.66కి చేరాయి. వెండి వరుసగా మూడవ వారం కూడా క్షీణించింది. ఈ కాలంలో ఇది 14 శాతానికి పైగా నష్టపోయింది. ఎంసీఎక్స్‌లో 10గ్రాముల బంగారంధరలు రూ.144,825 వద్ద ముగిశాయి.బంగారం ధరలు సుమారు 8.57 మేర పడిపోయి, తీవ్రంగా క్షీణించాయి. మార్చి 2000 సంవత్సరం తర్వాత నమోదైన అతిపెద్ద వారపు క్షీణతలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. ప్రపంచ మార్కెట్లలో విస్తృతంగా జరుగుతున్న అమ్మకాలే ఈ పతనానికి ప్రధాన కారణమని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ సురేష్ కేడియా అన్నారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారంతో పాటు ఈక్విటీలు, క్రిప్టో, రియల్ ఎస్టేట్ వంటి ఇతర ఆస్తి తరగతులలో తమ స్థానాలను తగ్గించుకున్నారు. యూఎస్ బంగారం వంటి వడ్డీ లేని పెట్టుబడుల ఆకర్షణను తగ్గించాయి.

బలమైన యూఎస్ డాలర్, పెరుగుతున్న బాండ్ దిగుబడులు కూడా ధరలపై ఒత్తిడి తెచ్చాయి. లాంగ్ పొజిషన్ల అమ్మకాలు, మార్జిన్ కాల్స్ వల్ల ఈ పతనం మరింత తీవ్రమైంది. దీనివల్ల ఇది సాంకేతికంగా ప్రేరేపించినట్లుగా కనిపిస్తోంది. బంగారం ధరలు మరింత పడిపోవచ్చని ఇతర నిపుణులు కూడా భావిస్తున్నారు. ఈ ధోరణి కొనసాగితే, భారతదేశంలో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.127,000కు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సుకు 4,250కు పడిపోవచ్చు. వెండి ధరలు కూడా రెండు శాతం పతనం అయ్యాయి. రూ.4860 తగ్గి రూ.2,23,305గా కొనసాగింది.

## డిఎల్‌ఎఫ్‌లో వాటాల కొనుగోలు



**ముంబయి, మార్చి 21:** రియాల్టీ నిర్మాణరంగ దిగ్గజం డిఎల్‌ఎఫ్‌లో అంతర్జాతీయ సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మూచువల్ ఫండ్స్ 43.40 లక్షల వాటాలను కొనుగోలు చేసారు. ఈ వాటాల కొనుగోళ్ల విలువ రూ.231 కోట్లుగా ఉంది.ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారానే ఈలావాదేవీలు జరిపారు. గోల్డ్‌మ్యాన్‌శాక్స్ తన అనుబంధ ంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ ఇన్వెస్టమెంట్స్ మారిషస్ ద్వారాను, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మూచువల్‌ఫండ్స్ రెండూ చెరొక 21,70,473 షేర్లుచొప్పున కొనుగోలుచేసారు. గురుగామ్ కేంద్రంగా ఉన్న డిఎల్‌ఎఫ్ సంస్థ మొత్తం వాటాల్లో 0.17శాతం వాటాలను ఈరెండు సంస్థలు కొనుగోలు చేసారు.ఒక్కొక్క షేరు ధర రూ.531.7గా నిర్ణయించారు. బ్రిటిష్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ బైల్లీ గిఫోర్డ్ అండ్‌కో తనఅనుబంధ సంస్థలు బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అంతే మొత్తం షేర్లను విక్రయించింది. చైనా సావరిన్ వెల్త్‌ఫండ్,చైనా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌ల అధీనంలో బెస్ట్ పని చేస్తోంది. ఈడీల్‌తో డిఎల్‌ఎఫ్ షేర్లు 0.32శాతం క్షీణించాయి. బిఎస్ఇలో రూ.540.70కి చేరాయి.

## ఎఫ్‌పిఐలు రూ.88,110 కోట్ల ఈక్విటీల విక్రయం





**ముంబయి, మార్చి 21:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్చినెలలో ఇప్పటివరకూ 88,180 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. ఎన్ఎస్‌డిఎల్ డేటా ప్రకారంచూస్తే మార్కెట్‌కు మరో ఏడు రోజులున్నప్పటికీ ఈనెలలో భారీగా ఈక్విటీ షేర్లను విక్రయించి సొమ్ముచేసుకన్నారు. 2024 అక్టోబరు తర్వాత ఇదే భారీ స్థాయిలో అమ్మకాలని తెలుస్తోంది.వారాంతంలో కూడా ఎఫ్‌పిఐలు అమ్మకాలుజరిపారు. నిఫ్టీసెన్సెక్స్‌లు లాభాల్లో ముగిసినా ఎఫ్‌పిఐలు రూ.5518 కోట్లు విలువైన షేర్లు విక్రయించారు.దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం 18వ రోజు కూడా రూ.5706 కోట్ల విలువైన షేర్లను కొనుగోలుచేసారు.

ఈ వారంలోనే ఎఫ్‌పిఐలు రూ.29,897 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అదే డిఐఐలు రూ.30,641కోట్ల విలువైన షేర్లు కొనుగోళ్లుచేసారు. గత వారంలోకూడా మార్కెట్లలో ఎఫ్‌పిఐలు రూ.35,053 కోట్లు విలువైన షేర్లను విక్రయిస్తే దేశీ ఇన్వెస్టర్లు రూ.37,740 కోట్ల విలువైన షేర్లను కొనుగోళ్లు చేసారు. 2026 ఇప్పటివరకూ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.1.01 లక్షలకోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు తేలింది.

డాలరుతో రూపాయి మారకం విలువలు క్షీణించడంకూడా ఇన్వెస్టర్ల లాభాలకు కొంత కారణం అయింది. అందువల్లనే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఎక్కువ అమ్మకాలకు ఆసక్తి చూపించారు. డాలరుతో రూపాయి మారకం విలువలు వారాంతంలోఒక్కరోజే 93.70 రూపాయలకు చేరుకుంది. అందువల్లనే ఎఫ్‌పిఐలు అమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.